# ఐక్య ఉపాధ్యాయ

విద్యా విషయక మాసపత్రిక

డిసెంబర్ - 2014

సంపుటి- 40 సంచిక : 12



**సంపాదక వర్గం**

కె.జోజయ్య, ప్రధాన సంపాదకులు
సిహెచ్.సుభాష్‌చంద్రబోస్
ఐ.వెంకటేశ్వరరావు
పి.బాబురెడ్డి
కె.సురేష్‌కుమార్
ఎన్.కుమార్ రాజా


ఈ సంచికలో...


| | |
|---|---|
| విశ్వంలో విద్య | -04 |
| ఉద్యమ పితామహుడు చెన్నుపాటి | -05 |
| టీచర్ల కోసం రాజస్తాన్ అమ్మాయిలు... | -07 |
| పనితీరు సూచికలు | -09 |
| యశస్వి శ్రీనివాస రామానుజన్ | -10 |
| విశ్వ జనీనమైన మానవ హక్కులు.. | -11 |
| ఉద్యోగులు అదాయపు పన్ను | -13 |
| జ్యోతి (కథ) | -15 |
| ప్రభుత్వ రంగాన్ని కాపాడే వారిని.... | -17 |
| ప్రశ్నోత్తరాలు | -18 |
| ముఖ్యమైన ప్రాతినిధ్యాలు | -20 |
| ఢిల్లీలో జాతీయ విద్యా సదస్సు | -21 |
| ఉద్యమవార్తలు | - 22 |
| ప్రభుత్వ ఉత్తర్వులు | -31 |



| | | |
|---|---|---|
| దశాబ్దిచందా | : | ₹ 1000-00 |
| 5 సం॥ చందా | : | ₹ 550-00 |
| సం॥ చందా | : | ₹ 120-00 |
| విడిప్రతి | : | ₹ 10-00 |

SBI Online
A/c No. 30206957939



ఐక్య ఉపాధ్యాయ
యుటియఫ్ ఆఫీస్, పాలపర్తివారి వీధి,
గవర్నర్‌పేట, విజయవాడ-520002

Ph.No. : 0866-2573763
MobileNo. : 9490300573
Website : www.aputf.org.
E-mail : ikyopadhyaya@gmail.com


# మంచి రోజులా? ముంచే రోజులా?

'మీరు కొత్త స్కూటర్ కొనుక్కోవాలనుకొంటున్నారా? ఇందుకోసం ఎవరు వచ్చి ఏ పార్టు ఎంత బావుందో సర్టిఫికేట్ ఇస్తారా? మీరే స్వయంగా చూచుకొంటారు. దాన్ని నడిపే వారు మీరు. మీకంటే బాధ్యత ఎవరికుంటుంది? ఒక పరిశ్రమ యజమాని కూడా అంతే. ఒక బాయిలర్ ఎంత భద్రమైందో ఒక ప్రభుత్వ అధికారి తనిఖీ చేసి సర్టిఫికేట్ ఇవ్వడం దేనికి? యజమానికంటే భద్రత ఎవరికి అవసరమో చెప్పండి" ఇది సాక్షాత్తూ ప్రధానమంత్రి సూక్తి ముక్తావళి.

అంటే యజమానుల మీద ఏ పర్యవేక్షణా, జోక్యము ప్రభుత్వానికి అవసరం లేదన్నమాట. ఇవన్నీ వాళ్ళని వేధించడానికేనన్నమాట. వాళ్ళని స్వేచ్ఛగా వదిలేస్తే నమ్మకంగా పెట్టుబడులు పెట్టి, ఉత్పత్తులు చేసి, ప్రజల కమ్మి, ఎగుమతిచేసి సిరులు దేశంలో కురిపిస్తారన్న మాట. ఇప్పుడు చట్టాలు అడ్డమై వాళ్ళు చేతులు ముడుచుకు కూచున్నారన్నమాట!

ఇక ఫ్యాక్టరీల చట్టాన్ని పాతిపెట్టాలి. కనీస వేతన చట్టాన్ని కాలగర్భంలో కలిపెయ్యాలి. అప్రెంటిస్ షిప్ చట్టానికి సవరణలు తేవాలి. కాంట్రాక్ట్ లేబర్స్ భద్రతా క్లాజుల్ని వీలున్నంత నీరుగార్చాలి. ఇప్పటికే 60% కార్మికులకు పిఎఫ్ లేదు, ఇఎస్ఐ లేదు. కనీస వేతనం అసలే లేదు. పనిగంటలు సరేసరి. ఇప్పుడు 70% కార్మికులు అసలు కార్మిక చట్టాల పరిధిలోకే రారు! ఒకవైపు తయారీ రంగంలో కార్మికుల నికర వాటా 30% (1980) నుంచి, 9.5 శాతానికి (2010కి) పడిపోగా, యజమానుల వాటా 20% నుంచి 60%నికి పెరిగింది. అయినా దాహం చల్లారడం లేదన్నమాట. రాజస్తాన్‌లో మొదలు పెట్టి రాజ్యమంతా కార్మికుల రక్తాన్ని కారుచౌకగా మార్చే యజ్ఞం ఇప్పుడు మొదలైంది. ఇది ఇక్కడితో ఆగదు. రేపు ఉద్యోగుల, ఉపాధ్యాయుల హక్కులకూ ఎసరు పెడతారు. ఇప్పటికే మనం పెన్షన్ పోగొట్టుకున్నాం. సమ్మెహక్కు హుళక్కి అయింది.

ఉక్కు పరిశ్రమలో అమ్మకాలు ప్రారంభించారు. ప్రభుత్వ ఖజానాలోకి రూ.1715 కోట్లు జమ చేసుకొన్నారు. ఒఎన్‌జిసి నుంచి కోల్ ఇండియా దాకా, పవర్ ఫైనాన్స్ నుంచి హిందూస్తాన్ ఏరోనాటిక్స్ దాకా ఇప్పుడు బేహారుల కోసం ఎదురుచూస్తున్నాయి. బంగారు బాతులాంటి ఎల్ఐసిలో 49% ఎఫ్‌డిఐలకు తలుపులు తెరుస్తున్నారు. మరో నాలుగు ప్రభుత్వ భీమా సంస్థలు త్వరలో కనుమరుగు కానున్నాయి. ఇప్పటికే ద్రవ్య పొదుపు దేశంలో బాగా తగ్గిపోయింది. నమ్మకాలు సన్నగిల్లి బ్యాంకుల నుంచి, భీమా నుంచి తప్పుకొని బంగారం వైపు, భూముల వైపు జనం మళ్ళుతున్నారు. ఫలితంగా పెట్టుబడులు కరువవుతున్నాయి.

నవరత్నాలనే అముతున్న వాళ్ళకు రేపు మన స్కూళ్ళు, కాలేజీలు, విశ్వ విద్యాలయాలు ఒక లెక్కలోనివిగావు. రాజస్తాన్ మహారాష్ట్రాల్లో వేలాది స్కూళ్ళు మూసినా, ప్రైవేట్ యూనివర్శిటీల బిల్లు తెస్తున్నా ఇవన్నీ ఆ దారిలోనివే.

ఇన్ని తెలిసి ప్రభుత్వం ఎందుకిలా చేస్తున్నట్టు? ఎన్నికల్లో గెలవడానికి బడా కంపెనీలే పెట్టుబడులు పెట్టాయి. వారికి వడ్డీతో సహా వసూలు కావాలి. గెలిచింది కుబేరులూ, వారి తాబేదార్లూ. వారు దేశాన్ని పిండి పీల్చుకోవాలి. పైకి మాత్రం దేశాన్ని 'విశ్వగురు' చేస్తామంటారు, 'ప్రపంచశక్తి'గా మారుస్తామంటారు. దేశదేశాలు తిరగడం దేశాన్ని తాకట్టు పెట్టడానికన్నమాట.

ఇప్పుడు కార్మికలోకం గర్జిస్తోంది. కదం తొక్కుతోంది. ఒక తాటి మీదికొచ్చి తాడో పేడో తేల్చుకొంటామంటున్నది. మనం ఉపాధ్యాయులం కూడా చేతులు కలుపుదాం. రానున్న ప్రమాదాల్ని పసిగట్టి పోరుబాట వెతుక్కొందాం.

## స్వీడన్ రాజకీయ ఎజెండాలోకి చేరిన విద్య

### విద్యారంగంలో మంచి పరిణామాలు

కొత్తగా ఎన్నికైన స్వీడన్ విద్యాశాఖమంత్రి బోధనావృత్తి పునఃనిర్మాణానికి సహకరించే విధానాల రూపకల్పన చేపట్టనున్నారు. ఉపాధ్యాయులు ఏమిబోధించాలి, ఎలా బోధించాలి అనే అంశాలను రాజకీయ నాయకులు నిర్దేశించడాన్ని నిలిపివేయాలని భావిస్తున్నారు. ఉపాధ్యాయునిగా పనిచేసిన స్వీడన్ విద్యాశాఖమంత్రి, స్వీడన్ ఉపాధ్యాయ సంఘ సమావేశంలో మాట్లాడుతూ, స్వీడన్ ప్రభుత్వం, పూర్వ ప్రాథమిక, ప్రాథమిక విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా నొక్కి చెప్పారు.

గత ప్రభుత్వం, బోధనావృత్తికి సహకరించని విద్యాసంస్కరణలను అమలుచేస్తూ, ఉపాధ్యాయుల పనిభారం పెంచి, వేతనాలు మాత్రం పొరుగున ఉన్న దేశాలకంటె తక్కువగా చెల్లించింది. దీనితో 2013 పి.ఐ.ఎస్.ఎ. రిపోర్టులో స్వీడన్ స్థాయి అవమానకర స్థితికి దిగజారడంతో దేశం నిర్ఘాంతపోయింది. ఈ పరిస్థితి దేశ రాజకీయ ఎజెండాలోకి విద్య వచ్చేవిధంగా చేసింది. సెప్టెంబర్‌లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 60 శాతం ప్రజలు విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలనుకునే రాజకీయ పార్టీకి మాత్రమే ఓటువేస్తామని అన్నారు. స్వీడన్ ప్రధానపత్రిక ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తూ "స్వీడన్ ఉపాధ్యాయులే నిజమైన విజేతలు అని, ఇపుడు ప్రతి ఒక్కరు ఉపాధ్యాయులను ఇష్టపడతారు" అని వ్యాఖ్యానించింది. గతకొన్ని సంవత్సరాలుగా ఉపాధ్యాయ సంఘాలు చేసిన కృషి ఫలితంగానే ఈ మంచి పరిణామాలు సాధించగలిగామని స్వీడన్ ఉపాధ్యాయ సంఘనాయకులు తెలిపారు.

### జాతీయ సమ్మెలో పాల్గొన్న బెల్జియం ఉపాధ్యాయ సంఘాలు

బెల్జియం ఫెడరల్ ప్రభుత్వం చేపట్టిన, ఉపాధ్యాయులను తీవ్రంగా ప్రభావితం చేసే ఆర్థిక సంస్కరణలను వ్యతిరేకిస్తూ నవంబర్ 6న తలపెట్టిన జాతీయస్థాయి సమ్మెలో బెల్జియం ఉపాధ్యాయ సంఘాలు పాల్గొంటూ 1,00,000 మంది ప్రదర్శకులు వీధుల్లోకి వచ్చారు.

జాతీయ సమ్మె సందర్భంగా ఉపాధ్యాయ సంఘాలు విధాన నిర్ణేతలతో ఏర్పాటు చేసిన నిర్మాణాత్మక సమావేశంలో, ఉపాధ్యాయుల అవసరాలను మరియు రాజకీయ విధానాలు బోధనావృత్తిని ఏ విధంగా ప్రభావితం చేస్తాయి అనే అంశాలను చర్చించారు. సబ్సిడీల తగ్గింపు, ఉద్యోగుల తగ్గింపు, విద్యపై ఖర్చు తగ్గించడం వంటి ప్రభుత్వ విధానాలను ఉపాధ్యాయ సంఘాలు ఖండించాయి. ఈ విధానాల వలన నాణ్యమైన విద్యకు విఘాతం కలుగుతుందని అణచివేత విధానాలకు వ్యతిరేకంగా "ఐక్య ఉపాధ్యాయ పోరాటశక్తిగా" ఉద్యమించాలని ఉపాధ్యాయ సంఘనాయకులు పిలుపునిచ్చారు. దశలవారి పోరాటాల్లో భాగంగా నవంబర్ 24న, డిసెంబర్ 1న, డిసెంబర్ 8న ప్రాంతీయసమ్మె మరియు డిసెంబర్ 15న జాతీయస్థాయిలో సమ్మె చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు.

### ఉచిత విద్య కోరుతున్న విద్యార్థి సంఘాలు

పూర్వ విద్యార్థుల పోరాటాలకు, ప్రత్యేకించి 1939లో ప్రాగ్యులో ఛార్లెస్ యూనివర్సిటీ వైద్య విద్యార్థులు చేసిన ప్రదర్శనల్లో చనిపోయిన విద్యార్థి జాన్ ఆప్లెటల్ స్మృతిగా నవంబర్ 17న అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవం జరుపుతున్నారు. ఈ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా 80 పైగా విద్యార్థి సంఘాలు ఉచితవిద్యను డిమాండ్ చేస్తున్నారు. సంస్మరణ సందర్భంగా ప్రస్తుతకాలంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సవాళ్లపై దృష్టిసారిస్తూ, రానున్న 2015 అభివృద్ధి ప్రణాళికలో, ప్రపంచ విద్యా ప్రణాళికా చట్టాన్ని రూపొందించుటకు ప్రపంచవ్యాప్త విధాన కర్తలను 2014లో ఒక చోట చేర్చి సాధారణ విద్యార్థుల ఆశలను అవసరాలను తెలిపేవిధంగా, 58 కామన్వెల్త్ దేశాల నుండి నేషనల్ స్టూడెంట్స్ యూనియన్స్ 53 కామన్వెల్త్ దేశాలలోని కామన్వెల్త్ స్టూడెంట్ అసోసియేషన్స్ (సి.ఎస్.ఎ.) చర్యలు చేపట్టాయి.

### భారత్‌లో ప్రభుత్వ పాఠశాలలను భయపెడుతున్న ప్రైవేటైజేషన్

ఇండియాలోని మూడున్నర మిలియన్ల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల్లో 7 లక్షల మంది పారా టీచర్స్ ఉన్నారని, వీరిలో సగం మంది అర్హతలు లేనివారని, ఇలాంటి పరిస్థితుల్లో నాణ్యమైన విద్యను అందించాలంటే విద్యాహక్కుచట్టం అమలు చేయాలని ఆల్ ఇండియా ప్రైమరీ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ (ఎఐపిటియఫ్) సంఘ నాయకులు అన్నారు. పాఠశాలల్లో నాణ్యమైన సామాగ్రి మరియు రక్షణ, ఆరోగ్యకర వాతావరణం ఉండాలని (ఎఐపిటియఫ్) కోరుతుందని, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇండియాలో మధ్యతరగతి ప్రజలు వారి పిల్లలను అధ్వాన్న పరిస్థితులు ఉన్న పాఠశాలల్లో చదివించడానికి ఇష్టపడడం లేదని, ఇండియాలో 80 శాతం ప్రభుత్వ పాఠశాలు ఉన్నప్పటికి, 2030 సం॥నాటికి 50 శాతానికి తగ్గవచ్చునని, పేద ప్రజలు ప్రైవేట్ పాఠశాలల ఫీజులు చెల్లించలేరని, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఉపాధ్యాయులను యూనియన్లలో చేరవద్దని కట్టడి చేస్తారని, ఆ విధంగా వారి పనిపరిస్థితులు అధ్వాన్నంగా మారతాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వవిద్యకు నిధులు పెంచి, విద్యాహక్కుచట్టాన్ని అమలుచేస్తూ ప్రమాణాలు పెంచడానికి మెరుగైన ఉపాధ్యాయులను ఎక్కువ సంఖ్యలో నియమించడమే ప్రభుత్వ విద్యారంగ పటిష్టతకు పరిష్కార మార్గమని (ఎఐపిటియఫ్) సంఘనాయకులు సూచించారు.

### ఆఫ్రికాలో విద్యా ప్రైవేటీకరణను ఖండిస్తున్న పౌరసమాజం

ఆఫ్రికాలో అభివృద్ధి దిశగా మిలీనియం డెవలప్‌మెంట్ గోల్స్ 2014 రిపోర్ట్ వెలువరించింది. ఈ రిపోర్టులో ప్రైవేటు విద్యారంగానికి ప్రాధాన్యత ఇవ్వడాన్ని ప్రపంచ మానవ హక్కులఫోరం ఎడ్యుకేషన్ ఫోరం, 30 పైగా ఆఫ్రికా మరియు ఇంటర్నేషనల్ సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్స్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రైవేటీకరణ విధానాలు అసమానతలను పెంచుతాయని, నాణ్యతాలోపాలుంటాయని విద్య సరుకుగా మారుతుందని, ప్రపంచ మానవహక్కుల ఫోరం మరియు ఎడ్యుకేషన్ ఫోరం సంయుక్త ప్రకటన వెలువరిస్తూ 2014 మిలీనియం డెవలప్‌మెంట్ గోల్స్ రిపోర్ట్ 2014 నిలిపివేయాలని కోరాయి. విద్యార్థుల స్కూల్ ఫీజు విద్యాభివృద్ధికి ఆటంకమని, ఫీజు తొలగింపు వలన ఆఫ్రికాలో 2000 నుండి ప్రాథమిక పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ ప్రత్యేకించి బాలికల ఎన్‌రోల్‌మెంట్ నాటకీయంగా పెరగడమే దానికి నిదర్శనమని, విద్యా ప్రైవేటీకరణ అంతర్జాతీయ మానవ హక్కుల చట్ట ఉల్లంఘనకు దారితీస్తుందని సంఘనాయకులు తెలిపారు. ఘనా, మొరాఖో, ఉగాండా, చిలి మరియు కెన్యా దేశాల్లో జరుగుతున్న విద్య ప్రైవేటీకరణపై చేసిన పరిశోధనల్లో విద్యాహక్కు చట్టం, వివక్ష రహిత హక్కు చట్టం, ఉల్లంఘన జరుగుతున్నట్లు, ప్రైవేటు పాఠశాలల పర్యవేక్షణ వ్యవస్థలో లోపాలు గమనించామని అన్నారు. నాణ్యమైన విద్య పొందడానికి అర్హతలుగల ఉపాధ్యాయులు, శిక్షణ మరియు మంచి పనిపరిస్థితులు మాత్రమే కీలక అంశాలని సంఘనాయకులు తెలిపారు.

### నాణ్యమైన విద్యకై నిధులుకోరుతున్న జర్మనీ ఉపాధ్యాయ సంఘాలు

శిశుతరగతినుండి సాంకేతిక విద్య మరియు శిక్షణ వంటి అన్ని స్థాయిల్లో నాణ్యమైన విద్య అందడానికి సరిపోయినంత నిధులకే కేటాయించాలని జర్మని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. పాఠశాలలో సక్రమంగా పనిజరగడానికి తరగతిగదులలో విద్యార్థులసంఖ్య తగ్గించి ఉపాధ్యాయుల సంఖ్య పెంచాలని, జనాభా గణాంకాలననుసరించి జనాభా పెరిగి మరియు విద్యార్థుల సంఖ్య క్షీణించినట్లు గమనించవచ్చు. అదనపు ఉపాధ్యాయులను మిగిలిన విద్యార్థుల బోధనకు వినియోగించవచ్చునని, దీనికొరకు అదనంగా 7,000, 10,000 ఉపాధ్యాయ పోస్టులు అవసరమని జర్మనీ ఉపాధ్యాయ సంఘం (విబిఇ) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

### అందరికీ విద్య లక్ష్యంగా విద్యా ప్రణాళికా చట్టం రూపకల్పన

రానున్న 2015 సం॥ విద్యాభివృద్ధి ప్రాంతీయ ప్రాధాన్యతల ఎజెండాగా, లాటిన్ అమెరికాలోని లైమాలో అందరికి విద్య అనే అంశానికి సంబంధించి జరిగిన మినిస్టీరియల్ రీజినల్ మీటింగ్‌లో మంత్రులు, విద్యారంగ అధికారులు, యునెస్కో ప్రతినిధులు మరియు ఉపాధ్యాయ సంఘ సభ్యులు హాజరయ్యారు. సమాజ అవసరాలు తీర్చగలిగే విద్యావిధానాల ఆవశ్యకత గురించి మంత్రులు మరియు అధికారులు చర్చించారు. ఈ విధానాలలో ఉపాధ్యాయుడు కేంద్రంగా ఉండాలని పార్టీలకు అతీతంగా అన్నివేళలా ప్రభుత్వాలు ఉపాధ్యాయ వృత్తి బలోపేతానికి సహకరిస్తూ ప్రోత్సహించడం అవసరమని ప్రొఫెసర్ జోస్‌వైన్‌స్టెయిన్ అన్నారు. విద్యా ప్రణాళికా చట్రం రూపకల్పనలో మేధావుల భాగస్వామ్య ప్రాధాన్యతను గురించి చర్చించారు.



## ఉద్యమ పితామహుడు

# కీ॥శే॥ చెన్నుపాటి లక్ష్మయ్య

ఉపాధ్యాయ ఉద్యమంలో ఎంతో మంది నాయకులు తమ జీవితాలను త్యాగంచేసి అమరులైనారు. కానీ వారెవ్వరిని ఉద్యమ పితామహులని పిలువడం లేదు. భారత స్వాతంత్ర పోరాటంలో ఎంతో మంది నాయకులు పాల్గొన్నా, గాంధీగారికి మాత్రమే స్వాతంత్రోద్యమ పితామహుడని పిలిపించుకునే భాగ్యం దక్కింది.

ప్రతి సంవత్సరం డిసెంబర్ 9న చెన్నుపాటి వర్ధంతి జరుపుకుంటున్నాం. వారి సేవలు, వ్యక్తిత్వం గురించి స్మరించుకుంటున్నాం. ఎందుకంటే ఈనాటి ఉపాధ్యాయులలో చెన్నుపాటిని చూసినవారు లేరు. 1947 నుండి ఈ నాటి వరకు మనం అనుభవిస్తున్న సౌకర్యాలు గాని, ఉద్యోగ రక్షణలు గాని అయాచితంగా వచ్చినవికావు. చెన్నుపాటి గారి నాయకత్వాన సాగిన పోరాటాల ఫలితమే ఈ సౌకర్యాలు కాలక్రమంలో జరిగిన పోరాటాల ఫలితంగా అనేక సౌకర్యాలు సాధించుకొని ఉండవచ్చు కాని పునాది మాత్రం 1942 నుండి 1968 వరకు చెన్నుపాటి వేసిన బాట మాత్రమేనని గుర్తించుకోవాలి.

చెన్నుపాటి గుంటూరు జిల్లా నరసరావుపేట వేలూరు గ్రామంలో 1910లో జన్మించారు. వారిది పేదకుటుంబం పెద్ద చదువులు చదువుకునే శక్తి లేదు.

హయ్యర్‌గ్రేడ్ ట్రైనింగ్ పొంది వేలూరులో జిల్లా బోర్డులో ఉపాధ్యాయుడుగా జీవితం ప్రారంభించారు. ఆ రోజుల్లో స్వేచ్ఛగా సంఘాలు పెట్టుకొనే వీలులేదు. మేనేజ్‌మెంట్ల వారి సంఘాలు పెట్టుకోవచ్చు. కాని నాయకత్వం వహించాలంటే మేనేజ్‌మెంట్ అనుమతిపొందాలి. దీనిని సవాలు చేస్తూ గుంటూరు తాలూకా ఎయిడెడ్ టీచర్సు యూనియన్ తరఫున రాష్ట్రంలోని రికగ్నిషన్ పొందిన వివిధ యూనియన్ ప్రతినిధులను ఆహ్వానించి రాష్ట్రస్థాయి కార్యకర్తల సమావేశం జరిపారు. దీనిలో 24 సంఘాలకు చెందిన 63 మంది పాల్గొన్నారు. 416 జి.ఓ.కు వ్యతిరేకంగా తీర్మానం చేశారు. 1947లో చేసిన ఆందోళన ఫలితంగా 1947 జూన్ 5 ఉపాధ్యాయుల జీతాలు 50 నుండి 150 శాతం పెరిగాయి. ఉపాధ్యాయులలో ఉత్సాహం పెరిగింది.

ప్రభుత్వ అనుమతి లేకుండా ఉపాధ్యాయులు సంఘాలు పెట్టుకోకూడదన్న 416 జి.ఓ.కు వ్యతిరేకంగా మద్రాసు హైకోర్టులో దావావేసి ఆ జి.ఓ.ను రద్దుచేస్తూ మద్రాస్ హైకోర్టు తీర్పు (19.10.51) సాధించారు ఉపాధ్యాయ సంకెళ్ళు బ్రద్దలయినాయి. ఈ కేసు ప్రముఖ లాయర్లు ఉచితంగా వాదించారు. ఖర్చులకు ఉపాధ్యాయులు భారీ విరాళాలిచ్చారు. నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేట సెంటరు క్లాసులో మహిళలు వారి వంటిమీద నగలు యిచ్చారు. ఈ పోరాట విజయం ఉద్యమ బాటను మలుపుతిప్పింది.

1952లో మద్రాస్ శాసనమండలి ఎన్నికలు జరిగాయి. నాయకుడుగా ఉన్న చెన్నుపాటి పోటీ చేయకుండా కీ.శే. సింగరాజు రామకృష్ణయ్య గారిని బరిలో దింపి గెలిపించారు.

దాని ఫలితంగా ప్రాథమిక ఉపాధ్యాయులలో ప్రాథమికోపాధ్యాయ ఫెడరేషన్, సెకండరీ ఉపాధ్యాయులలో గిల్డు బలపడ్డాయి.

1962-64 ఎన్నికలలో సర్కారు, రాయలసీమ జిల్లాలో గల 6 నియోజకవర్గాలలో 6గురు ఫెడరేషన్ బలపరచిన అభ్యర్థులు గెలిచారు. పి.శ్రీరామమూర్తి చెన్నుపాటి లక్ష్మయ్య, సింగరాజు, విజయరామరాజు, కూర్మాచార్యులు.

చెన్నుపాటి వ్యక్తి గత జీవితం గూర్చి ఈ సందర్భంగా చెప్పుకోవాలి. ఆయన సాధారణ జీవితం గడిపారు. ఎమ్మెల్సీగా వచ్చిన జీతం, అలవెన్సులు సంఘానికిచ్చి, సంఘం యిచ్చిన అలవెన్సుతోనే జీవించారు. భార్యకు జబ్బుచేస్తే వైద్య ఖర్చులు భరించలేక ఆమెను కోల్పోయారు. ఆమె మరణించిన వార్త రాష్ట్ర కౌన్సిల్‌లో సమావేశంలో తెలిసినా సమావేశం ముగిసిన తర్వాతే వెల్లడించి మూర్ఛపోయారు. వారి కుమారుడు ఇంటికి దూరమైనా దానిని తట్టుకొని నిలిచారు. ఉద్యమ నిర్మాణంలో కార్యకర్తల యిండ్లలో కుటుంబ సమస్యలు తెలుసుకుని కార్యకర్తలకు అవసరమైన తోడ్పాటు ఇచ్చేవారు.



డి.రామిరెడ్డి
Ex.MLC

రాష్ట్ర కార్యాలయంలో వండుకొని తింటూ జీవించేవారు వారికి జలోదర వ్యాధి వచ్చి డబ్బు అవసరమైనా సంఘ డబ్బులను వాడుకోక కార్యకర్తలు అందించిన సహకారంతో వైద్యం పొందారు. ఆయన మరణానంతరం యింత నిజాయితీ పరుడైన వ్యక్తి ప్రతిష్టను దెబ్బతియాలని కొందరు వారు సంఘం డబ్బులు తిన్నారని గుసగుసలు పుట్టించారు. అధికార సమావేశంలో ఈ ఆరోపణలు రుజువు చేయమని సవాలు చేయగా తోకముడిచి వాటిని ఉపసంహరించుకున్నారు.

చెన్నపాటి జీవితం మచ్చలేనిది. అందుకే మనం వారి బాటలోనే పయనిస్తున్నాం. మన తొలి భవనానికి వారిపేరు పెట్టుకున్నాం. త్వరలో వారి కాంస్య విగ్రహాన్ని ఆఫీసులో ఆవిష్కరిద్దాం.

మన ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కార్యకర్తల్లో కూడ ఇటీవల కొన్ని జాడ్యాలు ప్రారంభమైనాయి. పార్లమెంటరీ భ్రమల్లో కొట్టుకుపోరాదు. ఆర్థిక క్రమశిక్షణ గాడి తప్పరాదు. చెన్నుపాటి వర్ధంతి సందర్భంలోనైనా వారి ఆశయాలు, అలవాట్లు స్మరించుకోవాలి. వారి బాటలో నడవడానికి పునరంకితం కావాలి.

# బోధనలో స్వేచ్ఛ




సి.వి. క్రిష్ణయ్య
విద్యా పరిశోధన విభాగం
జన విజ్ఞాన వేదిక


స్వేచ్ఛా పూరిత వాతాలవరణంలోనే మానసిక వికాసం జరుగుతుంది. స్వేచ్ఛగా ఆలోచించడం, స్వేచ్ఛగా అభిప్రాయం తెలుపడం, నిర్భయంగా ఖండించడం. నిజానికి నిస్సంకోచంగా అంగీకరించడం ఇవన్నీ ఎక్కడ ఉంటాయో అక్కడ జ్ఞానం వికసిస్తుంది.

అవసరాలు, అభిరుచులు ఆసక్తులు మనుషుల్ని నేర్చుకోడానికి పురికొల్పుతాయి. అనాసక్తి అయిష్టత, సిగ్గు, బిడియం వంటివి నేర్చుకోడానికి ఆటంకాలుగా మారుతాయి. నిర్బంధాలు, వత్తిళ్ళు వ్యతిరేకతనున కల్పిస్తాయి.

ఈ సూత్రం పిల్లలకే కాదు పెద్దలకూ వర్తిస్తుంది. విద్యార్థుల తోపాటు టీచర్లకూ వర్తిస్తుంది. విద్యార్థి పాఠాలు అర్థంచేసుకోవాలంటే క్లాస్ రూంలో స్వేచ్ఛాపూరిత వాతావరణం ఉండాలి అంటున్నాం. ఇది నిజమే. మరి ఈ స్వేచ్ఛ బోధనలో ఉపాధ్యాయులకు అవసరం లేదా? పిల్లలకు ఏ విషయాలు ఎలా బోధించాలో, ఎప్పుడు బోధించాలో, ఆలోచించుకొనే స్వేచ్ఛ టీచరుకు అవసరం లేదా?

మనం నిరంతరం పిల్లల స్వేచ్ఛ గురించే ఆలోచిస్తున్నాం తన పనిలో టీచరు స్వేచ్ఛగా ఆలోచించే అవకాశం ఇవ్వడం లేదనే సంగతి గుర్తించలేకున్నాం. టీచర్లకు స్వేచ్ఛ ఉంటే అది పిల్లలకూ దక్కుతుంది. స్వేచ్ఛగా ఆలోచించే వాళ్ళు, స్వేచ్ఛగా తమ పనిచేసుకోగలవాళ్ళు మాత్రమే స్వేచ్ఛలో ఉండే గొప్పతనం గుర్తించగలరు.తాను బానిసగా ఉన్న నాడు మరొకరి స్వేచ్ఛ గురించి ఆలోచించలేడు.

విద్యార్థి, టీచరు వీళ్ళిద్దరూ స్వేచ్ఛను ఎక్కడ కోల్పోతున్నారోచూద్దాం. అసలు బోధన అంటే ఏమిటో తెలుసుకొందాం.

"పాఠ్య పుస్తకాలు ఉన్నాయి. వాటిలో పాఠాలు పిల్లలు చదవాలి. అర్థం చేసుకోడానికి ప్రయత్నించాలి. సందేహాలు వచ్చినప్పుడు అవసరమైన నోట్సు తానేరాసుకోవాలి. ఇందుకు టీచరు సహకరిస్తూ ఉంటాడు. ప్రోత్సహిస్తూ ఉంటాడు. ఇదే కదా బోధన అంటే.

కానీ జరుగుతున్నది ఏమిటి? ఈ పని పిల్లలు చేయలేరని తామే పాఠం చదవి, తామే అర్థం చేసుకొని, తామే ప్రశ్నలు జవాబులు రాసి టీచరు పిల్లలకిస్తారు. ఇప్పుడు ఈ పని కూడా టీచర్లు చేయనవసరం లేదు. ఈమెటీరియల్ పాఠశాల యాజమాన్యమే తయారుచేసి ఇస్తున్నది. లేదా మార్కెట్టులో దొరుకుతుంది. ఇక టీచరు పిల్లలను అర్థం చేసుకొనే అవసరమేలేదు. పిల్లలు జవాబులు రొప్పుతూ మింగుతూ, కక్కుతూ ఉంటే టీచరు కాపలాకాస్తాడు. ఇదే గదా జరుగుతున్నది.

చదువు మొత్తంలో కీలకమైనదీ అర్థం చేసుకోవడం" దీన్ని వదిలి పెట్టిన తర్వాత మనం ఏ స్వేచ్ఛను గురించి మాట్లాడుకోవాలి? స్వేచ్ఛ కావాల్సింది అర్థం చేసుకోవడానికి? ఆ "అర్థం చేసుకోవడం" అనేది లేనప్పుడు స్వేచ్ఛకు అర్థం లేదు.

టీచర్లు, పిల్లలూ చదువులో ఈ స్వేచ్ఛను పోగొట్టుకొన్న తరువాత, విజ్ఞానమూ లేదు. వికాసమూ లేదు.

మొత్తం చదువుల సంత ఇలా సాగుతున్నప్పుడు సంస్కరించకుండా చేసే ఏ పని వలనా ప్రయోజనం ఉండదు.

టీచర్లపైనా పాఠశాలలపైన తనిఖీలు చేసే అధికారులూ, విద్యాశాఖ లో పనిచేసే బోధనా నిపుణులూ, పాఠ్య పుస్తకాల రచయితలూ నిరంతరం ఉపాధ్యాయులకు రకరకాల శిక్షణలు ఇస్తూ ఉంటారు. ఈ పాఠం ఇలా చెప్పాలి. ఆ పాఠం అలా చెప్పాలి అంటూ ఉపాధ్యాయుల కాలాన్ని సహనాన్ని పరీక్షిస్తూ ఉంటారు. టీచర్లకు ఏమి తెలియదని అంతా పై నుండి అందించాలనుకొంటారు. చివరకు ఇదికూడా ఉపయోగంలేదని పిల్లలు గట్టేక్కే మార్గాలు చూపిస్తూ చెప్తూ ఉంటారు. ఇదిగో ఇది చదివించండి అంటూ పరీక్షల ముందు మెటీరియల్ పంపిస్తారు.

పరీక్షల్లో మార్కుల్ని ర్యాంకుల్నిజూసి మురిసిపోతుంటాం. ప్రతి సంవత్సరం పెరుగుతున్న ఉత్తీర్ణతలన్నీ చూసి అభివృద్ధి జరుగుతుందని సంతోష పడతాం. లోలోపల అందరికీ తెలుసు ఇందులో ఏదో తిరకాసు ఉందని. ప్రతి ఒక్కరికీ ఇంగిత జ్ఞానం అనేది ఒకటుంటుంది. అప్పుడప్పుడు అది మేల్కొంటుంది. మార్కులు తీసి గ్రేడులు పెట్టుకొన్నాం. ఇది మంచిదే దీంతో ఏమీ లాభం ఉండదని మనకు తెలుసు. ఇంకా తీవ్రంగా ఆలోచిస్తాం. కొన్నాళ్ళకు పరీక్షలు దండగ అనుకొంటాం. వాటినీ తీసేస్తాం. అది మరీ మంచిది. కనీసం పిల్లలు భయాల నుంచి అవమానాల నుండి విముక్తులవుతారు. అప్పుడైనా మార్కుల కోసం చదివే ఉత్తుత్తి చదువులు మానేస్తారు. జ్ఞానం కోసం చదువుతారు. అర్థం చేసుకొంటూ చదువుతారు. అర్థం చేసుకోవడం ఆరంభమయితే అది ఆనందగానే ఉంటుంది. ఇంత మంచి పని అంత తొందరగా జరుగుతుందా? చాలా కాలం పట్టవచ్చు.

పరీక్షలు తీసేయడమా! ఇంకేమైనా ఉందా? టీచర్లు పాఠాలు చెబుతారా? పిల్లలు ఎందుకు చదువుతారు? ఇలాంటి ప్రశ్నలూ అనుమానాలు భయాలూ చాలా ఉంటాయి.

పరీక్షలు ఎప్పుడూ ఉంటాయి. కాకపోతే ఇప్పుడు జరిగేపరీక్షలు జ్ఞాపకశక్తికి పరీక్షిస్తే అప్పుడు జరిగే పరీక్షలు జ్ఞానాన్ని బుద్ధిబలాన్ని పరీక్షిస్తాయి. అంతేతేడా ఇప్పుడు రొప్పుడుగాళ్ళు, సృజనాత్మకశక్తి కోల్పోయిన వాళ్ళు లోకజ్ఞానం లేనివాళ్ళు ఉండరు. ఇదంతా భవిష్యత్తును గురించిన కలలు సాకారంచేసుకొనే శక్తి మానవ సమాజానికి ఉందని తెలుసుకోండి.

మళ్ళీ మనం స్వేచ్ఛ దగ్గరికొద్దాం. ఎన్ని నియమాలూ నిర్బంధాలు ఉన్నప్పటికీ కొందరు తమ స్వేచ్ఛను కోల్పోరు. సృజనాత్మకతను పోగొట్టుకోరు. ప్రవాహానికి కొట్టుకొని పోరు. ఏటికి ఎదురు ఈది నిలబడతారు. ఇలాంటి టీచర్లు ఎందరో ఉన్నారు.




# రాజస్థాన్ అమ్మాయిల రాజ్య ధిక్కారం!

దేశమంతా ఎక్కడెక్కడి నాయకులూ వీధుల్లో కొచ్చి చీపుర్లు పట్టుకొని కెమరాలకు కొత్తకొత్త ఫోజులిస్తూ గాంధీజీపేర హంగామా చేస్తున్నవేళ – అంటే అక్టోబర్ 2న రాజస్థాన్‌లోని 'భీమ్' పట్టణం ఆడపిల్లల నినాదాలకు ఉలిక్కిపడి లేచింది. మొదట చాలా మంది ఇది 'స్వచ్ఛభారత్' ర్యాలీయే కాబోలుననుకొన్నారు. కానీ వాళ్ళ నినాదాలూ, ప్లేకార్డులూ, 500 మంది అమ్మాయిలు యూనిఫారంలో చేస్తున్న కవాతులాంటి ప్రదర్శన విన్నాకా చూచాకా ఊరుఊరంతా ఇళ్ళల్లోంచి వీధుల్లోకి వచ్చేసింది. వాళ్ళ వెనకాముందూ ఏ నాయకులూ లేరు. అర్థంకాని అరుపులేమీ లేవు. వాళ్ళు అడుగుతున్నదొక్కటే 'మాబడికి టీచర్లు కావాలి' అని!



వి.బాలసుబ్రహ్మణ్యం
ఎమ్మెల్సీ

అవును గాంధీజీకి అసలు వారసులు వీరే. నిజమైన గాంధీ జయంతి జరుపుతున్నదీ వీరే. వాళ్ళది అహింసా యుత ధిక్కారం. అత్యంత క్రమశిక్షణాయుత ధిక్కారం. ఇంకేముంది చీపుళ్ళ నాయకులకు కెమరాలు మిగిలాయి. అమ్మాయిలకేమో వేలమంది తోడయ్యారు.

అసలు విషయమేమంటే భీమ్‌లో ఒక ప్రభుత్వ బాలికల హైయర్ సెకండరీ స్కూలుంది. అందులో 9 నుంచి 12 తరగతుల్లో 700 మంది అమ్మాయిలున్నారు. టీచర్లు మాత్రం ముగ్గురేముగ్గురు. ప్రిన్సిపాల్ వెళ్ళిపోయి ఎనిమిదేళ్ళు. గణితం, సైన్సు చరిత్ర, భూగోళం, సంస్కృతం లాంటి ఏ సబ్జెక్టుకూ టీచర్లు లేరు. 11 పోస్టులు 10 ఏళ్ళ నుండి ఖాళీ! హైస్కూలును హయ్యర్ సెకండరీగా అప్‌గ్రేడ్ చేసి ప్రభుత్వం చేసిన నిర్వాకమిది. పాఠశాల మాత్రం బ్లాక్ అభివృద్ధి అధికారి ఆఫీసుకు కూతవేటు దూరంలో వుంది. ఎన్నిసార్లు అడిగినా, ప్రాధేయపడ్డా దిక్కుమొక్కూ లేదు. అధికార్ల పిల్లలూ, నాయకుల పిల్లలూ ప్రైవేటు స్కూళ్ళలో చదువుతున్నారు. ఈ స్కూలు పిల్లలందరూ పేద పిల్లలు. 15–20 కి.మీ. దూరం నుండి – కొందరైతే రోజుకు రు. 20 కూడా ఖర్చుచేసి వస్తున్న పిల్లలు. వీళ్ళగోడు ఎవరు వింటారు? వీళ్ళ గొడవ ఎవరికి కావాలి?

పిల్లలు చాలా రోజులు ఓపికపట్టారు. ఒక సర్కారు మారింది మరొక సర్కారు వచ్చింది. మహిళా ముఖ్యమంత్రి వచ్చారు. జరిగింది మాత్రం శూన్యం. దీంతో అంతా కూచుని ఓ నిర్ణయానికి వచ్చారు. ఇక బడికి తాళం వేయాలి. టీచర్లు వస్తేనే బడి తెరవాలి. బడిమూసేశారనే నింద రాకుండా టెంట్లు వేసుకొని బడి బయటే క్లాసులు జరపాలి. అందరూ చూచేలా, సిగ్గుపడేలా ఇదంతా జరగాలి. ఎంతకాలమైనా ఇలానే చెయ్యాలి. ఇదీ వీళ్ళ నిర్ణయం! ఆశ్చర్యంగా వుంది. గదూ! చీపుర్ల నాయకుల్ని చీపుర్లతో ఊడ్చేసినట్టుంది గదూ!

అయినా అమ్మాయిలకు ఎవరో ఒకరు తోడుంటే మంచిదన్పించింది. 'మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన' కార్యకర్త శంకర్ సింగ్‌ను సలహా, సాయం అడిగారు. ఆయన వాళ్ళని అనునయించి 'మీ తల్లిదండ్రుల్నీ తీసుకురండి. అందరం కలిసి పిటిషన్ పెడదాం' అన్నాడు. వాళ్ళమ్మా నాన్నలు దినకూలీలు. దూరంగా 15–20 కి.మీ.ల గ్రామాల్లో వున్నవాళ్ళు. ఏం వస్తారు? అయినా ఎన్ని పిటీషన్లు ఎందరికి ఇవ్వలేదు గన్క? అమ్మాయిలంతా శంకర్ సింగ్‌నే ఒప్పించారు. కొంచెంతోడుగా వుండమన్నారు. ఆయనకూ వీళ్ల పట్టుదల చూచి ముచ్చటేసింది. సరేనన్నాడు.

అక్టోబర్ 2 వచ్చింది. మంచి ముహూర్తం. బడికి తాళం పడింది. అమ్మాయిలు 500 మంది వీధుల్లోకి వచ్చారు. " పిల్లలు 700 మందికి టీచర్లు ముగ్గురా? పోస్టులు నింపండి. టీచర్లనివ్వండి" ఇదీ మందున్న వీళ్ళబ్యానర్. "శిక్షా హమారా అధికార్! అధ్యాపక్





దో సర్కార్" "పఢనేవాలే సాత్ సౌ హై. పఢానే వాలే తీన్‌హై" "శిక్షాకా అధికార్ దియా, పఢానే వాలే కోయి నహీ"

ఇలా నినాదాలిచ్చుకొంటూ భీమ్ పట్టణాన్నంతా మార్మోగించారు. పెద్ద కలకలం మొదలైంది. జనం చేరసాగారు. బజారు వీధుల్లోకి వచ్చాక షాపు యాజమానులంతా వాటర్ బాటిళ్ళు, బిస్కట్లు, బ్రెడ్లు పంచిపెట్టారు. నేషనల్ హైవే (ఢిల్లీ–ముంబై) మీదికొచ్చాక ఏమాత్రం ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అమ్మాయిలు చూపిన క్రమశిక్షణకు పోలీసులే అవాక్కయ్యారు.

చివరకు బి.డి.ఓ. ఆఫీసుకు ర్యాలీ చేరింది. బి.డి.ఓ. లేడుగానీ తహసిల్దారు, ఆఫీసు సిబ్బందీ బయటికొచ్చారు. పిల్లలంతా ఆఫీసు ముందు బైఠాయించారు. అప్పటికే ఊరంతా అక్కడికి చేరిపోయింది. వ్యవహారం చెయ్యిదాటిపోతోందని అధికార్లకు చెమటపట్టసాగింది. ముగ్గురమ్మాయిలు లేచి వాళ్ళ కష్టాలన్నీ వివరించారు. సబ్జెక్టుకొక్క టీచరునిస్తే తప్ప కదలమని గంటకొట్టినట్టు చెప్పారు. 'శుష్క వాగ్దానాలొద్దు. ఏ రోజు మాకు టీచర్లిస్తారో చెప్ప'ండని నిలదీశారు. ఇంతలోపల తీరిగ్గా విద్యాశాఖాధికారిగారు వచ్చారు. జనాన్ని, పిల్లల్ని చూచాక ఆయనకు నోటమాటరాలేదు. తమ పప్పులిక ఉడకవని, మాటలతో అమ్మాయిలు చల్లబడరని నేరుగా కలెక్టర్‌తో మాట్లాడాడు. నసుగుతూ నసుగుతూ 'అర్హతగల టీచర్లు తక్కువగా ఉన్నారమ్మా' అన్నాడు. "మగపిల్లల స్కూళ్ళలో టీచర్లు ఉన్నారే. మేము ఆడపిల్లలమనేనా టీచర్లు దొరకరు' అని పిల్లలంతా విరుచుకు పడినంతపని చేశారు. చివరకు 'అక్టోబర్ 6 నాటికి టీచర్లు వచ్చేస్తా'రని హామీ ఇచ్చాడు. అలా రాకుంటే మళ్ళీ 7వ తేదీన మేమిక్కడికొస్తాం. కదలం. మీఇష్టం" అని హెచ్చరించి పోరాటం విరమించారు అమ్మాయిలు.

అక్టోబర్ 7 వచ్చింది. టీచర్లు రాలేదు! అంతే అమ్మాయిలంతా బయటికొచ్చి బడికి తాళం వేశారు. బడిబయటే క్లాసులు మొదలెట్టారు. ఊరంతా వీరికితోడు నిలబడింది. పండ్లు, తినుబండారాలు, మంచినీళ్ళు, బిస్కెట్లు షాపుయజమానులు తెచ్చారు. వార్త మళ్ళీ కలెక్టర్‌కు చేరింది. డైరెక్టరుకూ అందింది. చివరికి ముఖ్యమంత్రికి కూడా తెలిసింది. సాయంత్రానికి బి.డి.ఓ.గారొచ్చి "అమ్మా రేపు మీరు బడికొచ్చేప్పటికి టీచర్లు వచ్చివుంటారు" అని హామీ ఇచ్చాడు.

అక్టోబర్ 8 ఉదయం పిల్లలంతా అసెంబ్లీకి చేరుకొనేప్పటికి ఆశ్చర్యం కొత్తగా ఏడు మంది టీచర్లు అంటే సబ్జెక్టుకో టీచరు వచ్చేశారు. పిల్లల ముఖాలు ఆనందపు కాంతులతో వెలిగిపోయాయి. ఎక్కడోవున్న గాంధీజీకి కళ్ళు చెమ్మగిల్లాయి!

ఈ కాంతుల్ని చిరకాలం నిలబెట్టాల్సిందెవరు? దేశంలోని పిల్లలందరి ముఖాల్లోనూ ఇవే కాంతుల్ని విరబూయించాల్సిందెవరు? చట్టాల్లో చిక్కుకున్న విద్యాహక్కును మన మారుమూల గ్రామాల పేద పిల్లలందరి దరికీ చేర్చాల్సింది ఎవరు?

ఇదంతా చదివాక ఈ ప్రశ్నల్ని 'భీమ్' ఆడపిల్లలేగాదు ప్రతిబిడ్డా మనల్ని గుచ్చి గుచ్చి అడుగుతున్నట్టే వుందిగదూ! ప్రశ్నలు మంచివే మరి జవాబులిచ్చే వారెవరు?

(జోసఫ్ రెనే, నిఖిల్‌డేల (హిందూ) కథనం ఆధారంగా)

# జస్టిస్ వి.ఆర్.కృష్ణయ్యర్

## మృతికి యుటియఫ్ సంతాపం



ప్రముఖ న్యాయకోవిదుడు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి దేశంలో తొలి కమ్యూనిష్టు ప్రభుత్వం (కేరళ)లో న్యాయశాఖ మంత్రి, అణగారిన వర్గాలకు న్యాయం కోసం అలుపెరుగని కృషి చేసిన జస్టిస్ వి.ఆర్.కృష్ణయ్యర్ తేది 4.12.2014న కన్ను మూశారు. "బేడీలు వేయడం మానవహక్కుల ఉల్లంఘన అన్న మానవతావాది". 1989లో నెల్లూరులో జరిగిన రాష్ట్ర మహాసభల్లో సందేశమిస్తూ విద్యారంగం తిరోగమిస్తోందని, విద్యారంగానికి కేంద్రం 10 శాతం నిధులు కేటాయించకపోతే నిరక్షరాస్యతను నిర్మూలించడం ఎప్పటికీ సాధ్యం కాదన్నారు. నేటి పరిస్థితిని ఆనాడే వీక్షించిన దార్శనికులు కృష్ణయ్యర్ వీరి మృతికి ఎపియుటియఫ్ రాష్ట్ర కమిటి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసింది.

**కవిత** ## పలకమ్మా నా పలకమ్మా

– యర్రాబత్తిన మునీంద్ర, నెల్లూరు జిల్లా

పల్లవి : పలకమ్మా ఓఓఓ పలకమ్మా నానానా పలకమ్మా
చిలుకా పలుకుల పలుకమ్మా నా పలకమ్మా
చదువుకు సాక్ష్యం నువ్వేనమ్మా పలకమ్మా ఆ ఆ ఆ ॥ పలకమ్మా॥

చరణం : అక్షరాల మొలకవే పలకమ్మా
దస్తూరిలో నేర్పరివే పలకమ్మా
లెక్కలకు కాపరివే పలకమ్మా
జ్ఞప్తిలోన శారదవు నీవమ్మా ఆ ఆ ఆ ॥ పలకమ్మా॥

చరణం2 : తడబాటు గీతలున్న పలకమ్మా
తప్పటడుగూ రాతలా పలకమ్మా
సక్రమరీతి నేర్పుతావు పలకమ్మా
సరిదానిని చూపుతావు వెలుగమ్మా ఆ ఆ ఆ ॥ పలకమ్మా॥

చరణం3 : తీపికి మారు పేరు నువ్వు పలకమ్మా
స్త్రీల ముగ్గులకు నీవే పలకమ్మా
పిల్లల బొమ్మలు నీకే పలకమ్మా
అట్టలేని పేదలకు వత్తు నీవేనమ్మా ఆ ఆ ఆ ॥ పలకమ్మా॥

చరణం4 : పిల్లవాడి చేతిలో పలకమ్మా
ఆయుధమైనావే పలకమ్మా
తలబద్దలయిపోయే పలకమ్మా
సంజాయిషీ ఎవరిస్తారు చెప్పమ్మా ఆ ఆ ఆ ॥ పలకమ్మా॥

చరణం5 : అభం శుభం ఎరుగనీ పలకమ్మా
కొంటె పిల్లల కనిపెట్టు పలకమ్మా
తప్పు చేయు బుడతలనీ పలకమ్మా
మరిచిపోక పనిపట్టు మాయమ్మా ఆ ఆ ఆ ॥ పలకమ్మా॥

# పనితీరు సూచికలు




రాష్ట్రంలో ప్రభుత్వ, పంచాయితీరాజ్ పాఠశాల ల్లో పనిచేస్తున్న ఉపాధ్యా యుల మరియు వారి పాఠ శాలల పనితీరును, స్థాయిని అంచనా వేసేం దుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వశిక్షా అభియాన్ Rc.No.25/SSA/A3/2014, Dated:23.08.2014 ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి పాఠశాలలు, వాటిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పనితీరును విశ్లేషించి తదుపరి చర్యలు చేపట్టమన్నారు. ఈ సూచికల ఉద్దేశ్యము, లక్ష్యాలు తదితర వివరాలు గురించి తెలుసుకుందాము.

విద్యాహక్కు చట్టం 2009లోని సెక్షన్‌లు 24, 29 ప్రకారం పాఠశాలల విద్యా ప్రమాణాలు నిర్దేశించిన స్థాయిలో ఉన్నది లేనిది తెలుసుకొనుటకు పనితీరు సూచికలు Performance Indicators (PINDICS) రూపొందించబడ్డాయి. 2010–11 విద్యా సంవత్సరంలో ఎన్.సి.ఇ.ఆర్.టి. నిర్వహించిన ఇన్‌సర్వీసు టీచర్ల విద్యకు సంబంధించిన అధ్యయనం మేరకు మరియు రాష్ట్ర విద్యా వైజ్ఞానిక పరిశోధనా శిక్షణా సంస్థ (ఎస్‌సీఈఆర్‌టి), రాష్ట్ర ప్రాజెక్టు అధికారులు, ఉపాధ్యాయ విద్య నిపుణుల నుండి సేకరించిన అభిప్రాయాల మేరకు ప్రగతి సూచికలు రూపొందించబడ్డాయని ఉత్తర్వులలో పేర్కొనడం జరిగింది.



యన్.కుమార్ రాజా
ఐక్య ఉపాధ్యాయ సంపాదకులు

**పనితీరు స్థాయిలు** (Performance Standards):

ఉపాధ్యాయులు ప్రతి బాధ్యతా రంగంలోనూ సాధించగలిగే స్థాయిలను పనితీరు స్థాయిలు (PS) గా సూచిస్తారు. పనితీరు స్థాయిలను 7 రకాలుగా గుర్తించారు. అవి. 1. విద్యార్థులలో అభ్యాసానుభవాన్ని రూపొందించడం, 2.సంబంధిత సబ్జెక్టులో విషయ పరిజ్ఞానము, అవగాహన కల్పించడం, 3.అభ్యసనం జరగడానికి పథకాలు రూపొందించడం, 4.అంతర్గత సంబంధాలు, 5. వృత్తిపరమైన అభివృద్ధి, 6.పాఠశాల అభివృద్ధి, 7.ఉపాధ్యాయుల హాజరు.

**పనితీరు సూచికల ఉపయోగం:**

పనితీరు సూచికలు ఉపాధ్యాయుల వ్యక్తిగత పనితీరును వారికి వారే అంచనా వేసుకొనడానికి మరియు నిరంతరం కృషి ద్వారా ఉన్నత స్థాయిని చేరుకోవడానికి ఉపయోగపడతాయి. పనితీరు సూచికలు తనిఖీ అధికారులు, ఉపాధ్యాయుల పనితీరును గ్రహించడానికి తగు సూచనలు ఇవ్వడానికి ఉపయోగపడతాయి. పని తీరు సూచికలను 4 రకాలుగా విభజిస్తూ వాటికి రేటింగ్ ఇవ్వడం జరిగింది. అవి. 1. ఆశించిన స్థాయిని చేరుకోలేదు. 2.ఆశించిన స్థాయిని చేరువలో ఉండడం, 3.ఆశించిన స్థాయిని చేరుకోవడం, 4.ఆశించిన స్థాయికి మించి చేరుకోవడం.

**ఉపాధ్యాయులు చేయవలసిన పని:** ప్రతి ఉపాధ్యాయుడు సంవత్సరానికి కనీసం రెండుసార్లు తన పనితీరును తానే స్వయంగా అంచనా వేసుకోవాలి. ఇందుకై టీచరు పనితీరు సూచికల ప్రొఫార్మాను మొదటి క్వార్టరు చివర ఒకసారి, 3వ క్వార్టరు చివర పూర్తి చేసికొని పనితీరు రేటింగ్‌ను ఇవ్వాలి. పనితీరు సూచికల ఫార్మెట్‌లో ఉపాధ్యాయుని పూర్తి సమాచారము తొలుతనింపాలి. తదుపరి నిర్దేశించిన పనితీరుస్థాయిలు 7 అంశములలోను వివరాలు పూర్తిచేసి 4 రేటింగ్‌లలో ఒకదానికి ప్రతి అంశానికి గుర్తించాలి. 7 అంశములలోని రేటింగ్ పాయింట్లను కూడి వచ్చిన మొత్తమునకు సరాసరి లెక్కించిన అది ఉపాధ్యాయుని పనితీరు రేటింగ్ పాయింట్‌ను తెలుపుతుంది.

**స్కూలు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు సూచనలు:**

స్కూలు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తన పరిధిలోగల ఉపాధ్యాయుల పనితీరు స్వయంగా పరిశీలించి పనితీరు సూచికలను ఉపాధ్యాయుల వారిగా, పాఠశాల వారిగా తయారు చేయడం జరుగుతుంది. ఇందుకు తరగతిగదిలో జరుపుతున్న విధానాలను స్వయంగా పరిశీలన జరుగుతుంది. ఉపాధ్యాయులతోను, విద్యార్థులతోను, స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులతో చర్చించాలి. ఉపాధ్యాయుడు తాను రూపొందించిన పనితీరు సూచికలతోబాటు విద్యార్థుల హాజరు, సిలబస్ పూర్తి, ఫలితాలు తదితర అంశాలు జోడించి ఉపాధ్యాయుని పనితీరు సూచికను, పాఠశాల స్థాయి పనితీరు సూచికలను తయారు చేస్తారు.

వీటి ఆధారంగా పాఠశాల స్థాయి, స్కూల్ కాంప్లెక్స్ స్థాయి, మండల స్థాయి పనితీరు సూచికలు (PINDICS) తయారు చేయబడతాయి. వీటిని రాష్ట్ర స్థాయిలో విశ్లేషించి తదుపరి చర్యలు చేపడతారు.

పనితీరు సూచికలు (PINDICS) పేరుతో విద్యాశాఖ అధికారులు సేకరిస్తున్న వివరాల తయారీ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులకు పనిభారం మరింత పెరగనున్నది. ఇప్పటికే ఏకోపాధ్యాయ, ఇద్దరు ఉపాధ్యాయులుగల పాఠశాలల్లో వివిధ రికార్డుల నిర్వహణతో బోధనాభ్యసనకు ఆటంకం ఏర్పడుతున్నది. కొత్తగా ప్రవేశపెట్టిన పనితీరు సూచికలతో మరిన్ని రికార్డుల నిర్వహణ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతోపాటు ఉన్నత పాఠశాలల్లోని 6,7,8 తరగతుల ఉపాధ్యాయులకూ భారం అవుతుంది. విద్యాహక్కు చట్టమేరకు తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి తగినంత ఉన్నప్పుడు మాత్రమే ఇటువంటి పనితీరు సూచికలు ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై విద్యావేత్తలతోను ఉపాధ్యాయ సంఘాలతోను చర్చించి పునఃసమీక్షించగలదని ఆశిద్దాం.

# యశస్వి శ్రీనివాస రామానుజన్




డిసెంబర్ 22, శ్రీనివాస రామానుజన్ జయంతి - ఉత్తేజకరమైన అతని జీవిత చరిత్రను స్మరించుకోవడం సందర్భోచితం. శ్రీనివాస రామానుజన్‌కు ఘన నివాళిగా 2012 సంవత్సరం ను "జాతీయ గణిత సంవత్సరం" గాను, గతేడాది వారం రోజులపాటు అంతర్జాతీయ స్థాయిలో, ఢిల్లీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో " ది లెజెన్సీ ఆఫ్ శ్రీనివాస రామానుజన్" పేరున గణిత సదస్సును భారత ప్రభుత్వం నిర్వహించింది.

పూర్వపు మద్రాస్ ప్రెసిడెన్సీలోని ఈరోడ్ అనే చిన్న పట్టణంలో నిరాడంబరమైన సాంప్రదాయ పేద బ్రహ్మణ కుటుంబంలో, కుప్పుస్వామి శ్రీనివాస అయ్యంగార్, కోమలమ్మాళ్ దంపతులకు 1887వ సంవత్సరంలో శ్రీనివాస రామానుజన్ జన్మించారు. ప్రాథమిక విద్యను స్థానిక పాఠశాల యందు, ఉన్నత విద్యను సమీప పట్టణం 'కుంభకోణం' లోను అభ్యసించారు. అత్యద్భుతమైన మేధా ప్రతిభతో పాఠశాల స్థాయిలోనే ఎన్నో బహుమతులు, బహుమానాలు, గౌరవ పురస్కారాలు అందుకున్నారు. అత్యంత అరుదైన సూక్ష్మ కుశలత కలిగి ఎన్నో బహుమతులు అందుకున్నప్పటికీ గణిత ఆవిష్కరణల సాధనలో, ఆర్థిక నేపథ్యం కారణంగా అతని ప్రయాణం సాఫీగా జరుగలేదు.




పూరేటి శ్రీనివాసరావు
పశ్చిమగోదావరి


శ్రీనివాస రామానుజన్ తల్లి కోమలమ్మాళ్కి గల గణిత శాస్త్ర ఆసక్తి, అతనిపై పెను ప్రభావాన్ని కలిగించింది. గణితం పట్ల అమితమైన ప్రేమ, భక్తి, వ్యామోహం మరియు పట్టుదల అసాధరణ స్థాయిలో పెరిగాయి. పాఠశాల స్థాయిలోనే తరగతి గదిలో 'మూడు అరటి పండ్లను ముగ్గురికి పంచితే ఒక్కొక్కరికి ఎన్ని వస్తాయి' అని ఉపాధ్యాయుడు అడిగిన ప్రశ్నకు 'ఒకటి సమాధానమైతే, మరి సున్న పండ్లను సున్న వ్యక్తులకు పంచితే ఒక పండు వస్తుందా' అని తార్కికంగా ప్రశ్నించాడు". సున్నతో పంచడం సాధ్యం కాదు, అదే లెక్కలలో తమాషా" అని శ్రీనివాస రామానుజన్‌ను అభినందించడం జరిగింది.

అతిచిన్న వయసులో, 13 సంవత్సరాలకు 'త్రికోణమితి' పూర్తిగా ఆకళింపు చేసుకొని దానిలోని సిద్ధాంతాలను స్వంత వివరణలతో ఋజువు పరచడం జరిగింది. 1903 సంవత్సరంలో 16 సంవత్సరాల ప్రాయంలో మెట్రిక్యులేషన్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత పొంది ఉన్నత విద్యకై స్కాలర్‌షిప్‌ను పొందినాడు. గణితంలో నూతన ఆవిష్కరణలకే ఎక్కువ సమయం కేటాయించుట వలన పరీక్షలో ఫెయిల్ అయినాడు. దాని కారణంగా స్కాలర్ షిప్ నిలిచిపోవడం వలన కుటుంబ ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఉన్నత విద్యను కొనసాగించలేకపోయాడు.

1909 ఆగష్టు 22న 'జానకి'తో వివాహం జరిగింది. కుటుంబ పోషణ భారం కావడం వలన ప్రొఫెసర్ రామ స్వామి గారి సలహా మేరకు మద్రాస్ పోర్ట్ ట్రస్ట్‌నందు గల ఎ.జి.ఆఫీస్‌లో గుమస్తాగా ఉద్యోగంలో చేరడం, అప్పటి ట్రస్ట్ ఛైర్మన్ సర్ ఫ్రాన్సిస్ ట్రింగ్, శ్రీనివాస రామానుజన్ గణిత శాస్త్ర ప్రజ్ఞా పాటవాలను గుర్తించి పరిశోధనా సంగ్రహాలను కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి అధ్యయనం కోసం పంపించడం జరిగింది. మద్రాస్ విచ్చేసిన కేంబ్రిడ్జ్ ప్రొఫెసర్ డా॥ జి.టి.వాకర్ శ్రీనివాస రామానుజన్ కృషిని మెచ్చి, పరిశోధనలు కొనసాగుటకు స్కాలర్‌షిప్ మంజూరు చేయవలసినదిగా మద్రాస్ ప్రభుత్వానికి సిఫార్సు చేశారు, కేంబ్రిడ్జ్‌కి ఆహ్వానించారు. కేంబ్రిడ్జ్ ప్రవేశానికి కావలసిన శాస్త్ర సంబంధ విషయాలలో ట్రినిటీ అధ్యాపకుడు ఇ.హెచ్.నేవెల్లీ సహకరించారు.

కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చేరిన శ్రీనివాస రామానుజన్ పరిశోధనా సంగ్రహాలను అధ్యయనం చేయడానికి ప్రొ॥ జి.హెచ్.హార్డీ గారికి, ప్రొ॥ లిటిల్ వుడ్ గారికి అందించడం జరిగింది. శ్రీనివాస రామానుజన్ ప్రతిపాదించిన నూతన ఆవిష్కరణలను అర్థంచేసుకోవడానికి చాలా సమయం పట్టింది.

ఈ విధంగా ఎన్నో అవాంతరాలు, అడ్డంకులు అధిగమించి ప్రపంచ ప్రముఖ మేధావుల నిలయమైన కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ నందు వారి సరసన స్థానం సంపాదించారు. నాలుగు సంవత్సరాల అతి స్వల్ప వ్యవధిలోనే ప్రొఫెసర్ జి.హెచ్.హార్డీ గారి మార్గదర్శకత్వంలో 25 పరిశోధనా పత్రాలను ప్రచురించడమైనది. పాఠశాల స్థాయి ప్రాథమిక గణిత అభ్యసమే పునాదిగా ఇంగ్లాండ్ చేరి గణిత ప్రపంచం ఊహించని ఆవిష్కరణలు సాధించడం ద్వారా అనతికాలంలోనే 'గణిత మేధో ప్రపంచం'నందు ప్రముఖ గణిత వేత్తగా గుర్తింపు పొందారు. శ్రీనివాస రామానుజన్ సేవలకు గుర్తింపుగా 1918 ఫిబ్రవరి 28న ఎఫ్.ఆర్.ఎస్. (ఫెల్లోషిప్ ఆఫ్ రాయల్ సొసైటీ)ను పొందిన మొట్టమొదటి భారతీయుడుగా చరిత్ర సృష్టించారు. అదే సంవత్సరం అక్టోబర్ 15న ట్రినిటి కాలేజ్ ఫెల్లోషిప్ ను సాధించిన మొదటి భారతీయుడుగా చరిత్ర తిరగరాశారు. గణిత శాస్త్ర పరంగా Advanced Number Theory, Bernouli Numbers - Its Charectors, Euler - Mascharomi Constant, Arthimetric - Geometric Series Additions, Polynomials - New kind of Solutions, Biquadratic

(తరువాయి 12వ పేజీలో)

## డిసెంబర్ 10 మానవ హక్కుల దినోత్సవం

# విశ్వ జనీనమైన మానవ హక్కులు వర్ధిల్లాలి



'సమాజం నిత్య నూతన చైతన్య స్రవంతి' మారుతున్న సమాజంతోపాటు మానవులు నాటినుంచి తమ అలవాట్లు, అభిరుచులు, భాష, ఆచారాలు, సంస్కృతి మార్చుకుంటూ వస్తున్నారు. తమ జీవనమునుగడకై ఇతరులపై ఆధారపడవలసిన వస్తుంది. అందుకే మానవుడు సంఘజీవి అన్నారు. ఈ క్రమంలోనే రాజ్యాలు, ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. రాజ్యంలో జీవించే మానవులు నాడు తమ'స్వేచ్ఛ' ను కొంతలేదా పూర్తిగా కోల్పోవలసి వచ్చేది. అధికారం మానవులను శాసించేది. మానవులు అభివృద్ధిని, స్వేచ్ఛను, సమానత్వంను ఆశిస్తూ పోరాటాలు సాగించారు. సాగిస్తున్నారు. ఆక్రమంలో వచ్చినవి, వస్తున్నవే మానవ హక్కులు. డిసెంబర్ 10 ప్రపంచ మానవ హక్కులదినోత్సవ సందర్భంగా విశ్వజనీనమైన మానవహక్కుల గూర్చి తెలుసుకుందాం.



జి.సి.మధుసూదనరావు

**మట్టి పత్రంపై హక్కులు** : మొదట్లో ప్రజలకు ఏదైనా సమూహంలో, సంఘంలో ఉన్నప్పుడు వారికి కొన్ని హక్కులుండేవి. క్రీస్తుపూర్వం 539 సంవత్సరంలో 'సైరస్ దిగ్రేడ్' బాబిలాన్ నగరాన్ని స్వాధీనం చేసుకున్నాక, ఎవరూ ఊహించని విధంగా బానిసలను విడుదలచేసి, వాళ్ళు సొంత ఇళ్ళకి వెళ్ళేలా చర్యలు తీసుకున్నాడు. అంతే కాకుండా ప్రజలు తమకు ఇష్టమైన మతాన్ని చేపట్టవచ్చని స్పష్టంచేశాడు. మట్టితో చేసిన పత్రంపై ముద్రించిన సైరస్ సిలిండర్' ప్రతి పాదనలే చరిత్రలో మొట్టమొదటి మాన హక్కుల ప్రకటన తరువాత కాలక్రమంలో పాలకులు ప్రజల హక్కులను కాలరాస్తూ పరిపాలన సాగించడంతో తమ హక్కుల సాధనకై అణిచివేతను నిరసిస్తూ అనేక పోరాటాలు చేయడంతో నేటి మానవహక్కులు మనం అనుభవిస్తున్నాం.

**మానవ హక్కుల సాధనలో కీలకమైన ఘట్టాలు :** ఇంగ్లాండ్‌లో కింగ్ 1215లో జారీచేసిన మాగ్నాకార్టా. ఇది ప్రజలకు నూతన హక్కులు కల్పించి రాజు చట్టానికి బాధ్యుడిని చేసింది. 'న్యాయ బద్ధమైన తీర్పుద్వారా తప్ప మరే విధంగానూ స్వేచ్ఛా పౌరుని బందీ చేయడం, బహిష్కరించడం నిషేధం" అని మాగ్నాకార్టా స్పష్టం చేసింది. 1628 హక్కుల పత్రం ప్రజల హక్కుల్ని సిద్ధం చేసింది. 1689 నాటి హక్కుల బిల్లు బ్రిటన్‌లో ప్రజలకు కనీస హక్కుల్ని కల్పించింది. అమెరికాలోని బిల్ ఆఫ్ రైట్స్ 1776లో జీవించే హక్కు, స్వేచ్ఛా సంతోషాల హక్కులు ప్రజలకు అందాయి. మొదటిసారిగా మానవ హక్కుల గూర్చి ఫ్రెంచ్ రాజ్యాంగంలో 1791లో ప్రస్తావించారు. మానవ హక్కుల ప్రకటన ఆ దేశ రాజ్యంగ పీఠికగా వుంది. దీనికి స్ఫూర్తి ఫ్రెంచి విప్లవం. 1789 ఫ్రెంచి విప్లవం చట్టం దృష్టిలో ప్రజలందరూ సమానమని ప్రకటించింది. స్వేచ్ఛ, సమానవత్వాలకు జీవంపోసింది. టాంపేన్ 1791లో ప్రచురించిన పుస్తకం పాశ్చాత్య దేశాలలో మానవ హక్కుల భావనను విస్తృతం చేసింది. 1948లో ఐక్యరాజ్యసమితి 30 హక్కులతో ప్రకటించిన 'సార్వజనీన మానవ హక్కుల ప్రకటన ఓమైలురాయి. రెండవ ప్రపంచ యుద్ధం వలన కలిగిన నష్టాలు పునరావృతం కారాదని ఐక్యరాజ్య సమితిలోని భద్రతా మండలి మానవ హక్కులకై కమిటిని 1946లో నియమించింది. ఈ కమిటికి సారథ్యం వహించినది ఎలినార్ రూజ్‌వెల్ట్. ఈ కమిటి రూపొందించినదే 'సార్వ జనీన మానవ హక్కుల ప్రకటన పత్రం' వీటిని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 1948 డిసెంబర్ 10న ఆమోదించింది. అందుచే డిసెంబర్ 10న మానవ హక్కుల దినోత్సవంగా ప్రపంచ దేశాలు, ప్రజలు హక్కులపై సభలు, సెమినార్లు నిర్వహిస్తూ ప్రజల్ని చైతన్య పరుస్తూ అవగాహన చేయడం జరుగుతుంది. అక్రమ అరెస్టులకు, నిర్బంధానికి, హింసకు గురికాకుండా రక్షణ కల్పించాల్సి ఉంటుంది. సక్రమమైన విచారణ పొందేందుకు, భావస్వాతంత్ర్యాన్ని, నచ్చిన మతాన్ని ఎంచుకునేందుకు, భావ ప్రకటనకు ప్రతిపౌరునికి స్వాతంత్ర్యం ఉంది. ఆర్థిక సామాజిక హక్కుల కింద ప్రభుత్వాలన్నీ తమ ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు చర్యలుచేపట్టాలి.

1966 డిసెంబర్ 16 ఐరాన ఆమోదించిన 'అంతర్జాతీయ ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక హక్కుల అంతర్జాతీయ ఒప్పందం, పౌర, రాజకీయ హక్కుల అంతర్జాతీయ ఒప్పందం కూడా 1976 నుంచి అమలులోకి వచ్చాయి. ఇలా ప్రపంచ వ్యాప్తంగా ఐరాస మానవ హక్కుల ప్రకటన ద్వారా పలు దేశాలు చైతన్యవంతం కావడం జరిగినది. ప్రపంచ వ్యాప్తంగా ఆమోదముద్ర లభించిన 30 మానవ హక్కులలో ప్రధానమైనవి. జీవించే హక్కు, స్వేచ్ఛగా వ్యవహరించే హక్కు, భావ ప్రకటన స్వేచ్ఛ, విశ్వాస స్వేచ్ఛ, ఆస్తిహక్కు, సాంఘిక భద్రత, సమన్యాయం ఇతర ఆర్థిక, సామాజిక హక్కులు.

**భారత రాజ్యాంగం - మానవ హక్కులు :** మానవ హక్కులను విధానపరమైన అంశాలతో భాగంగా గుర్తించాలన్న భావన స్వాతం త్రోద్యమ కాలంలోనే ఉద్భవించింది. స్వాతంత్ర్యం పొందిన తరువాత మన రాజ్యాంగ నిర్మాతలు ఐరాస ప్రకటించిన విశ్వజనీన మానవ హక్కులను దృష్టిలో ఉంచుకుని రాజ్యాంగంలో మానవ హక్కులకు పెద్దపీట వేశారు. 1.ప్రాథమిక హక్కులు, 2. ఆదేశిక సూత్రాలు. ఆర్టికల్స్ 12 నుండి 35 వరకు 14,15,16 మరియు సమానత్వపు హక్కును, ఆర్టికల్ 19 నుండి 22 వరకు స్వాతంత్ర్యపు హక్కును,

ఆర్టికల్స్ 23,24 దోపిడి నుండి రక్షణ పొందే హక్కును, ఆర్టికల్స్ 25 నుండి 28వ రకు మత స్వాతంత్ర్యపు హక్కును, ఆర్టికల్ 29 విద్యాహక్కును,ఆర్టికల్ 30 రాజ్యాంగ పరిహార హక్కును, 31 ఆస్తిహక్కును పేర్కొంది. 4వ భాగంలోని 36 నుండి 5/ఎ వరకు గల ఆర్టికల్స్ ప్రభుత్వం ప్రజలకు అందించవలసిన అన్ని సదుపాయాలను ఆదేశిక సూత్రాలలో పేర్కొన్నది. ప్రాథమిక హక్కులకు భంగం కలిగితే సుప్రీంకోర్టు, హైకోర్టులను ఆశ్రయించి హక్కులు పొందవచ్చు. కానీ ఆదేశిక సూత్రాలను కోర్టుల ద్వారా సవాలు చేయలేం.

**జాతీయ మానవ హక్కుల కమీషన్:** భారతదేశం రాజ్యాంగం ద్వారా మానవ హక్కుల పరిరక్షణకు ఎన్నో చట్టాలను చేసింది. సమాజంలో బడుగు వర్గాల హక్కులను రక్షించేందుకు జాతీయ మైనారిటీ కమీషన్‌ను, షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్ జాతుల కమీషన్ జాతీయ మహిళా కమీషన్‌లను కేంద్రం ఏర్పాటు చేసింది. దేశంలో మానవ హక్కుల పరిరక్షణలో భాగంగా కేంద్రం 1993 అక్టోబర్ 12న జాతీయ మానవ హక్కుల సంఘాన్ని జస్టిస్ రంగరాథ్ మిశ్రా ఛైర్మన్‌గా ఏర్పాటు చేయడం జరిగింది. మానవ హక్కుల సంఘం హక్కుల ఉల్లంఘనకు గురైన వారి ఫిర్యాదు మేరకు కేసుల విచారణ చేపడుతుంది. లేదా సుమోటోగా కేసులు స్వీకరించవచ్చు. మానవ హక్కులకు సంబంధించిన అంతర్జాతీయ ఒడంబడికలను పరిశీలించి వాటి అమలుకు అవసరమైన చర్యలు సూచిస్తుంది. ఈ కమీషన్‌లు ఒక ఛైర్మన్ మరియు నలుగురు సభ్యులుంటారు. వీరిని రాష్ట్రపతి నియమిస్తారు. వీరి పదవీ కాలం 5 సంవత్సరాలు లేదా 70 సంవత్సరాల వయస్సు వచ్చేంత వరకు పదవిలో జాతీయ కమీషన్‌తో బాటుగా ఇప్పటివరకు 23 రాష్ట్రాలలో రాష్ట్ర మానవ హక్కుల కమీషన్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో ఒక ఛైర్మన్‌తోబాటు ఇద్దరు సభ్యులుంటారు. వీరి పదవీ కాలం 5 సంవత్సరాలు. సంఘం పూర్తిగా స్వయం ప్రతిపత్తి గల సంస్థ. మానవ హక్కుల చట్టం 1993 సెక్షన్ 2 డి మానవ హక్కులను ఇలా నిర్వచించింది. 'రాజ్యాంగం అంతర్జాతీయ ఒడంబడిక లు హామి ఇస్తున్న వ్యక్తిజీవితం స్వేచ్ఛ, సమానత్వం, పరువు మర్యాదలకు సంబంధించిన హక్కులను మానవ హక్కులుగా పరిగణించారు.

**హక్కులను గౌరవించడం లేదు :** మానవ హక్కుల పరిరక్షణకు చాలా చట్టాలు చేశాం అంటూ మనం దేశం లాంటి చాలా దేశాల్లో ఇంకా లక్షలాది ప్రజలు హక్కుల్ని కాలరాయడంతో వేదనకు గురవుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న తీవ్రవాద, ఉగ్రవాద ఉద్యమాలను ఎదుర్కొనే క్రమంలో సైన్యం, పోలీసులు మానవహక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. బాలల హక్కుల ఉల్లంఘన పెచ్చుమీరుతున్నది. బాలలకు రక్షణ, ఆరోగ్య, విద్య, ఆహారం, నేటికి పూర్తిస్థాయిలో దేశాలు అందించలేకపోతున్నాయి. బానిసత్వం నిరోధించినప్పటికీ నేటికీ రెండు కోట్లకుపైగా బానిసలుగా మగ్గుతున్నారు. ఈ సంఖ్య బానిసల వ్యాపారం జరిగినప్పటికంటే రెండింతలు ఎక్కువ. నేటికీ 100 కోట్లకుపైగా ప్రజలకు విద్య అందలేదు. మహిళలకు రక్షణ, విద్య, సమానత్వం అందడంలేదు. అన్నింటా వారు వివక్షతకు గురవుతున్నారు. బాల్య వివాహాలు, వరకట్న మరణాలు, కుటుంబ కలహాగ్నుల్లో దహనాలు పెరిగిపోతున్నాయి. ఈ మానవ హక్కుల ఉల్లంఘనకు చరమగీతం పాడాలంటే ప్రజలపట్ల పాలకులు, పోలీసులు సంయమనంతో వ్యవహరించాలి. ప్రజలు మానవ హక్కులకై ఉద్యమించాలి.

(10వ పేజీ తరువాయి)

Equations Solutions, Divergent Series, Euler Constant - upto 15 decimals తదితరాల పై పరిశోధన కొనసాగించారు. ముఖ్యంగా శ్రీనివాస రామానుజన్ చే ఆవిష్కరించ బడిన మాజిక్ స్క్వేర్స్, థియరీ ఆఫ్ నంబర్స్, బెర్నౌలి సంఖ్యలు – లక్షణాలు, చివరిగా వ్రాసిన మాక్ –తీటా ఫంక్షన్స్ ప్రపంచ ప్రసిద్ధి గాంచినవి.

గణితంలో అప్రతిహతంగా కొనసాగుతున్న శ్రీనివాస రామానుజన్ జైత్రయాత్రకు ఆశనిపాతంగా తీవ్ర అనారోగ్యం పాలైనారు. ప్రతికూల వాతావరణం, నిరంతర శ్రమ, ఆహారపు అలవాట్లు మారడం వలన పోషకాహారం లోపం కారణంగా 'క్షయ వ్యాధి' తీవ్ర స్థాయికి చేరినది. వైద్య సహాయం అందినప్పటికీ కోలుకొని కారణంగా 1919 మార్చిలో స్వదేశానికి తిరిగి వచ్చారు. రోజురోజుకి క్షీణించిన ఆరోగ్యంతో కృంగిపోయి 1920 ఏప్రిల్ 26వ తేదీన మరణించారు.

శ్రీనివాస రామానుజన్ తీవ్ర అనారోగ్యంతో ఉన్నపుడు పరామర్శించడానికి వచ్చిన ప్రొ॥ జి.హెచ్.హార్డీ గారి కారు నెంబరును తదేకంగా చూస్తుండగా, ప్రొఫెసర్ "ఆ నెంబర్‌లో ప్రత్యేకత ఏముంది", అని అడిగారు. దానికి బదులిస్తూ "రెండు విధాలుగా, రెండు ఘనాలుగా వ్రాయవీలైన అతి చిన్న సంఖ్య, ఒకటి, పన్నెండు ఘనాల మొత్తం గానూ, తొమ్మిది, పది ఘనాల మొత్తం గానూ వ్రాయవచ్చు" అని వివరించారు. అందుకే, ఆ సంఖ్యను "1729" రామానుజన్ సంఖ్య'గా ప్రకటించారు. ప్రొఫెసర్ జి.హెచ్.హార్డీ గారు రామానుజంను 'A NATURAL GENIUS' అని పిలిచారు.

శ్రీనివాస రామానుజన్ చదివిన పట్టణం 'కుంభకోణం'లో గణిత పరిశోధనలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ''శాస్త్ర యూనివర్సిటీ'' నెలకొల్పారు. దీని ద్వారా ప్రతియేటా గణితంలో విశేష కృషిచేసిన, యువ గణిత శాస్త్రజ్ఞునికి ప్రపంచ స్థాయిలో 32 సంవత్సరాల పరిశోధకులకు 'THE SASTRA' అవార్డును 10,000/– అమెరికన్ డాలర్ల నగదు పురస్కారంతో కలిపి 2005 సంవత్సరంలో ఆవిష్కరించారు. ఈ అవార్డు ప్రపంచ స్థాయిలో విశేస గుర్తింపును, గౌరవాన్ని పొందినది. ఆర్యభట్ట, భాస్కరాచార్యులు తరువాత భారతీయ గణిత పతాకను ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహా గణితజ్ఞుడు శ్రీనివాస రామానుజన్‌కు ఘన నివాళి.

## ముఖ్యగమనిక

**ఐక్యఉపాధ్యాయ** పత్రిక డిసెంబర్ నెల నుండి విజయవాడ కేంద్రంగా నడుపబడుతుంది. ఈ నెల నుండి పత్రికకి పంపే వ్యాసాలు, ఉద్యమ వార్తలు, కథలు–కవితలు–గేయాలు, ప్రశ్నలు అన్ని రకాల వార్తలు **ఎడిటర్ ఐక్యఉపాధ్యాయ, యుటియఫ్ ఆఫీస్, పాలపర్తివారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ– 520002** అడ్రసుకు పంపాలి, లేదా

**E-Mails : ikyopadhyaya@gmail.com;**

**aputf2000@yahoo.com**కి పంపాలి.

పత్రిక చందాలుకూడ విజయవాడకి పంపవలెను. జనవరి నుండి ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించాలి. పత్రికల సంఖ్య పెంచాలి. ప్రతి పాఠశాలకు పత్రిక వెళ్ళేలా చూడాలి. అడ్వర్‌టైజ్‌మెంట్‌లు సేకరించి పంపాలి.

# ఉద్యోగులు ఆదాయపు పన్ను 2014-15

2014-15 ఆర్థిక సంవత్సరంనకు సంబంధించి (01.04.2014 నుండి 31.03.2015 వరకు గల ఆదాయము) ఉద్యోగులు చెల్లింపు చేయవసిన ఆదాయపు పన్ను లెక్కింపు విధానము పరిశీలిద్దాము.

I. **వేతనాదాయంగా పరిగణించే అంశాలు:**

1. మూలవేతనము, డి.ఎ., హెచ్.ఆర్.ఎ., సి.సి.ఏ, ప్రోత్సాహిక ఇంక్రిమెంట్లు, ఐ.ఆర్. 2 వేతనబకాయిలు, వేతన అడ్వాన్స్, 3. పెన్షన్, 4.సరెండర్ లీవు, 5.బోనస్, 6.నూతన పెన్షన్ పథకంలో ప్రభుత్వ వాటా.

II. **వేతనాదాయంగా పరిగణించబడని అంశములు:**

1. గ్రాట్యూటీ, 2.కమ్యూటెడ్ పెన్షన్, 3.యల్.టి.సి., 4.పి.యఫ్ నుండి చెల్లింపులు, 5.టూర్/ట్రాన్స్‌ఫర్ టి.ఎ., డి.ఎ., 6. రిటైరైన తదుపరి సంపాదిత, అర్థజీతపు సెలవు నగదు, 7 కన్వేయన్స్ అలవెన్సు, 8.మెడికల్ రీయింబర్స్‌మెంట్, 9. ఎడ్యుకేషన్ అలవెన్స్.

III. **మినహాయింపు/ తగ్గింపు లభించే అంశాలు:**

**1.హెచ్.ఆర్.ఎ.:** సెక్షన్ 10 (13ఎ):1. వాస్తవంగా పొందిన హెచ్.ఆర్.ఎ.(బి) వేతనంలో 10 శాతం కంటే అదనంగా చెల్లించిన ఇంటి అద్దె అనగా చెల్లించిన అద్దె - (మూలవేతనం + డిఎ) × 10% (సి) వేతనంలో 40 శాతం (మెట్రో నగరాలైతే 50%) ఈ మూడింటిలో తక్కువైన మొత్తం, ఆదాయం నుండి తగ్గించబడుతుంది.



టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు
గుంటూరు జిల్లా

**గమనిక:** 1. స్వంత ఇంటిలో నివసిస్తుంటే హెచ్ఆర్ఎ మినహాయింపు వర్తించదు. హెచ్ఆర్ఎ నెలకు రూ.3000/-ల పైన ఉంటే రశీదు జతపరచాలి. 2. వాస్తవంగా చెల్లించిన ఇంటి అద్దె సంవత్సరానికి లక్ష రూపాయలకు మించితే రశీదులో ఇంటి యజమాని పాన్ నెంబరు తప్పనిసరిగా పేర్కొనాలి. పాన్ నెంబర్ లేనిచో యజమాని ఇంటిచిరునామా పూర్తిగా వ్రాయాలి.

**2. వృత్తి పన్ను:** (సెక్షన్ 16) : ఉద్యోగి ఆ సంవత్సరంలో పన్నుగా చెల్లించిన మొత్తం ఆదాయం నుండి తగ్గించబడుతుంది.

**3. గృహ నిర్మాణ అప్పు: (సెక్షన్ 24):** గృహ నిర్మాణమునకు అప్పు తీసుకొని స్వంతంగా నివాసమున్నచో లేదా మరమ్మత్తుల కొరకు చెల్లించిన వడ్డీ రూ.30,000/-లు వరకు మినహాయింపు కలదు. 01.04.1999 తర్వాతలోను తీసుకొని, లోను తీసుకున్న మూడు సంవత్సరముల లోపు గృహ నిర్మాణం/ కొనుగోలు చేసి వుంటే 2,00,000/-ల వరకు మినహాయింపు పొందవచ్చును.

**4. సెక్షన్ 80 సి క్రింద తగ్గింపులు:** 1. ఎల్ఐసి, జిఐఎస్,పిఎఫ్, ఎస్ఎస్‌పి, యూలిప్స్, అనుమతించిన మ్యూచువల్ ఫండ్ యూనిట్స్ పెన్షన్ ఫండ్, పిపియఫ్, పిఎల్ఐ కు చెల్లించిన ప్రీమియం/చందా. 2. గృహ నిర్మాణమునకు తీసుకున్న అప్పు తీర్చుటకు చెల్లించిన అసలు. 3. ఇద్దరు పిల్లలకు చెల్లించిన ట్యూషన్ ఫీజు, 4.పోస్టాఫీసు లేదా షెడ్యూల్ బ్యాంకులో కనీసం 5 సంవత్సరాల ఫిక్స్‌డ్ చేసిన టర్మ్‌డిపాజిట్లు, 5. సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీం 2004.

**5. సెక్షన్ 80 సిసిసి:** ఎల్ఐసి / కేంద్ర ప్రభుత్వం గురించిన పెన్షన్ స్కీమ్‌కు చెల్లించిన కంట్రిబ్యూషన్.

**6. సెక్షన్ 80 సిసిడి:** నూతన పెన్షన్ స్కీమ్‌కి (కంట్రి బ్యూటరీ పెన్షన్ స్కీమ్) వేతనంలో చెల్లించిన 10 శాతం కంట్రిబ్యూషన్.

**గమనిక:** పైన తెలిపిన 4,5,6లకు చెందిన 80 సి, 80 సిసిసి, 80 సిసిడి సెక్షన్‌ల క్రింద కలిపి మొత్తం 1.5 లక్ష గరిష్ట పరిమితి వరకు మాత్రమే మినహాయింపు వర్తిస్తుంది.

**7. సెక్షన్ 80 సిసిజి:** వార్షిక ఆదాయం 12 లక్షలలోపు ఉన్న వారు రాజీవ్ గాంధీ ఈక్విటీ స్కీమ్ క్రింద గరిష్ఠంగా రూ.50,000/- వరకు పొదుపు చేసి గరిష్ఠంగా రూ.25,000/- వరకు పన్ను మినహాయింపు పొందవచ్చు.

**8. విరాళములు: (సెక్షన్ 80జి):** ముఖ్యమంత్రి/ ప్రధానమంత్రి సహాయనిధికి చెల్లించే మొత్తం 100% కు, అనుమతించిన మత/ స్వచ్ఛంద సంస్థలకు / రాజకీయ పార్టీలకు ఇచ్చిన విరాళాలలో 50 శాతం వరకు ఆదాయం నుండి మినహాయింపు లభిస్తుంది.

**9. వైద్యఖర్చులు: (సెక్షన్ 80 డిడిబి) :** ఉద్యోగి స్వంత/ ఆధారితుల తీవ్ర రోగాల చికిత్సకై చేసిన వాస్తవ ఖర్చులో రూ.40,000/-ల వరకు (60 సం॥ దాటిన వారికి 60,000/-లు) మినహాయింపు కలదు. ఈ మినహాయింపు కొరకు 10(ఐ) పారంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పి.జి., డిగ్రీ కలిగిన న్యూరాలజీస్టు, ఆంకాలజిస్టు, హెమటోల జిస్ట్, యూరాలజిస్టు, ఇమ్యూనోలోజిస్టు, నెఫ్రాలజిస్టు లేదా స్పెషలిస్టు డాక్టర్ ధృవపత్రము జతచేయాలి.

**గమనిక:** పైన తెలిపిన 8వ అంశములలో 80 జి సెక్షన్‌లో 50% మినహాయింపు వర్తించే విరాళముల మినహాయింపు, 9వ అంశములో (సెక్షన్ 8డిడిబి) మినహాయింపులు డిడిఓలు చేయరాదని ఇన్‌కంటాక్స్ డిపార్టుమెంట్ సర్కులర్ ఇవ్వటం జరిగింది. జులై నెలలో ఐటి డిపార్ట్‌మెంట్‌కు దాఖలు చేసే రిటర్న్‌లో పై అంశములను చూపి మినహాయింపు కోరితే దాని తాలూకు చెల్లించి పన్ను రీఫండ్ చేయబడుతుంది.

**10. మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియం: (సెక్షన్ 80 డి):** ఉద్యోగి, భార్య/ భర్త, పిల్లలు, తల్లిదండ్రులకై చెల్లించిన ప్రీమియం మొత్తం 15,000/ - ల వరకు(సీనియర్ సిటిజన్స్ అయితే 20,000ల వరకు మినహాయింపు వర్తిస్తుంది.

**11. వికలాంగ ఉద్యోగికి ప్రత్యేక తగ్గింపు:** (సెక్షన్ 80 యు) వైద్యాధికారి యిచ్చిన ధృవ పత్రమును బట్టి 40 % వైకల్యం గల వారికి 50 వేలు, 80% కన్న ఎక్కువ వైకల్యము కలవారికి 1 లక్ష వరకు మినహాయింపు వర్తిస్తుంది.

**12. వికలాంగులైన ఆధారితుల ఖర్చు:** (సెక్షన్ 80 డిడి): మానసిక/ శారీరక/ వైకల్యము గల ఆధారితుల వైద్యం, నిర్వహణ పోషణకై చేసిన ఖర్చులను రూ.50,000/- ల వరకు మినహాయింపు లభిస్తుంది. తీవ్ర వైకల్యమైతే, 1 లక్ష వరకు మినహాయింపు వర్తిస్తుంది.

**13. విద్యారుణం:** (సెక్షన్-80ఇ) ఉద్యోగి, భార్య/భర్త, పిల్లల ఉన్నత చదువులకై తీసుకున్న అప్పుపై చెల్లించిన వడ్డీని ఆదాయంలో నుండి

7 సం॥ల వరకు లేదా అప్పు తీరే వరకు ఏది ముందైతే అప్పటి వరకు మినహాయింపు వర్తిస్తుంది.

IV. **పన్ను రేట్లు:**

పైన తెలిపిన III అంశములోని 1 నుండి 13 అంశము వరకు మినహాయింపులన్నిటిని మొత్తం ఆదాయం నుండి తీసివేసిన తర్వాత మిగిలిన మొత్తం (పన్ను విధించిన దగిన ఆదాయం) నకు కింద తెలిపిన విధంగా పన్ను లెక్కించాలి.

| వ సం | పన్ను విధించదగిన ఆదాయం | పన్ను (60 సం॥ల లోపు స్త్రీ పురుషులందరికీ |
|---|---|---|
| 1. | 2.5 లక్షల వరకు | లేదు |
| 2. | 2.5లక్షల నుండి 5లక్షల వరకు | 2.5 లక్షలు దాటిన ఆదాయం పైన 10% |
| 3. | 5లక్షల నుండి 10లక్షల వరకు | 25 వేలు+ 5 లక్షలు దాటిన ఆదాయంపై 20% |
| 4. | 10 లక్షల పైన | 1,25,000+10 లక్షలు దాటిన ఆదాయంపై 30% |

**పన్ను రిబేటు:** పన్ను విధించదగిన ఆదాయం 5 లక్షలలోపు ఉన్నట్లయితే పై పట్టిక ప్రకారం లెక్కించిన పన్నులో గరిష్టంగా 2 వేల వరకు రిబేటు ఇస్తారు (సెక్షన్ 87ఎ)

**విద్యాసెస్సు:** రిబేటు పోను మిగిలిన పన్ను పై 3% విద్యా సెస్సు విధించబడుతుంది.

**గమనిక:** 60 సం॥ వయస్సు దాటిన వారికి 3 లక్షల వరకు 80 సం॥ వయస్సు దాటిన వారికి 5 లక్షల వరకు పన్నులేదు.

V. **పన్ను చెల్లించవలసిన విధానం:**

డ్రాయింగ్ అధికారుల రాబోవు సం॥ కాలానికి ముందుగానే చెల్లించవలసిన పన్నును అంచనా వేసి, ప్రతినెలా జీతపు బిల్లులో మినహాయించాలి. ప్రతి మూడు నెలలకు ఒక సారి ఆ క్వార్టర్‌కు చెల్లించిన పన్ను వివరాలను ఆన్‌లైన్‌లో ఫారం 24Q సమర్పించాలి. మార్చి, ఏప్రిల్, మే మాసముల జీతాల బిల్లులో మినహాయించిన పన్నును జులై 31లోపు జూన్, జూలై, ఆగష్టు మాసముల జీతాల బిల్లులో మినహాయించిన పన్నును అక్టోబరు 31లోపు, సెప్టెంబరు, అక్టోబర్, నవంబర్ నెలల జీతాల బిల్లులో మినహాయించిన పన్నును జనవరి 31లోపు డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి మాసముల జీతపు బిల్లులో మినహాయించిన పన్నును మే 15 లోపు 24Q ఆన్‌లైన్‌లో సమర్పించాలి. ఇది పూర్తిగా డ్రాయింగ్ అధికారుల బాధ్యత. ఫారాలు పంపటానికి టిన్ ఫెసిలిటీ సెంటర్లను ఉపయోగించుకోవచ్చు.

VI. **సమర్పించవలసిన ఫారాలు:**

డ్రాయింగ్ అధికారులు ప్రతి క్వార్టర్‌కు 24Q ను సమర్పించాలి. ప్రతి ఉద్యోగి ఫారం – 16ను ఫిబ్రవరి నెల జీతాల బిల్లుతోపాటు ట్రెజరీ అధికారులకు సమర్పించాలి.

5 లక్షల పైన ఆదాయం కలవారు జూలై 31లోపు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో ఆదాయపు పన్నుశాఖకు రిటర్ను సమర్పించాలి. 5 లక్షల లోపు ఆదాయం ఉన్న వారు కూడా రిఫండ్ రావాల్సిన పన్ను ఉన్నచో ఈ ఫారం సమర్పిస్తే అదనంగా చెల్లించిన పన్నురిఫండ్ చేస్తారు.

**గమనిక:** 1. ప్రతి ఉద్యోగి పాన్ నెం., ప్రతి డి.డి.ఓ టాన్ నెం. కలిగి ఉండాలి. 2. ముందు సంవత్సరాలకు సంబంధించి ఏవైనా అరియర్సు డ్రా చేసి ఉన్నచో ఫారం 10 ఇ సమర్పించి మినహాయింపు పొందవచ్చు. 3. డిడిఓలు ట్రెజరీ కార్యాలయం నుండి బిన్ తీసుకోవాలి.

## COMPUTATION OF INCOME TAX FOR THE FINANCIAL YEAR 2014-2015 (MODEL SHEET)

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | Name of the Employee | : | K.VENKATESWARA RAO | | |
| 2. | Designation | : | S.A. | | |
| 3. | Name of the Office Address | : | ZPHS Duggirala, Dist. Guntur | | |
| 4. | Salary Income | : | | | |
| a) | Pay | : | | Rs. | 3,63,400 |
| b) | DA | : | | Rs. | 2,24,040 |
| c) | HRA | : | | Rs. | 43,608 |
| d) | CCA | : | | Rs. | - |
| e) | Spl.Pay/PP | : | | Rs. | - |
| f) | Other allowances | : | | Rs. | 480 |
| | Gross Total Income: | | | Rs. | 6,31,528 |
| 5. | H.R.A. Exemption. (Least of the following) | | | | |
| i) | HRA actually received | : | | Rs. | 43,608 |
| ii) | Rent paid in excess of 10% of Salary | : | | Rs. | 49,256 |
| iii) | 40% of Salary | : | | Rs. | 2,34,976 |
| | Least of the Above 3: | | | Rs. | 43,608 |
| 6. | Total Income(4-5): | | | Rs. | 5,87,920 |
| 7. | Deductions | : | | | |
| a) | P Tax (u/s 16) | : | | Rs. | 2,400 |
| b) | Intrest Paid on Housing Loan (u/s 24-b) | : | | Rs. | - |
| c) | Medical Reiumb-ersment if any | : | | Rs. | - |
| | Total (A to C) | : | | Rs. | 2,400 |
| 8. | Net Income (6-7) | : | | Rs. | 5,85,520 |
| 9. | Deductions Under Chapter VI-A (Section 80C.80-CCC, 80CCD(i) Maximum 1 Laksh) | | | | |
| a) | GPF | : | | Rs. | 65,760 |
| b) | A.P.G.L.I. | : | | Rs. | 9000 |
| c) | GIS | : | | Rs. | 720 |
| d) | Housing Loan Prl. amount | : | | Rs.. | - |
| e) | Tuition Fees | : | | Rs. | 45,000 |
| f) | NSC | : | | Rs. | - |
| g) | LIC | : | | Rs. | 35,700 |
| h) | Any others | : | | Rs. | - |
| | Total (80C, 80CCC, 80CCD(i) | : | 1,56,180 | Rs. | 1,50,000 |
| 10. | Total Income (8-9) | : | | Rs. | 4,35,520 |
| 11. | Deductions Under Chapter VI-A | | | | |
| a) | Medical Insurance(80-D) | : | | Rs. | - |
| b) | Handicapped Dependent (80 DD) | : | | Rs. | - |
| c) | Medical Treatment (80 DDB) | : | | Rs. | - |
| d) | Int. Paid on Edn. Loan (80E) | : | | Rs. | 24,000 |
| e) | Donations C.M. Relief Fund (80G) | : | | Rs. | 3,028 |
| f) | P.H. Assess (80-U) | : | | Rs. | - |
| 12. | Aggregate of deductible above(a to f) | : | | Rs. | 27,028 |
| 13. | Net Taxable Income(10-12) | : | | Rs. | 4,08,492 |
| | Rounded to | : | | Rs. | 4,08,490 |
| 14. | Tax Payable on total Income | : | | Rs. | 15,849 |
| 15. | Rebate(Sec. 87A) | : | | Rs. | 2,000 |
| 16. | Net Tax | : | | Rs. | 13,849 |
| 17. | Add. Surcharge | : | | Rs. | - |
| 18. | Education Cess(3%) | : | | Rs. | 415 |
| 19. | Tax Payable (14+15+16) | : | | Rs. | 14,264 |
| 20. | Less: Already paid Tax | : | | Rs. | - |
| 21. | Tax Payable/Refundable | : | | Rs. | 14,264 |

*Sign of the Employer* *Sing of the Employee*

# జ్యోతి

జి.పుల్లయ్య
తణుకు,పశ్చిమగోదావరి

"ఈరోజు సాయంత్రం నాలుగింటికి మన వృద్ధజనాశ్రమానికి కలెక్టర్‌గారు వస్తున్నారు. అందరికి పాలు, పళ్ళు ఇస్తారట రాత్రి భోజనాలు కూడా ఆయనే ఏర్పాటు చేస్తున్నారు" మేనేజర్ మాటలు అందరూ శ్రద్ధగా విన్నారు. కడుపున పుట్టిన బిడ్డలు పట్టించుకోని అభాగ్యులు, దూర ప్రాంతాల్లో ఉద్యోగాల్లో ఉండి దగ్గరకు రాని, రాలేని పిల్లలున్న నిర్భాగ్యులతో ఆ ఆశ్రమం నిండి ఉంది. ఎవరైన వచ్చి తమని పలకరిస్తున్నారంటే ఎంతో ఆనందం. ఎవ్వరికి అక్కరలేని, ఎవ్వరికి అవసరం లేని తమను కూడా ఆదరించడానికి కొంతమంది పుణ్యాత్ములు వస్తూనే ఉంటారు. ఏదో ఒకటి ఇస్తూనే ఉంటారు.

"ఏమిటి శాంతా! ఆయనకు పక్షవాతంతో ఒక కాలు, చెయ్యి పూర్తిగా పడిపోవడంతో మంచందిగి బయటకి తనంతటతాను లేచిరాలేరు. ఎవరో ఒకరు తోడుంటేనేగాని లేవలేని స్థితి "సాయంత్రం కలెక్టర్‌గారు వస్తున్నారట " మంచం మీద దిండు సరిచేస్తూ అంది. "అలాగా..." అని క్షణం ఆగి తిరిగి "అబ్బాయి దగ్గరనించి ఫోన్ ఏమైనా వచ్చిందా? "అని అడిగారు. "రెండురోజుల క్రితం చేసిన ఫోనే మళ్ళీచేయలేదు." "ఖాళీ లేదేమో! ప్రమోషన్ మీద యుఎస్ఎ నుండి కెనడా వెళ్ళాడుగా. బిజీగా ఉండి ఉంటాడు" స్వగతంలా అనుకొన్నారు. ''అయ్యుండొచ్చు'' నిర్లిప్తంగా అంది శాంతమ్మగారు. "ఏమిటో.. వాడ్ని చూడాలని మనస్సు తహతహలాడుతుంది. ఒక్కసారి వచ్చి వెళ్ళమని ఫోన్ చేస్తావా?" "అలాగే చేస్తానులే. మీరు ఆందోళన పడకండి. అసలే మీరు చాలా బలహీనంగా ఉన్నారు" భర్తతో అని కొడుక్కి రింగ్ చేసింది. "ఏమిటమ్మా! ఇపుడు నేను ఇండియా రానా? మీకసలు మతుందా? ఇపుడేగా ప్రమోషన్ మీద కెనడా వచ్చాను. వెంటనే లీవు పెడితే ఉన్న ఉద్యోగం కూడా ఊడుతుంది. నాన్నగారికి మరీ బాగా లేకపోతే హాస్పిటల్లో జాయిన్ చెయ్యి. డబ్బు పంపుతాను" అంటూ డిస్‌కనెక్టు చేసాడు రవి. "ఏమన్నాడు?" "ఆ...... వస్తాడట ఖాళీ చూసుకొని" అబద్ధం చెప్పలేక మాట తడబడింది.

సాయంత్రం కరెక్టుగా నాలుగంటలకి కలెక్టర్ గోపీనాథ్ భార్యతో సహా ఆశ్రయంలోకి వచ్చాడు. ఆయన రాకకు కృతజ్ఞతగా చిన్న అభినందన సభ ఏర్పాటు చేశారు. సభ ప్రారంభమయ్యింది. పేదరికంలో పుట్టి స్వయంశక్తితో ఎదిగి అత్యున్నత స్థాయికి చేరిన ఆయన్ని అందరూ అభినందించారు. తనకు జరిగిన సన్మానానికి కృతజ్ఞతలు తెలుపుతూ గోపీనాథ్ ప్రసంగించారు. "ఒక మనిషిలో తెలివితేటలు, కృషి, పట్టుదల ఉండొచ్చు. కానీ ఏ మనిషయినా ఎదగడానికి ఒక చేయూత కావలి. ఆ చేయూత నిచ్చే తల్లిదండ్రులు కరువైన పిల్లల తెలివితేటలు, సామర్థ్యం బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. నేనీరోజు ఈస్థితికి చేరానంటే మా లెక్కల మాష్టారే కారణం. నా తల్లిదండ్రులు పేదరికం వల్ల చదివించలేకపోతే ఆయనే నా వెన్నుతట్టి అండగా నిలబడి ప్రోత్సహించారు." "ఇపుడాయన ఎక్కడున్నారు?" ఎవరో అడిగారు. "నేను ఇన్నాళ్ళు వేరే రాష్ట్రాల్లో జాబ్ చేయడం వల్ల ఆయన గురించి వివరమేమి తెలియలేదు. ఇపుడు సొంతజిల్లాకే కలెక్టర్‌గా వచ్చాను. కనుక ఆయన గురించి తెలుస్తుందని అనుకొంటున్నాను. బహుశా వారి కొడుకుదగ్గరో, కూతురిదగ్గరో ఉండి ఉండొచ్చు. "అంటూ ఉపన్యాసం ముగించి భార్యతో సహాపాలు, పండ్లు పంపిణీ చేయడంలో నిమగ్నమైనాడు.

అందరికి పంపినీ చేస్తూ రాఘవయ్య మాష్టారు మంచం దగ్గరకు వచ్చి "ఏమండీ!" అని పిలిచాడు. అటువేపు తిరిగి పడుకొన్న రాఘవయ్య మాష్టారు ఆ పిలుపుకి తల ఇటువైపు తిప్పారు. ఆయన్ని చూడగానే గోపీనాథ్ ముఖంలో ఆనందం, ఆశ్చర్యం, సంబరం, బాధ... ఎన్నో భావాలు ఒక్కసారిగా ముసురుకొన్నాయి. "మాష్టారు! మీరు ... మీరేనా? మీరు... ఇక్కడ?" కళ్ళవెంట నీళ్ళు జలజల రాలిపోతుంటే కళు ్ళమసకబారి మంచం అంచున చతికిల బడిపోయాడు. బయటినించి వస్తున్న శాంతమ్మగారు గోపీనాథ్‌ని గుర్తుపట్టి "ఎంత గొప్పవాడివయ్యావు గోపీ!" అంది. "మాష్టారికీ దుస్థితి ఏమిటమ్మా! రవి, పద్మ ఏమైనారు?" " అంతా బాగానే ఉన్నారు. మా దురదృష్టం మమ్మల్నిలా వెక్కిరించింది" "అంత మాటనకమ్మా! మాష్టారులాంటి పుణ్యాత్ములకు రావలసిన దుస్థితి కాదు ఇది" "ఆయన మంచివారే. పుణ్యాత్ములే. కానీ అహంభావంతో నీలాంటి వారిని అవమానించిన పాతకి...... భర్తయినందుకు, నేను చేసిన కర్మని ఆయన మోస్తున్నారు. దు:ఖంతో మాటబొంగురుపోయింది. గోపివంక తలక్రిందకి వాల్చేసారు. మెల్లిగా ఆయన శరీరాన్ని లేవనెత్తి ఆయన వీపుకి దిండుని చేర్చి కూర్చోబెట్టి "మాష్టారు! నేను. మీ గోపిని" అన్నాడు గోపీనాథ్. " గోపీ! నా గోపీ! నువ్వేనా? కలెక్టర్‌గా కనిపిస్తానన్నావు. అలాగే కనిపించావు". ఆనందంతో ఆయనకు మాట తడబడింది. 'మీకీస్థితేమిటి?'' చచ్చుబడిపోయిన కాలుని, చేతిని తనచేత్తో స్పృశిస్తూ అడిగాడు గోపానాథ్. "పెద్దవయస్సు వచ్చేసింది కదా పైగా పెరాలసిస్ స్ట్రోక్ వచ్చింది." " మరివైద్యం చేయించలేదా?" "చేయించారు. రికవరీ అవ్వలేదు" "రవి, పద్మ ఏమైనారు?" "రవి కెనడాలో ఉంటున్నాడు. పద్మ భర్తతో కలిసి ఆస్ట్రేలియాలో ఉంటుంది". "మరి మిమ్మల్నిలా.. ఒంటరిగా వదిలేసారా?" ప్రశ్నకు సమాధానం రాఘవయ్య మాష్టారు, శాంతమ్మ గారు కూడా చెప్పలేకపోయారు. రెండు రోజులుంటేనే విసుక్కొనే కోడలి ముఖం, ఎపుడు వెళ్ళిపోతారా? అని డైరెక్టుగానే అడిగే అల్లుడి నిర్మొహమాటత్వం గుర్తొచ్చి ముఖాలు ఎర్రబడ్డాయి బాధతో. " మిగతా వాళ్ళకి కూడా పంచాలి" భార్య అనడంతో గోపీనాథ్ లేచాడు.

"ఏమిటండీ! ఆశ్రమం దగ్గరనించి వచ్చిన దగ్గరనించి అలా ఉన్నారు? మీ మాష్టారుగారి పరిస్థితి చూచా? విమల అడిగింది. "అవును విమలా! ఎంతమంచివారు. ఎలా అయ్యిపోయారు?" ఎవరో పిలవడంతో విమల బయటికి వెళ్ళింది. గోపీనాధ్ ఆలోచనలు చిన్నతనం వైపు మళ్ళాయి.

రాఘవయ్య మాష్టారు ఇంటి వరకు వచ్చిన బబ్లూ "బాబోయ్! మేష్టారి వాళ్ళావిడ బయటే ఉంది. నేనురాను. నువ్వెళ్ళు" అంటూ పారిపోయాడు. "ఒరే బబ్లూ! ఆగరా..." అన్న వినిపించుకోకుండా పారిపోతున్న బబ్లూని కోపంగా చూస్తూ మాష్టారి ఇంటిగేటు తెరిచాడు గోపి "ఆదివారం కూడా మాష్టారికి విశ్రాంతి తీసికొనివ్వరా..మాయదారి మంద. మాయదారి మందని". శాంత అరిచింది. గోపిభయంగా పుస్తకాల సంచి పట్టుకొని "ఇంగ్లీషు మీడియం కొంచెం కష్టంగా ఉంది. స్ట్రయిట్ లైన్స్ అండ్ ఏంగిల్స్ సార్ చేత చెప్పించుకొందామని..." "ఇపుడు కుదరదు. మారవికి పద్మకి ఏదో చెబుతున్నారు. ఇంకోసారిరా! అర్థంగానపుడు ఇంగ్లీషు మీడియం తీసికోవడం ఎందుకో" అడ్డంగా ఉన్న గోపిని చేత్తో పక్కకి తోసి ముందుకు వెళ్ళింది. పడిపోబోయి పక్కనే ఉన్న తడికను పట్టుకొని నిలబడ్డాడు. చిన్న బుచ్చుకొన్న మోహంతో తిరిగి వెళ్ళిపోతున్న గోపిని చూసి " గోపీ! వెళ్ళిపోతావే.. లోపలికి రా!" బయటకి వచ్చిన రాఘవయ్య మాష్టారు అన్నారు. "మీరు రవికి పద్మకి చదువు చెప్తున్నారటగా తర్వాత వస్తాను" "నువ్వు వాళ్ళక్లాసేగా. వాళ్ళకి స్ట్రయిట్ లైన్స్ చెపుతున్నాను. నిన్న స్కూల్లో ఆ ఛాప్టర్ అర్థంగాలేదు. రేపు మీయింటికి వస్తానని చెప్పి వచ్చి వెళ్ళిపోతావే.. రా.." అన్నారు. వెళ్ళు నాయనా! వెళ్ళు. పైసా ఖర్చు లేకుండా ప్రైవేటు క్లాసులు. అందరు ట్యూషన్లు చెప్పివేలకి వేలు సంపాదిస్తుంటే ఈయన మత్రం దీనజనోద్ధారణకి బయలు దేరాడు" భర్తని చూస్తూ మెటికలు విరుస్తూ అందిశాంత. "ఆ మాటలు పట్టించుకోకు రా... " అంటూ లోనికి తీసికెళ్ళారు. ఏ విషయాన్నైనా చెప్పగానే అందుకొనే గోపీనాథ్ తెలివితేటలకి

ఆశ్చర్యపోతుంటారు. రాఘవయ్య మాష్టారు తన పిల్లలు తెలివైన వాళ్ళే. కానీ దాని వెనుక తనకృషి చాలా ఉంది. గోపి తండ్రి వాచ్‌మెన్ తల్లి నాలుగైదు ఇళ్ళల్లో పాచిపని చేస్తుంది. కొడుకేం చదువుతున్నాడో.. అసలు స్కూల్‌కి వెళుతున్నాడా? లేదా? అని పట్టించుకొనే శ్రద్ధ ఉండదు వాళ్ళకి. అయినా ఎంత శ్రద్ధ చదువంటే గర్వంగా అన్పిస్తుంది. అలాంటి శిష్యునికి గురైనందుకు. అందుకే గణితావధానంలో కూడా ఎంతో శిక్షణ ఇస్తున్నారు రాఘవయ్య మాష్టారు. గోపీనాద్ గణితావధానం అంటే ఆ చుట్టు ప్రక్కల గ్రామాల్లో ఎంతో పేరు. "ఏమిటిసార్! ఆలోచిస్తున్నారు?" "ఏం లేదు... సబ్జెక్టు అర్థమయ్యిందిగా" "అర్థమయ్యిందిసార్. నేను వెళ్ళోస్తాను" పుస్తకాల సంచి భుజాన వేసుకొంటూ అన్నాడు. "భోంచేసి వెళ్ళరా" "ఇక్కడెవరికి వండివార్చలేదు. వాడు భోజనం చేస్తే మీరు పస్తుండాలి" కరుగ్గా అంది శాంత. "వద్దమ్మా! నేను మాయింటి దగ్గర తింటాను" అంటూ వెళ్ళిపోతున్న గోపితో "గోపీ! రేపు సాయంత్రం ఇరగవరం స్కూల్లో గణితావధానం ఇవ్వాలి. రాత్రి కొంచెం ప్రాక్టీస్ చెయ్యి" అన్నారు. రాఘవయ్య మాష్టారు "అలాగే సార్" అంటూ వెళ్ళి పోయాడు.

ఇరగవరం హైస్కూల్లో గోపీనాథ్ ఇచ్చిన గణితావధానం అందరి పెద్దల మన్ననలు పొందింది. అనేక మంది అడిగిన ప్రశ్నలకు కరెక్టుగా సమాధానమిస్తున్నాడు. గోపీనాథ్. ఆ ప్రదేశమంతా చప్పట్లతో మారుమ్రోగిపోయింది. ఎందరో పెద్దలు ఎన్నెన్నో కానుకలు ఇచ్చారు. అవన్నీ తీసికొని రాఘవయ్య మాష్టారుతో ఇంటికి బయలుదేరాడు గోపీనాద్ "గోపీ! ఈరోజు డబ్బే 5 వేలు వరకు వచ్చింది. అది నాపేరున బ్యాంక్‌లో వేస్తాను". "ఇదంతా మీచలవే సార్!" "అదేంకాదు. నీ ప్రతిభే" ఆనందంతో మాటలు రాలేదు రాఘవయ్య మాష్టార్‌కి తనకి ప్రోత్సహించి గణితావధానంలో తీర్చిదిద్దినది రాఘవయ్య మాష్టారే. తన గణితావధానం చిన్న పిల్లకాలవలే మొదలై నదిలా మారింది. ఎన్నో స్కూళ్ళనించి ఆహ్వానాలు అందుతున్నాయి. వాళ్ళిచ్చే తృణమో, పణమో తనకే ఇచ్చేసేవారు రాఘవయ్య మాష్టారు. అది తన ఖర్చులు కొంతవరకు తీర్చుకోడానికి సరిపోయేది. "గోపీ! మన ఊరు వచ్చేసాం" మాష్టారు అనడంతో ఆలోచనలనించి తేరుకొని ఆటోదిగాడు.

కాలచక్రం గిర్రున తిరిగింది. రాఘవయ్య మాష్టార్‌కి ట్రాన్స్‌ఫర్ అయ్యి వాళ్ళ సొంత మండలం వెళ్ళిపోతున్నారని తెలిసి ఇంటికి పరిగెత్తుకెళ్ళాడు గోపీనాథ్ సమాన్లు సర్దిన రిక్షాలు బయలుదేరడానికి సిద్దంగా ఉన్నాయి. గోపిని చూసి "రా! గోపీ! మా ఊరు వెళ్ళిపోతున్నాము. ఎపుడైనా రా! అంటూ నవ్వారు రాఘవయ్య మాష్టారు. " మాష్టారూ! మీరు మళ్ళీ నాకు కనబడరా!" కన్నీళ్ళుతుడుచుకొంటూ అన్నాడు గోపి. "పిచ్చి మోహమా! ఎందుకనబడను. మేం వెళ్ళేది ఇక్కడికి అరవై కిలోమీటర్లేగా. 2 గంటల ప్రయాణం ఎప్పుడైనా రావొచ్చు" అని గోపిని ప్రక్కకి తీసికెళ్ళి "గోపీ! నీ ఎకౌంట్‌లో నేను కొంత డబ్బు వేసాను. జాగ్రత్తగా చదువుకి ఖర్చుపెట్టుకో. ప్రతినెల నీ ఎకౌంట్‌లో కొంత జమచేస్తూనే ఉంటాను. మళ్ళీ నువ్వు నాకు కలెక్టర్‌గానే కనిపించాలి" అని చెప్పి వెళ్ళిపోయారు.

తాను సివిల్స్‌లో సెలక్టయి జాబ్ వచ్చేవరకు ఆయన డబ్బు పంపుతూనే ఉన్నారు. తరువాత తానే వద్దని లెటర్ రాసాక మానేసారు. తరువాత ఉద్యోగ రిత్యా వేరే రాష్ట్రానికి వెళ్ళిపోయాడు. కొన్ని సంవత్సరాల తరువాత ఇపుడే తిరిగి రావడం. " భోంచేయరా!" భార్య పిలుపుకి ఆలోచనలనించి తేరుకొని భోజనానికి లేచాడు. భోజనం చేస్తూ "విమలా! నీకో మాట చెప్పాలి. నువ్వు కాదనవనేనమ్మకం ఉంది" అన్నాడు. "చెప్పండి" "మాష్టార్‌ని, వారిభార్యని మనతో పాటు ఉంచుకొందాం" "అలాగే. మీ ఇష్టం.రేపే వెళ్ళి తీసికొద్దాం" అంటున్న భార్యవంక ఆనందంగా చూసాడు గోపీనాథ్.

రాఘవయ్య మాష్టార్‌ని, శాంతమ్మ గారిని ఇంటికి తీసికొని రావడానికి చాలాశ్రమ పడవలసి వచ్చింది. చాలా సేపటి వరకు అంగీకరించలేదు. ఎలాగైతేనేం వాళ్ళని ఒప్పించి తీసికొని వచ్చేసరికి విమల పూర్తిగా అలసిపోయింది. వారికి గదిని కేటాయించి టూర్‌లో ఉన్న భర్తకి ఫోన్ చేసి విషయం చెప్పింది. గోపీనాథ్ చాలా ఆనందించాడు. తాను నాలుగైదు రోజుల్లో తిరిగివచ్చేస్తానని భార్యకిచెప్పాడు. "మీ శిష్యుడు నాలుగురోజుల్లో వస్తానని ఫోన్ చేశారు. మిమ్మల్ని ఏ లోటు లేకుండా చూడమన్నారు" తెచ్చిన పళ్ళరసం గ్లాసులో ఇద్దరికి అందించి చెప్పింది. "మీకు శ్రమ" రాఘవయ్య మాష్టారు అన్నారు. "అలా అనకండి. మీరు మా దగ్గర ఉండటం వారికి ఎంతో ఆనందం" అంటూ గ్లాసులు తీసికొని వెళ్ళిపోయింది.

విమల ఆదరణలో నాలుగు రోజులు... నాలుగు క్షణాల్లా గడిచిపోయాయి. వృద్ధాప్యంలో పిల్లలు దగ్గర ఉండటం ఎంత అవసరమో మరీమరీ కొట్టొచ్చినట్టు కనబడసాగింది సాంతమ్మ గారికి.

"ఏమిటి! కలెక్టర్ గారి కారుకి ఏక్సిడెంట్ అయ్యిందా! తలకి, కంటికి బాగా దెబ్బలు తగిలాయా?" విమల ఫోన్లో కంగారుగా మాట్లాడుతుంది. "ఏమిటి శాంతా!" రాఘవయ్యగారు ఆందోళనగా అడిగారు. "గోపి కారుకి ఏక్సిడెంట్ అయ్యిందట. హాస్పిటల్లో జాయిన్ చేసారుట" శాంతమ్మ గారు కంగారుగా అంది. విమలేడుస్తూ కారు మీద భర్త దగ్గరికి వెళ్ళింది. రాత్రయ్యింది. రాఘవయ్య గారు,శాంతమ్మల ఆందోళనకు అంతులేదు. ఎవరూ రాలేదు. ఫోన్ కూడా రాలేదు. బిక్కుబిక్కుమంటూ తెల్లవార్లు కంటిమీద కునుకు లేకుండా గడిపారు. మర్నాడు విమల తల్లిరమణమ్మ వచ్చింది. శాంతమ్మ వంక చురచురచూస్తూ "బిడ్డొచ్చిన వేళగొడ్డొచ్చిన వేళ అన్నారు. ఎవరి పాదం ఎలాంటిదో..కొడుకు, కూతురు అక్కర్లేదనుకొన్న వాళ్ళని తెచ్చుకొని నెత్తిన పెట్టుకొన్నారు. నా అల్లుడి రెండు కళ్ళు పట్టుకెళ్ళారు" బిగ్గరగా అరుస్తూ కేకలు వేయసాగింది. శాంతమ్మగారు అవమానాన్ని లెక్కచేయకుండా "గోపీ కళ్ళుపోయాయా?" అంది "పోయాయి. ఇదంతా మీ మూలానే" "మామూలానా? మేమేం చేసాము?" తెల్లబోతూ అంది. "కొన్ని దరిద్రపు పాదాలుంటాయి. ఇక బయటకి నడవండి" కరుగ్గా అని పెట్టెలు బయటకు గిరాటువేసింది. భర్తకి విషయం చెప్పి ఆశ్రమానికి వెళ్ళిపోదాం" అంది "ముందు గోపినుంచిన హాస్పిటల్‌కి వెళ్ళాలి తీసికెళు. టాక్సీని పిలువ్" శాంతమ్మ క్రింద కెళ్ళి టాక్సీని పిలుచుకొని వచ్చింది. టాక్సీడ్రైవర్ సాయంతో రాఘవయ్య మాష్టారుని టాక్సీ ఎక్కించి ఆసుపత్రికి తీసికొని వెళ్ళారు.

"మళ్ళీ చూపువచ్చే అవకాశం లేదా?" విమల ఏడుస్తూ అడుగుతుంది. డాక్టర్‌ని. "ఎవరైనా రెండు కళ్ళు ఇస్తే తప్ప కష్టం" ఆ మాటవిని సృహతప్పి పడిపోయింది విమల. ఆమెను బెడ్‌మీద పడుకోబెట్టి డాక్టర్ బయటికి వచ్చారు. బయట బల్లమీద కూర్చొన్న రాఘవయ్య మాష్టారు డాక్టర్‌ని చూచి "బాబూ! బాబూ! నామాటకాస్త వింటారా" అన్నాడు. ఏమిటి? చెప్పండి."అరగంట మాట్లాడారు రాఘవయ్య మాష్టారు శాంతమ్మ వెక్కివెక్కి ఏడుస్తూనే ఉంది. "ఇది పూర్తిగా అంగీకారంతోనే కాగితంపై వ్రాసి ఇస్తాను" "సరే మీ ఇష్టం" అనేసి డాక్టర్ వెళ్ళిపోయాడు.

మరునాడే ఆపరేషన్ రాఘవయ్య మాష్టారు రెండు కళ్ళుతీయడం జరిగింది."ఇంత త్యాగాన్ని నేభరించలేను. మనుషుల్లోనే దేవుళ్ళుంటారనే సత్యాన్ని నేను నేడు చూస్తున్నాను." విమల రాఘవయ్య మాష్టారి కాళ్ళమీద పడిఏడుస్తుంది. "లేదమ్మా! నాశిష్యుడి చూపులో నేను జీవించే ఉంటాను. ఈ చివరిక్షణాల్లో కూడా నాజన్మకి ఒక సార్థకత కల్పించాడు. బలహీనమైన నా గుండె ఇక పనిచేయను అంటుంది. మరి శెలవ్" ఆయన శాశ్వత నిద్రలోకి జారి పోయారు.

పది రోజుల అనంతరం గోపీనాథ్ తన గదిలో పడుకొన్నాడు. మాష్టారిచ్చిన కొత్త చూపుతో ఆయన ఫోటోకి వేసిన దండవంక చూస్తున్నాడు. మాష్టారి పటం క్రింద వెలిగించిన వత్తితాను కాలీపోతూ గదిలో వెలుగునిస్తుంది. ఆ వత్తికి, రాఘవయ్య మాష్టారికి తేడా లేదనిపించింది గోపీనాథ్‌కి.




# ప్రభుత్వ రంగాన్ని కాపాడే వారిని గెలిపించండి

## యుటియఫ్ రాష్ట్ర కార్యవర్గం పిలుపు

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం తేది: 04.12.2014న యుటియఫ్ రాష్ట్ర కార్యాలయం విజయవాడలో ఐ.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది.

కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథులుగా పిడియఫ్ ఎమ్మెల్సీలు వి.బాలసుబ్రహ్మణ్యం, కె.యస్.లక్ష్మణరావు, బొడ్డు నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఫిబ్రవరిలో జరుగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడేవారిని బలపరచాలని పిలుపునిచ్చారు. కృష్ణ, గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ నియోజక వర్గంలో ఇప్పటికే రెండుసార్లు గెలిచి, అందరికి అందుబాటులో వుండే వ్యక్తిగా, ఉపాధ్యాయుల, అధ్యాపకులు విద్యారంగ సమస్యలతో పాటు అన్ని రంగాల్లోని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్న కె.యస్.లక్ష్మణరావు గారిని బలపరచాలని, అలాగే తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో జరిగే ఎన్నికలలో సి.ఆర్.ఆర్. కళాశాలలో ప్రిన్సిపల్‌గా రిటైరైన, సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, బలహీన వర్గాల విద్యార్థులకు విద్యనందించాలనే తపనతో పనిచేసే మానవతావాదిగా, పేరొందిన ఆర్.సూర్యారావుగారిని యుటియఫ్ తరపున బలపరచాలని రాష్ట్ర కార్యవర్గం తీర్మానించింది.

సమావేశంలో పాల్గొన్నా పిడియఫ్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ వి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ శాసనమండలిలో పిడియఫ్ ఎమ్మెల్సీలు ఆరుగురు ఉపాధ్యాయులు, అధ్యాపకుల, కాంట్రాక్టు లెక్చరర్స్, గురుకుల మోడల్‌స్కూల్స్ సమస్యలతో పాటు, ప్రభుత్వ విద్యారంగంలో సమస్యలపట్ల పలుదఫాలు చర్చించామని, రాబోయే ఎన్నికల్లో నిజాయితీపరులు, ప్రభుత్వ రంగాన్ని కాపాడే వారిని గెలిపించాలని అన్నారు. ఈ ఎన్నికలను కార్పోరేట్ శక్తులకు ప్రభుత్వ రంగ ప్రతినిధులకు మధ్య జరిగే పోరాటంగా చూడాలని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి కార్యక్రమ నివేదిక ప్రవేశపెట్టారు. డిసెంబర్ 13,14 తేదీలలో 40వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఏలూరులో పెద్ద ఎత్తున జరుగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశాలకు పశ్చిమగోదావరి జిల్లా ఆతిథ్యమిస్తుందని వారికి అభినందనలు తెలిపారు. 13వ తేదీన ప్రారంభసభలు పశ్చిమ గోదావరి జిల్లా మంత్రి, జిల్లా పరిషత్ ఛైర్మన్ మరియు స్థానిక ప్రతినిధులతోపాటు పిడియఫ్ ఎమ్మెల్సీలు, ఎస్‌టిఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి మరియు యుటియఫ్ ఉద్యమ నిర్మాత మాజీ ఎమ్మెల్సీ డి.రామిరెడ్డితోపాటు రాష్ట్ర కమిటి నాయకులు అందరు పాల్గొంటారు. విద్యా సదస్సులో ఎల్.ఐ.సి. జాతీయ నాయకులు, 10 టి.వి. ఛైర్మన్ కె.వేణుగోపాల్ మరియు వి.బాలసుబ్రమణ్యం గారు ప్రసంగిస్తారు. సోదర సంఘాలైన అధ్యాపక సంఘాలు, గురుకుల ఉపాధ్యాయ సంఘాలు, జె.ఎ.సి. నాయకులు, కాంట్రాక్టు లెక్చరర్స్ సంఘనాయకులు పాల్గొని సందేశాలు ఇస్తారని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు మహా ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.

13వ తేది సాయంత్రం 5 గంటలకు రాష్ట్ర కౌన్సిల్ ప్రారంభం అయి 14వ తేది వరకు కొనసాగుతాయన్నారు.

సమావేశంలో గౌరవ అధ్యక్షులు సాబ్జీ, సహాధ్యక్షులు విజయగౌరి, కోశాధికారి తాండవకృష్ణ, ఐక్య ఉపాధ్యాయ ఎడిటర్ సుభాష్ చంద్రబోస్ మరియు రాష్ట్ర కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

**కథలు, కవితల పోటీలలో ప్రచురణకి ఎంపికైన కవిత**

## ఆక్రోశ

**- తంగి యర్రమ్మ**, శ్రీకాకుళం జిల్లా

ఆక్రోశిస్తోంది పసి హృదయం
సజీవ దహన పేటికపై నిస్సహాయంగా ఆక్రోశిస్తోంది
అమ్మఒడిలో అల్లారు ముద్దుగ పెరిగి
కిరాతక అరాచక కబంధ హస్తాలలో నలిగి
ఆక్రోశిస్తోంది పసి హృదయం పరితాపంతో
ఎన్నో హృదయాలు కాలగమనములో ఆక్రోశిస్తూనే ఉన్నాయి
కర్కశ రాక్షస నైజానికి బలౌవుతూనే ఉన్నాయి
నన్ను గాయపరచే అధికారం నీకెవరిచ్చారని
మూగగా ప్రశ్నిస్తూనే ఉన్నాయి
పరిణామం కోసం వేచి చూస్తూనే ఉన్నాయి
కాలగమనములో కలిసిపోతూనే ఉన్నాయి
మరో వీరేశలింగం పుట్టేదెప్పుడని
ఆశిస్తూ నిరాశను చవిచూస్తూ చావు బ్రతుకుల మధ్య
కాలం గడుపుతూ నైరాశ్యంతో ఆక్రోశిస్తోంది
పసి హృదయం భారత దేశంలో ఎందుకు పుట్టానా అని
స్వతంత్ర భారతావనిలో స్త్రీకి స్వేచ్ఛే లేదా?
దుండగుల దురాగతానికి అడ్డే లేదా?
సుకుమార సున్నిత హృదయాలు ఆక్రోశిస్తూ బలికావల్సిందేనా?
స్వరాజ్యం పురుడు పోసుకొని 65ఏళ్ళు అయినా
అర్థరాత్రి ఆడది నడిరోడ్డుపై స్వేచ్ఛగా నడవగలిగిన రోజే
నిజమైన స్వతంత్ర్య దినం అని కలలుగన్న గాంధీ
కలలు తీరేదెప్పుడు ఫలించేదెప్పుడు
ఆశలు తీరకనే ఆశయాలు నెరవేరకనే
ఏసిడ్ దాడులకు, వరకట్న వేధింపులకు బలికావలసిందేనా?
ఆడదిగా ఈ దేశంలో పుట్టటమే పాపమా? పరిహారం లేని శాపమా?
ఈ ప్రశ్నకు బదులేది అని ప్రశ్నించి, ప్రశ్నించి
న్యాయదేవత ఆక్రోశిస్తోంది
మానవత్వం సిగ్గుతో తలవంచుకొంటోంది
అయినా కిరాతకుల్లో మార్పు రాదేం?

# ప్రశ్నోత్తరాలు



*నిర్వహణ :* **టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు,**
**రాష్ట్ర కార్యవర్గ సభ్యులు**
**mail : ikyopadhyaya@gmail.com**

ప్రశ్న : **నాకు 2012 నుండి రావలసిన వేతన బకాయిలు ఈ సంవత్సరం ఆగస్టులో చెల్లించారు. ఈ సంవత్సరం చూపించే ఇన్-కం-టాక్స్‌లో బకాయిలు మొత్తం ఈ సంవత్సరంలోనే చూపించాలా? ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం సర్దుబాటు చేసుకోవచ్చునా?**

**- జి.వివేకానంద,** శ్రీకాకుళం జిల్లా

**జవాబు :** ఐటి నిబంధనల ప్రకారం గత సంవత్సరంలో వచ్చిన బకాయిలు ఆయా సంవత్సరాలలో సర్దుబాటు చేసుకోవచ్చు. ఫారం 10ఇలో వివరాలు సమర్పించి సర్దుబాటు చేసుకోవచ్చు.

ప్రశ్న : **ఎయిడెడ్ ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సు 60 సం॥లకు పెంచుతున్నట్లు ప్రకటించారు కదా! ఉత్తర్వులు వచ్చినవా? ఆగస్టు నెలలో పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులకు కూడా ఈ పెంపుదల వర్తిస్తుందా?**

**- ఎమ్.బాలకృష్ణారావు,** రాజమండ్రి

**జవాబు :** యుటియఫ్ మరియు పిడిఎఫ్ ఎమ్మెల్సీల నిరంతర కృషి ఫలితంగా ఎయిడెడ్ ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సు పెంపుదల దస్త్రం ఆర్థిక మంత్రి ఆమోదం పొంది ముఖ్యమంత్రి వద్దకు చేరింది (ఈ జవాబు వ్రాసే సమయానికి) త్వరలో ఆర్డినెన్స్ లేదా బిల్లు రూపంలో అమలులోకి వచ్చే అవకాశం వుంది. మిగిలిన ఉపాధ్యాయుల మాదిరిగానే ఎయిడెడ్ ఉపాధ్యాయులకు కూడా ఈ పెంపుదల జూన్ 2 నుండే అమలు చేయాలని మన సంఘం, పిడిఎఫ్ ఎమ్మెల్సీల ప్రతిపాదనకు ప్రభుత్వం అంగీకరించడం జరిగింది. జూన్ 2 నుండే పెంపుదల వర్తించే అవకాశం వుంది.

ప్రశ్న : **నేను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. మహిళా ఉపాధ్యాయులకిచ్చే 5 రోజుల ప్రత్యేక క్యాజువల్ సెలవు నాకు మంజూరు చేయడం లేదు. సరియైనదేనా?**

**- సయ్యద్ సుల్తానా,** నెల్లూరు

**జవాబు :** జిఓ నం.374 విద్య; తేది.16.03.1996లో 'Government here by permit the women teachers to avail Five Days Casual Leave extra in addition to the casual leave, optional holidays being availed at present' అని పేర్కొనటం జరిగినందున మహిళా ఉపాధ్యాయినులకు మాత్రమే 5 రోజుల స్పెషల్ క్యాజువల్ సెలవు వర్తిస్తుంది.

ప్రశ్న : **నేను, నా మిత్రుడు డిఎస్‌సి-2008లో ఎస్ఏ (పిఎస్)గా సెలక్ట్ కాబడి ఒకే రోజు విధులలో చేరియున్నాము. మా ఇరువురిలో ఎవరు సీనియర్.**

**- ఎ.శివశ్రీను,** కె.పి.పురం

**జవాబు :** డిఎస్ఇ ఉత్తర్వులు ఆర్‌సి నం.687/డి1-3/2012; తేది. 28.03.2012 ప్రకారము డిఎస్‌సి ర్యాంకు ఆధారముగా సీనియార్టీ నిర్ణయించబడుతుంది. మీ ర్యాంకులు తెలుపనందున ఎవరు సీనియర్ అనేది చెప్పటం సాధ్యం కాదు.

ప్రశ్న : **నేను 1.12.1995న ఎస్‌జిటిగా విధులలో చేరియున్నాను. మరోక ఉపాధ్యాయుల తదుపరి డిఎస్‌సిలో ఎంపికై 15.12.1998 తేదీన ఎస్‌జిగా చేరియున్నారు. ఇరువురం 02.02.2009న ఎస్ఎ (గణితం)గా పదోన్నతి పొందియున్నాము. ఎస్ఏ కేడర్‌లో ఎవరు సీనియర్.**

**- ఎన్.సుమతి**

**జవాబు :** సి & డిఎస్ఇ ఉత్తర్వులు ఆర్‌సి నం.142/సి3-1/2011; తేది.11.08.2011 ప్రకారం ఎస్ఏ కేడర్‌లో సీనియార్టీ కేడర్ కేటగిరీ అయిన ఎస్‌జిటి క్యాడర్‌లో సీనియార్టీ ప్రకారం నిర్ణయించబడుతుంది. ఎస్‌జిటి క్యాడర్‌లో సీనియర్ అయిన మీరే ఎస్ఏ క్యాడర్‌లో సీనియర్ అవుతారు.

ప్రశ్న : **పిఎఫ్ ఖాతా నుండి పార్ట్ ఫైనల్‌లోనే పొందటానికి అర్హత లేమిటి? వైద్య ఖర్చులకు గరిష్టంగా ఎంత ఋణం పొందవచ్చు?**

**- సిహెచ్.రవికుమార్,** అనంతపురం

**జవాబు :** ప్రావిడెంట్ ఫండ్ నిబంధన 15ఏ ప్రకారం 20 సం॥ సర్వీస్ పూర్తిచేసి లేదా 10 సం॥లోపు పదవీ విరమణ కాలం ఉండాలి. గృహ నిర్మాణం, స్థలం కొనుగోలు నిమిత్తం 15 సం॥ సర్వీస్ పూర్తి అయినా సరిపోతుంది. రూల్ 15సి ప్రకారం సాధారణంగా మూలవేతనానికి 6రెట్లు లేదా నిల్వయున్న సొమ్ము లో సగం ఏది తక్కువైతే అది ఋణంగా చెల్లిస్తారు. గరిష్టంగా వైద్య ఖర్చుల కొరకు 75% వరకు మంజూరు చేయవచ్చు.

ప్రశ్న : **నేను 19.1.2002న ఎస్‌జిటిగా విధులలో చేరియున్నాను. ప్రీపొన్మెంట్ వలన నా ఇంక్రిమెంట్ అక్టోబర్‌కి మారింది. 12 సం॥ల స్కేలు పొందిన తర్వాత నా తదుపరి ఇంక్రిమెంట్ జనవరికి నిర్ణయిస్తూ ఉత్తర్వులు యిచ్చారు. దీనిపై వివరణ ఇవ్వగలరు.**

**- సిహెచ్.శోభన్,** నెల్లూరు జిల్లా

**జవాబు :** దీనిపై పూర్తి వివరణ నవంబర్ పత్రికలో ఇదే శీర్షికలో ఇవ్వటం జరిగింది. పరిశీలించగలరు.

ప్రశ్న : **ప్రకాశం జిల్లాలో కొందరు ఉపాధ్యాయులు7.12.2002న సింగిల్ సబ్జెక్టుతో ఎస్ఏగా ప్రమోషన్ పొందియున్నారు. నవంబర్ 1వ తేదీ నుండి సర్వీస్ ప్రొటక్షన్ యిస్తూ**

**విద్యాశాఖ డైరెక్టర్ ఆర్‌సి నం.28/సి3-4/2003; తేది. 20.02.2003న ఉత్తర్వులు యిచ్చారు. వీరికి 12 సం॥ల స్కేల్ ఎప్పటి నుండి వర్తిస్తుంది.**

**- వై.వెంకటేశ్వరరావు,** పిసి పల్లి

**జవాబు :** మీరు పేర్కొన్న ఉత్తర్వులు సీనియార్టీకి రక్షణ కల్పించే నిమిత్తం యివ్వబడినవి. 12 సం॥ల స్కేల్ మంజూరు కొరకు విధులలో చేరిన తేదీని మాత్రమే పరిగణనలోకి తీసుకోవటం జరుగుతుంది. వీరికి జీతనష్టపు సెలవు లేకపోతే తగు అర్హత ఉన్నవారికి 07.12.2014 నుండి 12 సం॥ల స్కేలు మంజూరు చేస్తారు.

**ప్రశ్న : సంపాదిత సెలవు ఒకే పర్యాయం ఎన్ని రోజులు వాడు కోవచ్చు?**

**- కె.నారాయణ,** చిత్తూరు జిల్లా

**జవాబు :** జిఓ నం.153 ఆర్థిక; తేది.04.05.2010 ప్రకారం సంపాదిత సెలవు ఒకే పర్యాయం 180 రోజుల వరకు వాడుకోవచ్చు.

**ప్రశ్న : నేను ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయునిగా పని చేయు చున్నాను. ఇంటర్, టిటిసి అర్హతలు గల నేను 12 సం॥ల స్కేలుపొందే అవకాశం వున్నదా?**

**- వి.సతీష్,** గుంటూరు జిల్లా

**జవాబు :** ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయునికి 12 సం॥ల స్కేలు అంటే ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుని స్కేలు ఇవ్వబడుతుంది. ఆ స్కేలు పొందటానికి డిగ్రీ, బిఇడి మరియు డిపార్ట్‌మెంట్ పరీక్షలలో ఉత్తీర్ణత పొందవలసి యుంటుంది. మీకు ఆ అర్హతలు లేనందువలన 12 సం॥ల స్కేలు మంజూరు చేయ బడదు.

**ప్రశ్న : డ్రాయింగ్ ఉపాధ్యాయునిగా మా పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు 24 సం॥ల స్కేలు పొందా లంటే కావలసిన అర్హతలేమిటి?**

**- జి. శర్వాణి,** ఒంగోలు, ప్రకాశం జిల్లా

**జవాబు :** జిఓ ఎంఎస్ నం.10 విద్య; తేది.23.1.2009 మరియు జిఓ ఎంఎస్ నం.12 విద్య; తేది. 23.01.2009 ప్రకారం డిగ్రీ, బిఇడి మరియు డిపార్ట్‌మెంట్ పరీక్షలు ఉత్తీర్ణులై ఉండాలి.

**ప్రశ్న : ఉపాధ్యాయులు పాటించవలసిన డ్రస్‌కోడ్‌పై ఉత్తర్వు లు ఏమైనా ఉన్నాయా?**

**- బి.గంగరాజు,** మచిలీపట్నం

**జవాబు :** ఆర్‌సి నం.138/ఇ1-1/2013; తేది.03.04.2013 ద్వారా ఉపాధ్యాయులు జీన్స్ ప్యాంట్, టీ-షర్ట్ 8 జేబులు / 4 జేబులు ఫ్యాంట్, ఫ్లిప్‌ఫ్లాప్ షూ ధరించరాదని పాఠశాల విద్యా డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేసి యున్నారు.

**ప్రశ్న : మా పాఠశాలలో ఒక ఉద్యోగి కారుణ్య నియామకం ద్వారా ఈ సంవత్సరం ఆగస్టు 1వ తేదీన ఉద్యోగంలో చేరారు. అతనికి ఎపిజిఎల్ఐ మినహాయిం పుకు ఒక సంవత్సరం ఆగాలా? ఎప్పటి నుండి మినహాయించాలి?**

**- శ్రీలక్ష్మి,** నెల్లూరు జిల్లా

**జవాబు :** జిఓ ఎంఎస్ నం.199 ఆర్థిక; తేది.30.07.2013 ప్రకారం ఉద్యోగుల మొదటి నెల వేతనం నుండే ఎపిజిఎల్ఐ మినహాయించాలి.

**ప్రశ్న : సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరితే ఎన్ని రోజులలోపు సమాధానం ఇవ్వాలి?**

**- బెల్లంకొండ కోటేశ్వరరావు,** నగరం

**జవాబు :** సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం సాధారణం గా సమాచారం కోరిన 30 రోజులలోపు సమాధానం ఇవ్వవలసి ఉంటుంది.

**ప్రశ్న : ఉపాధ్యాయుల సర్వీస్ రిజిష్టర్‌లో సర్వీస్ వెరిఫికేషన్ ఎప్పుడు నమోదు చేయాలి.**

**- కె.శ్రీహరి,** తాడేపల్లిగూడెం

**జవాబు :** ప్రతి సంవత్సరం ఏప్రిల్‌లో సర్వీస్ వెరిఫికేషన్ వేయ వలసిన బాధ్యత కార్యాలయాధికారిది. దీనిపై మెమె నం. 8388/515/ఎఫ్ఆర్-2/2011-1; తేది. 20.01.2012 ద్వారా ఉత్తర్వులు ఇవ్వబడినవి.

**ప్రశ్న : ఎయిడెడ్ ఉపాధ్యాయులు మరణిస్తే అంత్యక్రియల ఖర్చులు రూ.2000/-లు మాత్రమే చెల్లిస్తామని అంటు న్నారు. సరియైనదేనా?**

**- ఎస్.కళ్యాణరావు,** అనంతపురం జిల్లా

**జవాబు :** సరియైనదికాదు. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు కూడ అంత్యక్రియల ఖర్చులు రూ.10000/-లకు పెంపు దల చేస్తూ జిఓ ఎంఎస్ నం.38 విద్య; తేది.28.05. 2013 జారీ చేయటం జరిగింది.

**ప్రశ్న : నేను బిఎస్‌సి ఎంఇడి అర్హతలు కలిగి 1995లో సెకం డరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరాను. అప్పుడు నాకు 3 అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేశారు. ఇటీవల ఆడిట్ వారు ఎంఇడికి అదనపు ఇంక్రిమెంట్ రాదని అభ్యంతరం వ్రాశారు. సరియైన దేనా?**

**- ఎ.బి.జి.నరసింహారావు,** కర్నూలు జిల్లా

**జవాబు :** సరియైనదే. పిజి అర్హత ఉంటేనే ఎంఇడికి అదనపు ఇంక్రిమెంట్ అనుమతించబడుతుందని మెమో ఆర్ సి నం. 5399/112/సి3/99; తేది.23.11.2000 ద్వారా వివరణ ఇవ్వబడింది.

### ఆర్థిక శాఖామంత్రితో ...

డిసెంబర్ 2వ తేదీన జెఏసి చైర్మన్ పి.అశోక్‌బాబు, సెక్రటరీ జనరల్ ఐ.వెంకటేశ్వరరావుతో కూడిన ప్రతినిధి వర్గం ఆర్థికశాఖామంత్రి యనమల రామకృష్ణునితో మూడు సమస్యలపై ప్రాతినిధ్యం చేయడ మైనది. ఎయిడెడ్ సిబ్బందికి 60యేండ్ల రిటైర్మెంట్ ఫైలు ఆమోదించి సిఎంకు పంపాలని కోరగా అప్పటి కప్పుడే సంతకం చేసి సిఎంకు ఫైలు పంపించారు. రెట్రాస్పెక్టివ్‌గా అమలు చేస్తామని చెప్పారు. ఎయిడెడ్ సిబ్బందికి ఈ సంవత్సరం యిచ్చిన బడ్జెట్ 8 నెలలకు కూడా సరిపోలేదని, సంస్కృత పాఠశాలకు నాలుగు నెలలుగా జీతాలు లేవని, రాష్ట్రంలో ఇతర పాఠశాలల జీతాల పరిస్థితి ఇదేనని చెప్పడం జరిగింది. కావున ఎయిడెడ్ సిబ్బందికి జీతాలు, అరియర్లకు అదనపు గ్రాంట్ విడుదల చేయాలని కోరడం జరిగింది. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ చేయాలని కోరగా ఈ విషయంలో తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సుప్రీంకోర్టు తీర్పును పరిశీలించి వెంటనే నిర్ణయం తీసుకొంటామని ఆర్థికమంత్రి హామీ ఇచ్చారు. 10వ పీఆర్సీ, ఇతర సమస్యలపై క్యాబినెట్ సబ్ కమిటీ ఫైల్ గత నెల రోజులుగా సిఎం కార్యాలయంలో ఉందన్నారు. డిసెంబర్ 10న జరిగే కేబినెట్‌లో కమిటీ ఏర్పాటు ఫైనల్ చేసి వెంటనే చర్చలు ప్రారంభిం చాలని జేసి నేతలు కోరడం జరిగింది.

### డిఎస్‌సి 2014 మున్సిపల్ ఖాళీ పోస్టులు చేర్పించుటకు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు - యుటియఫ్ కృషి

నవంబర్ 20వ తేదీన ప్రభుత్వం ప్రకటించిన 2014 డిఎస్‌సి ఖాళీలలో మున్సిపల్ ఖాళీలు 1252 ప్రకటించకపోవడంపై యుటియఫ్, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం మున్సిపల్ మంత్రి నారాయణ గారితో ఫోన్లో సంభాషిస్తూ గతంలోనే డిఎస్‌సిలో మున్సిపల్ ఖాళీలు చేర్చాలని తాము చేసిన ప్రాతినిధ్యం మేరకు 1252 పోస్టులు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుండి వచ్చాయని అవి డిఎస్‌సిలో చేర్చలేదని మంత్రిగారి దృష్టికి తెచ్చారు. తప్పనిసరిగా ఈ డిఎస్‌సి ఖాళీలలో చేర్చాలని చెప్పడం జరిగింది. విద్యాశాఖ కార్యదర్శి, డైరెక్టర్లతో ఇదే విషయం డిమాండ్ చేయడం జరిగింది. దీనితో ఒక్క రోజులోనే 1252 పోస్టులు డిఎస్‌సిలో చేర్చుతూ ఉత్తర్వులు యిచ్చారు. మున్సిపల్ మంత్రిగారి స్పందనకు ధన్యవాదాలు.

### ఎయిడెడ్ బడ్జెట్ విడుదలకు కృషి

ఈ సంవత్సరం కేటాయించిన బడ్జెట్ ఎయిడెడ్ ప్రైమరీకి, సంస్కృత పాఠశాలలకు రెండు క్వార్టర్లకు కూడా సరిపోలేదు. దీనిపై పాఠశాల విద్య డైరెక్టర్, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ గారికి ప్రాతినిధ్యం చేసి 4వ క్వార్టర్ బడ్జెట్ నుండి జీతాల చెల్లింపుకు క్లియరెన్స్ యిప్పించుటకు కృషి చేశాము. ఆ మేరకు ప్రాథమిక పాఠశాలలకు 3864 కోట్లు, సంస్కృత పాఠశాలలను 6.56 కోట్లు విడుదల చేశారు. 60 కోట్లు అదనపు బడ్జెట్‌ను వ్రాసినా అది కూడా సరిపోయే పరిస్థితి లేదు. కావున జిల్లాల నుండి జీతాలు అరియర్లకు ఎంత బడ్జెట్ అవసరమో డిఇఓల నుండి వివరాలు రప్పించాలని సిఇఓను కోరడం జరిగింది. కావున డిఇఓల నుండి అరియర్స్ వివరాలు డిఎస్‌సికి పంపించుటకు జిల్లా శాఖలు కృషి చేయాలి.

### హెల్త్‌కార్డులు అమలులో ఇబ్బందులు తొలగించాలి

అక్టోబర్ 30న హెల్త్‌కార్డులు ప్రారంభించినా నేటికీ పూర్తిస్థాయిలో ఈ పథకం అమలులోకి రాలేదు. ముఖ్యంగా ప్రైవేట్ ఆసుపత్రులు ప్యాకేజీ రేట్లపై పేచీ పెడుతున్నాయి. హెల్త్‌కార్డులపై వైద్యాన్ని నిరాకరిస్తున్నాయి. ఈ విషయాన్ని వైద్య ఆరోగ్యశ్రీ కార్యదర్శితో ఆరోగ్యశ్రీ సిఇఓ ధనుంజయ రెడ్డిగారితో పలుమార్లు చర్చించాము. ప్రైవేట్ ఆసుపత్రుల యజమానులను ఒప్పిస్తామని చెప్పారు. ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్, సిఇఓగారు చర్చించినప్పటికి నేటికీ పరిస్థితిలో మార్పులేదు. నవంబర్ 27న జెఏసి తరపున వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శితో ప్రాతినిధ్యం చేయడమైనది. ఈ పరిస్థితిలో డిసెంబర్ నుండి మూడు మాసాలు మెడికల్ రీయింబర్స్‌మెంట్ కొనసాగించాలని కోరగా ఆ మేరకు ఉత్తర్వులు యిస్తామని చెప్పారు. నవంబర్ 28న ఆరోగ్యశ్రీ జనరల్ మేనేజర్ ఎ.విజయలక్ష్మితో జెఏసి చైర్మన్, సెక్రటరీ జనరల్‌తో కూడిన ప్రతినిధి వర్గం క్షేత్రస్థాయిలో యిబ్బందులను చెప్పటం జరిగింది. త్వరలో ఈ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### మున్సిపల్ టీచర్ల ప్రావిడెంట్ ఫండుపై ఆర్థికశాఖతో చర్చలు

నవంబర్ 20న మున్సిపల్ ప్రావిడెంట్ ఫండ్‌పై ఆర్థికశాఖ అధికారులతో ప్రాతినిధ్యం చేయడమైనది. ఆర్థిక శాఖలో మూడు ప్రతిపాదనలపై చర్చ జరుగుతుంది. ఒకటి జిల్లా పరిషత్, మండల పరిషత్ ఉపాధ్యాయులతోపాటు మున్సిపల్ ఉపాధ్యాయులకు కూడా జనరల్ ప్రావిడెంట్ ఫండ్ అక్కౌంట్స్ నిర్వహణ బాధ్యత ట్రెజరీలకు అప్పగించడం, రెండు ఎంప్లాయీస్ ప్రావిడెంట్‌ఫండ్ స్కీమ్‌లో భాగంగా నిర్వహించడం, మూడు మున్సిపల్ ప్రావిడెంట్ ఫండుగా మున్సిపాలిటీలే నిర్వహించడంపై చర్చ జరిగింది. డిటిఏ నుండి రిమార్కులు తీసుకొంటామని, ఇప్పటివరకు మున్సిపల్ ఉపాధ్యాయుల వ్యక్తిగత ఖాతాలో ఉన్న అసలు మరియు వడ్డీతో ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి అందజేయాల్సి ఉంటుందని చెప్పారు. పై మూడు ప్రతి పాదనలలో త్వరలో నిర్ణయం చేసుకోవాలని కోరాము.

### విజయవాడ, విశాఖ కార్పొరేషన్ ఉపాధ్యాయులకు ఏపిజిఎల్ఐ వర్తింపు చేయాలి

విజయవాడ, విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఉపాధ్యాయులకు ఏపిజిఎల్ఐ పాలసీలు మంజూరు చేయాలని ఏపిజిఎల్ఐ డైరెక్టర్ మరియు ఆర్థికశాఖ అధికారులతో చర్చించడం జరిగింది. ఆర్థికశాఖ కార్యదర్శి ఎన్.ప్రేమచంద్రారెడ్డిగారు తమ శాఖ అధికారులతోను, ఏపిజిఎల్ఐ అధికారులతోను చర్చించి నిర్ణయం తీసుకొంటామని హామీ ఇచ్చారు. ఆర్థిక శాఖ అనుమతితో కార్పొరేషన్ ఉపాధ్యాయుల కు పాలసీలు త్వరలోనే విడుదల చేస్తామని ఏపిజిఎల్ఐ డైరెక్టర్ ఎఫ్ఏసి మణిశేఖర్ తెలియజేశారు.




## విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి ! ప్రభుత్వ విద్యను పటిష్టపరచాలి!
## విద్యా వ్యాపారీకరణ, మతతత్వీకరణకు వ్యతిరేకంగా పోరాడండి

# ఢిల్లీలో జాతీయ విద్యా సదస్సులో వక్తల పిలుపు

భారత పాఠశాలల ఉపాధ్యాయుల సమాఖ్య (ఎస్‌టిఎఫ్ఐ) ఆధ్వర్యంలో జాతీయ విద్యా సదస్సు ఢిల్లీలో నేషనల్ క్లబ్‌లో నవంబర్ 13న అభిజిత్ ముఖర్జీ అధ్యక్షతన జరిగింది. రాజ్యసభ సభ్యులు శ్రీ సీతారాం ఏచూరి ఈ సదస్సును ప్రారంభిస్తూ విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చి 5 సంవత్సరాలు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం సరిపడా నిధులు కేటాయించక నిర్వీర్య పర్చిందన్నారు. హక్కు హక్కుగానే వుంది తప్ప అమలు శూన్యం అన్నారు. ఈ ప్రభుత్వ విద్యారంగంలో వివేచనతో కూడిన చదువు సాధ్యమని పాలకులకు అది ఇష్టం లేదన్నారు. ప్రస్తుతం భారత్ ఉన్నత విద్య 12 నుండి 15% మంది మాత్రమే చదువుచున్నారని, 30 నుండి 40% మంది చదివితే ప్రపంచాన్ని శాసిస్తామన్నారు. ఆంధ్రాలో 7000 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరుతో ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలకు ప్రజల సొమ్మును కట్టబెట్టిందన్నారు. విద్యలో మతతత్వ ధోరణులు సోదాహరణంగా వివరించారు.

ప్రొ॥ అనిల్ సద్గోపాల్ మాట్లాడుతూ ప్రధాని "నిపుణుల భారత్" ఏర్పాటు లక్ష్యం అంటున్నారని, నిపుణులు అంటే ఆయన అర్థం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసేవారన్నారు. స్కూళ్ళలో నమోదు 100% అని గొప్పగా చెబుతున్నారని, నమోదు అంటే స్కూల్ రిజిష్టర్‌లో పేర్లు రాసుకోవడం మాత్రమేనన్నారు. ఇప్పటికి 90% మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు 12వ తరగతి చదవడం లేదన్నారు. 12వ తరగతికి చదువు ఈనాటి సమాజంలో అనేక ఉద్యోగులకు కనీస చదువని గుర్తుచేశారు. దేశంలో 2/3 స్కూళ్ళకు క్లాసుకొక టీచరుల లేదని, 3/4 స్కూళ్ళకు (ప్రైమరీ) హెడ్మాష్టరు లేదని తెలిపారు. మ్యూజిక్, ఆర్ట్ టీచరు లేకుండా "విద్యాహక్కు చట్టం" ఎలా అమలు అవుతుందని ప్రశ్నించారు. జర్మన్ వాళ్ళకు స్కూల్ ఫీజు అనే మాటకు అర్థం తెలీదు. ఆ దేశంలో కెజి నుండి పిజి వరకు ఫీజులేదు. ఇక్కడ మనకు ఎంత ఫీజు కడితే అంత మంచి చదువు. ప్రభుత్వ ఖర్చుతో నడిచే స్కూళ్ళే ఉండాలని అందుకై పోరాడాలని పిలుపునిచ్చారు.

ప్రొ॥ శాంతాసిన్హా మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా ఈ దేశంలో చదువు "అమ్మకానికి సరుకు"గా ఉందన్నారు. లాభాల కోసం నడిచే స్కూళ్ళను నిషేధించాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయులకు మూడు నెలలకొకసారి కొత్త ఫార్మెట్లలో టీచర్ల సమయమంతా వృధా చేస్తున్నారని విమర్శించారు. డాక్టర్లకు, లాయర్లకు లేని ఫార్మెట్లు టీచర్లకెందుకని ప్రశ్నించారు.

యుటియఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఐ.వెంకటేశ్వర రావు, పి.బాబురెడ్డి ఆధ్వర్యంలో 20మంది ప్రతినిధుల బృందం ఈ సదస్సులో పాల్గొనింది. ఇందులో తాండవకృష్ణ, కెఎస్ఎస్ ప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, ఉమామహేశ్వరరావు, నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

## ఐ.టి.డి.ఎలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం

రంపచోడవరం ఐ.టి.డి.ఎ. పరిధిలోని ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రావెల కిషోర్‌బాబు గారికి యుటియఫ్ ఏజెన్సీ ఉపసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ఎస్.ఎస్. ప్రసాద్ నేతృత్వంలో వినతిపత్రం అందజేశారు. గిరిజన సంక్షేమ జి.పి.యస్.పాఠశాలల్లో ఉన్న అన్ని ఖాళీ ఉపాధ్యాయ పోస్టులతోపాటు గతంలో మంజూరైన అన్ని పోస్టులను 2014 కామన్ డిఎస్సీలో భర్తీ చేయాలని ప్రధాన డిమాండ్‌గా వినతిపత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఇ.చైతన్య కిరణ్, ఏజెన్సీ ఉపసంఘం సభ్యులు కె.సూరిబాబు, సి.హెచ్. ఆర్.సనాతనబాబు, కె.సూరిబాబు, కె.ఆదిరెడ్డి, సి.హెచ్.ప్రేమ్‌కుమార్, డి.మహేష్ పాల్గొన్నారు.

## రంపచోడవరం ఐ.టి.డి.ఎ. సమస్యలపై ప్రత్యక్ష చర్య నోటీసు

రంపచోడవరం ఐ.టి.డి.ఎ. పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ తేది 08.12.2014న ఐ.టి.డి.ఎ.కార్యాలయం ఎదుట ప్రత్యక్ష చర్యకు యుటియఫ్ తూ.గో.జిల్లా శాఖ నోటీసు ఇచ్చింది. 2011 స్పెషల్ డిఎస్సీ ద్వారా నియమించబడిన అన్‌ట్రైన్డ్ ఉపాధ్యాయులకు ఇన్‌సర్వీస్ శిక్షణ ఇవ్వాలని, 3 సం॥సస్పెన్షన్‌లో ఉన్న ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వాలని, ఆశ్రమ వసతిగృహాల డైట్‌బిల్స్, విద్యార్థుల డేటా ఆన్‌లైన్ చేయడానికి బడ్జెట్ కేటాయించాలని, 2014 సంక్రాంతి శలవులలో పనిచేసిన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులకు సి.సి.ఎస్. మంజూరు చేయాలనీ, నెలవారీ పదోన్నతి ఇవ్వాలనీ, సుదూర ప్రాంతాలకు వేసిన డిప్యూటేషన్స్ రద్దుచేయాలని మొత్తం 11 డిమాండ్లతో నోటీసు ఇచ్చారు.

# ధర్నాలు, నిరసన కార్యక్రమాలు

## ఫ్యాప్టో ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ధర్నా

ఉపాధ్యాయ సమస్యల పట్ల, విద్యారంగ సమస్యలపట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఫ్యాప్టో ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద భారీ ధర్నా జరిగింది. ధర్నాలో 13 జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ధర్నా శిభిరాన్ని రాష్ట్ర జెఏసి సెక్రటరీ జనరల్ ఐ.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘాలు ఐక్యంగా ఫ్యాప్టో ఆధ్వర్యంలో పోరాటానికి సిద్దమవడం సమస్యల తీవ్రతను తెలుపుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు విద్యారంగాన్ని దెబ్బతీస్తున్నాయని ఉపాధ్యాయుల సమస్యలపై పలుదఫాలు విద్యాశాఖ మంత్రి, విద్యాశాఖ అధికారుల దృష్టికి తెచ్చినా పరిష్కరించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష వైఖరిని తెలియజేస్తోందన్నారు. పండిట్, పిఇటి పోస్టుల అప్‌గ్రేడేషన్‌తోపాటు ఎయిడెడ్, మున్సిపల్ టీచర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, 10వ పిఆర్‌సిని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ధర్నా శిబిరానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పిడిఎఫ్ ఎమ్మెల్సీల డిప్యూటీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం విద్యారంగంలో చేస్తున్న మార్పులు ఏకపక్షంగా ఉన్నా యన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం సంఘాలతో చర్చించకపోవడం అప్రజాస్వామికం అన్నారు.

ఫ్యాప్టో కో ఛైర్మన్ పి.బాబురెడ్డి మాట్లాడుతూ జి.వోలు తెచ్చింది మేమే అని చెప్పిన ముఖ్యమంత్రి, ఇప్పుడు తమ ప్రభుత్వంలోనే కౌన్సిలింగ్‌కి విరుద్ధంగా అడ్డదారిన పైరవీ బదిలీలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అక్రమ బదిలీలు వెంటనే రద్దుచేయాలన్నారు. రేషనలైజేషన్ చేయడానికి ముందుగా ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో చర్చిస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోమన్నారు.

ఫ్యాప్టో ధర్నాకు పద్దతుగా జె.ఎ.సి. ఛైర్మన్ అశోక్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగుల హెల్త్‌కార్డుల అమలులో లోపాలు సవరించాలని అన్నారు. 10వ పిఆర్సీ కోసం రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తామని అన్నారు.

ఫ్యాప్టో ఛైర్మన్ కత్తినరసింహరెడ్డి అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఫ్యాప్టో సెక్రటరీజనరల్ పాండురంగ వరప్రసాద్‌తోపాటు కో ఛైర్మన్‌లు, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్, అన్ని భాగస్వామ్య సంఘాల నాయకులు ప్రసంగించారు.

ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడి ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని లేకుంటే పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని అన్నారు.

## యూనివర్సిటీ, ప్రభుత్వ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

యూనివర్సిటీ, రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రికి పిడియఫ్ ఎమ్మెల్సీలు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును నవంబర్ 22 శనివారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యల పట్ల ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఎమ్మెల్సీలు వి.బాలసుబ్రహ్మణ్యం, కె.యస్.లక్ష్మణరావు, డా॥ ఎం.గేయానంద్, వై.శ్రీనివాసులురెడ్డి, ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్, ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ నాయకులు కె.యన్.కోటేశ్వరరావు, ఎ.వి.నాగేశ్వరరావులు వున్నారు.

## ఉపాధ్యాయుల అక్రమ బదిలీలపై యుటియఫ్ ఆందోళన

రాష్ట్రంలో ఉపాధ్యాయుల అక్రమ బదిలీలను నిరసిస్తూ విశాఖపట్నం జిల్లా చౌడవరం మండలం యూటియఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నవంబర్ 26న ఆందోళన నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టిన ఉపాధ్యాయులు ప్రభుత్వ నిర్వాకాన్ని విమర్శిస్తూ నినాదాలు చేశారు. కౌన్సెలింగ్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించిన అక్రమ బదిలీలను తక్షణం రద్దుచేయాలని డిమాండ్ చేశారు. లంచాలు తీసుకుని నిర్వహించిన బదిలీలతో విద్యాశాఖ అప్రతిష్టపాలైందని వారు విమర్శించారు. ఈ సందర్భంగా బదిలీ ఉత్తర్వుల ప్రతులను ఉపాధ్యాయులు దహనం చేశారు. ఈ ఆందోళనలో యూటీయఫ్ జిల్లా శాఖ కార్యదర్శి శరగడం జగ్గారావు, యూటీయఫ్ చీడికావ, చోగవరం, బుచ్చెయ్యపేట మండలాల నాయకులు వేగి సూర్యప్రకాశరావు, జి.చిన్నబ్బాయి, జి.గోవిందరావు, సీహెచ్ సత్యం, చెల్లారావు, జి.ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

## బదిలీలకు వ్యతిరేకంగా నిరసన

ఉపాధ్యాయ బదిలీలు కౌన్సెలింగ్ ద్వారా కాకుండా ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా చేపట్టడాన్ని నిరశిస్తూ కడపలో ఉపాధ్యాయ సంఘాలు జీవో కాపిలను కాల్చివేశారు. అక్రమ బదిలీలు నిర్వహిస్తూ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నందుకు నిరసనగా డీఈవో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూటియఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీరాజా, హెచ్.ఎం. సంఘం ప్రతినిధులు నారాయణరెడ్డి, రామసుబ్బరాజు, మడితాటి సరసింహారెడ్డి, ఏపీటీఎఫ్ ప్రతినిధులు శ్యామ్‌సుందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సి.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపి మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు మధ్యంత భృతి మరియు మూడు విడుతల డిఏను తక్షణమే విడుదల చేయాలి

ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి మరియు మూడు విడుతల డి.ఎ.ను వెంటనే విడుదల చేయాలని ఏపిఎంఎస్‌టిఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎన్.బోసుబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాల విద్యా కమీషనర్ ఆర్.సి.నెం.250/ఏ1/ఎపిఎంఎస్/2014, తేది:14.11.2014న జనవరి 2014 నుండి నవంబర్ 2014 వరకు 27 % మధ్యంతర భృతి మరియు రెండు విడతల డి.ఎ.ను జూన్ 2014 వరకు బకాయిలకు సంబంధించిన ప్రపోజల్స్ పంపించవలసినదిగా ప్రిన్సిపాల్స్‌కు ప్రొసిడింగ్స్ ఇచ్చారు. కానీ నవంబర్ నెల జీతాల బిల్లులో ఐ.ఆర్. మరియు మూడు విడతల డి.ఎ. చెల్లింపులు జరిగే విధముగా చర్యలు తీసుకోవాలన్నారు. సర్వీస్ రూల్స్ త్వరగా విడుదల చేసి, సి.పి.ఎస్. మరియు ఎ.పి.జి.ఎల్.ఐ. ను వర్తింపజేయాలని, ప్రసూతి మరియు పితృత్వ సెలవులకు సంబంధించిన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎ.పి.ఎం.ఎస్.టి.ఎఫ్. ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వి.రమణయ్య పాల్గొన్నారు. అధికారుల నిర్లక్ష్యం వలన ఇప్పటికి జీతాలు విడుదల కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

# విద్యా సదస్సులు

## ప్రకాశం జిల్లా

యుటియఫ్ 40వ జిల్లా కౌన్సిల్ సందర్భంగా మార్పులు, బల్లికువర, ఎస్.మాగులూరు, యద్దనపూడి మండల శాఖల ఆధ్వర్యంలో విజయలక్ష్మి కళ్యాణ మండపం, మార్టూరునందు 2014 నవంబర్ 30న జిల్లా ఆఫీస్ బేరరు అడుగుల శ్రీనివాసరావు, అధ్యక్షతన 'విద్యాసదస్సు' జరిగినది. తొలుత సిఐటియు నాయకులు ప్రభుదాస్‌గారు పాల్గొని సందేశాలిచ్చారు.

ఈసదస్సును మాజీ ఎమ్మెల్సీ డి.రామిరెడ్డిగారు ప్రారంభిస్తూ 1974లో ఆవిర్భవించిన యుటియఫ్, నిరంతరం ఉపాధ్యాయుల వెన్నంటి ఉంటూ వారి సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గుచూపుతున్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలల వైపు మళ్ళించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో యుటియఫ్ డైరి, మొదటిసారిగా మనమేతెచ్చాం. ఎస్‌టిఎఫ్ఐ ఆవిర్భావంలో కీలకపాత్ర, రెండుసార్లు, ఇద్దరు ఎమ్మెల్సీలను గెలిపించుకోవడం జరిగిందన్నారు.

జిల్లా విద్యాశాఖాదికారి శ్రీ బి.విజయబాస్కర్ గారు మాట్లాడుతూ మంచి సంఘానికుండవలసిన లక్షణాలన్ని యుటియఫ్‌కు ఉన్నాయన్నారు. పెరుగుచున్న విజ్ఞానానికి అనుగుణంగా ఉపాధ్యాయులు పుస్తక పఠనం చేయాలన్నారు. విద్యారంగంలో, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న యుటియఫ్‌ను అభినందించారు.

ముఖ్య అతిథిస్థానిక శాసనసభ్యులు ఏలూరు సాంబశివరావు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా శాఖ 40 కౌన్సిల్ మరియు విద్యా సదస్సు, రాజకీయ చైతన్యమున్న మార్టూరులో పెట్టడం ఆనంద దాయకమన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలుగా హాస్టల్స్‌ను తయారు చేస్తామన్నారు.

జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మోజు శ్రీనివాసరావుగారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతులు, రెగ్యులరైజేషన్ ప్రక్రియ వెంటనే చేపట్టాలని డి.ఇ.ఓ.ని కోరారు. ఈ ప్రభుత్వం తెచ్చిన కౌన్సిలింగ్ విధానాన్ని, అక్రమ బదిలీలను చేపట్టడం ద్వారా నష్టం కల్గుతుంది. దీన్ని నివారించాలని ఎమ్మెల్యే గార్ని కోరారు.

ఈ విద్యా సదస్సులో రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరెడ్డి, జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి గారు పాల్గొని ప్రసంగించారు.

అనంతరం మార్టూరు ప్రాంతీయ మండల శాఖల ఆధ్వర్యంలో 'భారీ ర్యాలీ' నిర్వహించడమైనది. ఈ ర్యాలీ విజయలక్ష్మి కళ్యాణ మండపం నుంచి నాగరాజుపాలెం సెంటర్ వరకు 3 కి.మీ. పొడవునా సాగింది.

## గంపలగూడెంలో ఎమ్మెల్సీ ఎన్నికల కార్యక్రమం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పనిలో భాగంగా కృష్ణా జిల్లా గంపలగూడెం మండలంలో ఉన్న అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఫామ్ – 19ను పూర్తి చేయడంలో అవగాహన కల్గించారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, పి.ఏడుకొండలు, గౌరవాధ్యక్షులు కె.వి.రత్నకుమార్ అసోసియేట్ అధ్యక్షులు ఎం.రాంప్రదీప్, ట్రెజరర్ కె.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విజయనగరం జిల్లా

నవంబర్ 30, డిసెంబర్ 1న జరుగనున్న యుటియఫ్ జిల్లా కౌన్సిల్ పోస్టరును జిల్లా కేంద్రంతో పాటు, అన్ని మండల కేంద్రాలలో ఆవిష్కరించారు. విద్యారంగ పరిరక్షణకై, వినాశకర విధానాలను తిప్పికొట్టేదానికి 'కదలిరండి – కలసి రండి – కదం తొక్కిరండి' అనే నినాదంతో వేసిన ఈ పోస్టరు జిల్లాలో విస్తృత ప్రచారాన్ని ఇచ్చింది.

గిరిజన సంక్షేమ, ఎయిడెడ్, మున్సిపల్, పంచాయితీరాజ్, సిఆర్‌టిలు, కెజిబివిలు, మోడల్ స్కూల్సు టీచర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని జయప్రదం చేయాలని జిల్లా నాయకత్వం ఉపాధ్యాయులకు పిలుపునిచ్చింది. బొబ్బిలిలో రా.స.అ. విజయగౌరి, విజయనగరంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఎ.శివవర్మ, డి.రాము, కె.శేషగిరి, కె.శ్రీనివాస్, కురుపాంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.మురళీ మోహన్‌తోపాటు, జిల్లా కార్యదర్శులు, ఎంఇఓలు మండలాల నాయకత్వాలు పోస్టరు ఆవిష్కరణలు చేసాయి.

## మహిళా టీచర్లు, బాలికలు సమస్యలపై ముఖ్యమంత్రికి పోస్టుకార్డు క్యాంపైయిన్

1.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చైల్డ్‌కేర్‌లీవ్‌ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని. 2. అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు సౌకర్యం కల్పించి శాశ్వత నిర్వహణ వ్యవస్థను ఇవ్వాలని. 3. పనివేళలు మార్చాలని. 4. హెల్త్‌కార్డులలో మహిళా ఉద్యోగుల అత్తమామలను డిపెండెంట్సుగా గుర్తించాలి.

అనే డిమాండ్లతో రాష్ట్ర ముఖ్యమంత్రికి పోస్టుకార్డు క్యాంపైయిన్ విజయనగరంలో చురుగ్గా జరిగింది. దానికి సంబంధించిన కరపత్రాలను ముద్రించి అన్ని మండల కేంద్రాలకు పంపారు. విజయనగరం జిల్లా కేంద్రంలో కరపత్రాన్ని రాష్ట్ర సహ అధ్యక్షులు కె.విజయగౌరి, జిల్లా సహ అధ్యక్షులు జి.నిర్మల, జిల్లా కార్యదర్శి జి.పార్వతి, జిల్లా కార్యదర్శి సభ్యులు షేక్‌జైనాబీ విడుదల చేశారు.

## దత్తత పాఠశాలల్లో యుటియఫ్ సామాజిక కార్యక్రమాలు

విజయనగరం జిల్లాలో మక్కువ, బొబ్బిలి పట్టణంలో విద్యావికాస ఉద్యమంలో భాగంగా దత్తత తీసుకున్న పాఠశాలల్లో బ్యాగులు,నోటు పుస్తకాలు, పెన్నులు, దుస్తులు పంపిణీ చేశారు. బొబ్బిలి పట్టణంలో రామన్న దొరవలస, ఐ.టి.ఐ.కాలనీ, ఇందిరమ్మ కాలనీలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తెర్లాం మండలంలో 4 ఉన్నత పాఠశాలల్లో టాలెంటు టెస్టులలో ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన 16 మంది విద్యార్థినీ విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. మక్కువ మండలంలోని పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు, విద్యార్థులకు హెల్త్‌క్లాసులు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో మండల విద్యాశాఖాధికారులు, మున్సిపల్ ఛైర్‌పర్సన్, మండల అభివృద్ధి అధికారులు, బొబ్బిలి పట్టణ నాయకులు ఎస్.అచ్యుత రావు, పి.సత్యన్నారాయణ, మహేష్, రాధాకృష్ణ, జిల్లా కార్యదర్శి పి.మధుసుదనరావు, జి.మురళీకృష్ణ, పోలినాయుడు, తెర్లాం నాయకులు ఎన్.అజయ్ కుమార్, ఎం.సింహాచలం, ఎం.ఉమా మహేశ్వరరావులు పాల్గొన్నారు.

# జిల్లా కౌన్సిల్ సమావేశాలు

## శ్రీకాకుళం

యుటియఫ్ శ్రీకాకుళం జిల్లా 9వ విద్యావైజ్ఞానిక మహాసభలు నవంబర్ 8,9 తేదీలలో సోంపేట మహర్షి విద్యానికేతన్‌లో 1500 మంది ఉపాధ్యాయులతో విజయవంతంగా నిర్వహించబడినాయి.

నవంబర్ 8 ఉదయం ఉపాధ్యాయుల మహార్యాలీతో సోంపేట పట్టణంలో ఉపాధ్యాయుల నినాదాలతో మార్మోగిపోయింది. ర్యాలీని సోంపేట సర్పంచి శ్రీమతి చిత్రాడ నాగరత్నం ప్రారంభించగా ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

అనంతరం జాతీయ పతాకాన్ని ఎం.పి.పి. చిత్రాడ శ్రీనివాసరావు, యుటియఫ్ పతాకాన్ని యర్రా విశ్వనాథం, ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని ఎస్.జానకీ రామయ్య ఆవిష్కరించారు.

ప్రారంభసభకు యుటియఫ్ జిల్లా అధ్యక్షులు గొంటి గిరిధర్ అధ్యక్షత వహించగా ఆహ్వాన సంఘ అధ్యక్షులు శ్రీ ఇళ్ల షణ్ముఖరావు ఆహ్వాన సంఘ అధ్యక్షోపన్యాసం చేశారు.

ముఖ్య అతిథి ఎం.వి.ఎస్.శర్మ ఎమ్మెల్సీ ప్రసంగిస్తూ ప్రభుత్వ విద్యారంగ రక్షణ కోసం ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు ప్రసంగిస్తూ విద్యారంగ సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ ప్రసంగిస్తూ ప్రభుత్వ విద్యారంగం పరిపుష్టం చేసేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. కంచిలి ఎంపిపి ఇప్పిలి లోలాక్షి కృష్ణారావు, నవీన్ కుమార్ అగర్వాల్ (బబ్లూ) తదితరులు సందేశాలిచ్చారు.

రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రెండవరోజు ప్రతినిధుల సభ జిల్లా అధ్యక్షులు గిరిధర్ అధ్యక్షతన జరుగగా జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి రవీంద్ర కార్యదర్శి నివేదిక, పాందురు అప్పారావు ఆర్థిక నివేదిక, కె.వి.శ్రీరామమూర్తి ఆడిట్ నివేదిక ప్రవేశపెట్టారు. మండల కమిటీలు చర్చలో పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి శ్రీమతి ఎస్.అరుణకుమారి డివైఇఒ లు కె.అప్పారావు, సామంత్‌లు సందేశాలిచ్చారు. రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి ఎన్నిల అధికారిగా వ్యవహరించగా జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది.

### నూతన కమిటీ

జిల్లా గౌరవ అధ్యక్షులుగా కె.కామేశ్వరరావు జిల్లా అధ్యక్షులుగా రెడ్డి మోహన్‌రావు, సహాధ్యక్షులుగా ఎస్.కిశోర్‌కుమార్, ఎం.వాగ్దేవి జిల్లా ప్రధాన కార్యదర్శిగా చౌదరి రవీంద్ర, కోశాధికారిగా పి.అప్పారావు కార్యదర్శులుగా ఎన్.జగదీశ్వరరావు, ఆరిక భాస్కరరావు, బి శ్రీరామమూర్తి, పి.ధర్మారావు, బి.చిట్టిబాబు, డి.ప్రకాశరావు, ఎస్.వెంకట రావు, కె.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు, కె.వి.శ్రీరామమూర్తి, ఎల్.బాబూరావు, కె.వైకుంఠరావు, కె.రాజారావు, ఆర్.దమయంతి, వి.ఎల్.సుబుద్దిలను ఏకగ్రీవంగా మహాసభ ఎన్నుకొంది.

## విజయనగరం

విజయనగరం జిల్లా 8వ జిల్లా మహాసభలు నవంబర్ 30, డిసెంబర్ 1 తేదీలలో విజయనగరం జరిగాయి. తొలుత మెసానిక్ టెంపుల్ కూడలి నుండి ఆనంద గజపతి ఆడిటోరియం వరకు ఉపాధ్యాయులు యుటియఫ్ జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు.

ర్యాలీ అనంతరం రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి యుటియఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.శివవర్మ తెలుగుతల్లి విగ్రహానికి పుష్పములు వేశారు. తరువాత జరిగిన సదస్సుకు జిల్లా అధ్యక్షులు డి.రాము అధ్యక్షత వహించారు. సహాధ్యక్షులు కె.విజయగౌరి సదస్సును ప్రారంభిస్తూ సమగ్ర విద్యాభివృద్ధికై అన్ని కోణాల నుంచి చర్చ జరగాలని అన్నారు. నూతన ప్రభుత్వాలు విద్యా రంగంలో వెగులు తెస్తామని ఆశించినా సంస్కరణలు ప్రారంభ మయ్యాయని అన్నారు. విద్యా వికాస ఉద్యమాన్ని జయప్రదంగా నిర్వహించిన విజయనగరం జిల్లా యుటియఫ్ కార్యకర్తలు కొన్ని విజయాలను సాధించడం ముదావయమన్నారు. ఏడాదికేడాది సంస్కరణల వేగం పెరుగుతుందని, తిప్పికొట్టే ఉపాధ్యాయ ఉద్యమాన్ని నిర్మించుకోవాలన్నారు.

ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ మాట్లాడుతూ దేశ విద్యారంగంలో నాణ్యమైన విద్య సాధించేందుకు కామన్ స్కూల్ వ్యవస్థకోసం ఉపాధ్యాయులంతా ఐక్యమై పోరాడాలని పిలుపునిచ్చారు. విద్యారంగం దేశంలో అనేక ఉద్యమాలకు కేంద్రంగా మారిందని అన్నారు. కార్పోరేట్ భారాలను మోయవలసి వస్తుందని, ఉపాధ్యాయులకు ఈ భారాలు తప్పడంలేదన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రతిఘటనా శక్తిని పెంచుకోవాలన్నారు.

కెవిపిఎస్ నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యారంగంలో మార్పుల వలన దళితులు, గిరిజనులు, వృత్తిదారులకు అన్యాయం జరుగుతుందని, ప్రాథమిక స్థాయిలో నాణ్యమైన విద్యకు దూరం కావడం అంటే విద్యాహక్కు చట్టాన్ని వారించడమేనన్నారు. కామన్ స్కూల్ వ్యవస్థ వలన అందరికీ ఒకే రకంగా చదువు అందుతున్నారు.

సి.ఐ.టి.యు. జిల్లా ప్రధానకార్యదర్శి టి.సూర్యనారాయణ గారు మాట్లాడుతూ జిల్లాలో సమగ్ర విద్య అభివృద్ధి జరగాలంటే ప్రజల ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలన్నారు. ఈ సభలో జిల్లా ప్రధానకార్యదర్శి కె.శేషగిరి మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమానికి యుటియఫ్ వేగుచుక్కగా ఉందని, విద్యావికాస ఉద్యమం, స్థానిక సమస్యలపై పోరాటాలు, యుటియఫ్ అనుబంధ సంఘాల ఏర్పాటు వంటి అనుకూల అంశాలతో భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. అనంతరం మోడల్ స్కూల్ టీచర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరరావు, ఐటిడిఏ శివవర్మ, జి.నిర్మల, కె.శ్రీనివాస్, జిల్లా ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

2వ రోజు జరిగిన ప్రతినిధులసభలో రాష్ట్ర సహ అధ్యక్షులు కె.విజయగౌరి,రాష్ట్ర కార్యదర్శి కె.ఎస్.ఎస్. ప్రసాద్‌లు పాల్గొని ప్రసంగించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శేషగిరి కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. నివేదికపై 31 మండల శాఖలు చర్చలలో పాల్గొన్నాయి. భవిష్యత్ కార్యాచరణపై గుణాత్మకమైన చర్చ

జరిగింది. అనంతరం పాఠశాల, ఉపాధ్యాయుల సమస్యలపై, మేనేజ్‌మెంట్ల వారీ సమస్యలపై 35 తీర్మానాలను జిల్లా ఆఫీస్ బేరర్లు ప్రతిపాదించగా కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. నూతన కమిటీ నిర్మాణాన్ని, రాష్ట్ర కార్యదర్శి ఎన్నికల అధికారిగా వచ్చిన కెవిఎస్‌ఎస్ ప్రసాద్ నిర్వహించారు.

### నూతన కమిటీ

గౌరవ అధ్యక్షులు అల్లూరి శివవర్మ, అధ్యక్షులు ఎస్.మురళీ మోహన్, ప్రధాన కార్యదర్శి కె.శేషగిరి, సహ అధ్యక్షులు జి.వెంకటరావు, జి.నిర్మల, కోశాధికారి కె.శ్రీనివాసరావు. కార్యదర్శులు ఇ.రాములప్పుడు, ఎం.కృష్ణారావు, ఎన్.శ్రీరాములు, జి.వెంకట నాయుడు, టి.రమేష్, ఎం.అప్పలనాయుడు, ఎ.సత్యశ్రీనివాస్, పి.శ్రీనివాస రావు, జెవిఆర్‌కె ఈశ్వరరావు, పి.మధుసుదనరావు, వై.స్వామినాయుడు, జి.పార్వతి, జె.రమేష్ చంద్రపట్నాయక్, పి.లక్ష్మణరావు, వి.ప్రసన్నకుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎస్.నాగరాజు.

## విశాఖపట్టణం

విశాఖపట్టణం జిల్లా మహాసభలు తేది. 23.11.2014 న తగరపువలసలో జరిగాయి. ఈ సమావేశమునకు ముఖ్య అతిథులు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ హాజరైనారు. ఈ సమావేశం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు హాజరైనారు. ప్రత్యేక ఆహ్వానితులుగా శ్రీకాకుళం జిల్లా ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మాజీ అధ్యక్షులు జి.గిరిధర్ హాజరైనారు. జిల్లా మహాసభలలో భాగంగా జరిగిన విద్యా సదస్సుకు ఆనందపురం, పద్మనాభం, బీమిలి మండలాల మండల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, జెడ్.పి.టి.సి. సభ్యులు, జిల్లా విద్యశాఖాధికారి ఎం.వి.కృష్ణారెడ్డి హాజరైనారు.

ఉదయం యుటియఫ్ పతాక ఆవిష్కరణతో కార్యక్రమం ప్రారంభించుట జరిగినది. పతాకావిష్కరణ పద్మనాభ మండలము యుటియఫ్ అధ్యక్షులు బోని సన్యాసినాయుడు చేసిరి. విద్యా సదస్సునకు సభాధ్యక్షులుగా విశాఖ జిల్లా యుటియఫ్ అధ్యక్షులు కె.కె.జాజులు వ్యవహరించారు. సాయంత్రము జరిగిన కౌన్సిల్ ఎన్నికలలో ఈ క్రింది వారిని విశాఖ జిల్లా ప్రధాన బాధ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకొనుట జరిగింది.

### నూతన కమిటి

గౌరవ అధ్యక్షులు ఆర్.రామకొండా రావు, అధ్యక్షులు కె.కె. జాజులు, సహాధ్యక్షులు ఎస్.ఎస్.నాగమణి, డి.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వై.ఆర్.కె.ప్రసాద్, ట్రెజరర్ టి.అప్పారావు.

## తూర్పుగోదావరి

విద్యా వ్యాపారాన్ని, ప్రయివేటీకరణను అడ్డుకోవడం అంటే టీచర్ పోస్టులను నిలబెట్టుకోవడం కోసం కాదని దేశ భవిష్యత్‌ని కాపాడుకోవడంకోసమని కావున విద్యా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని శాసనమండలి సభ్యులు ఎం.వి.ఎస్.శర్మ ఉపాధ్యాయులకు పిలిపునిచ్చారు. నవంబర్ 8,9 తేదీలలో రాజోలులో యుటియఫ్ జిల్లా కౌన్సిల్ సందర్భంగా జరిగిన విద్యాసదస్సులో నవ్యాంధ్రప్రదేశ్ విద్యాభివృద్ధి' అనే అంశంపై ఆయన మాట్లాడారు. విద్యామానవ హక్కుగా ఉండాలని, అందరికీ ఒకే విధమైన విద్యనందించే కామన్ స్కూల్ విధానం ఉండాలని అన్నారు. డబ్ల్యు.టి.ఓ.లో విద్యను వ్యాపార వస్తువు గా చేశారని, ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఒక ట్రిలియన్ డాలర్ల విద్యావ్యాపారం జరుగుతోందని, అందులో 57 శాతం భారతదేశంలో ఉందని అన్నారు. ప్రాథమిక విద్యను స్వచ్ఛంద సంస్థలకు, సెకండరీ విద్యను పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్‌షిప్ పద్ధతిలోను, ఉన్నత విద్యను పూర్తిగా ప్రైవేటీకరించి నడపాలని ప్రభుత్వాలు ప్రయత్నం చేస్తున్నాయని, ఎయిడెడ్ స్కూళ్ళను నిర్వీర్యం చేశారని విమర్శించారు. నవ్యాంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్రప్రదేశ్ కావాలనే కలలు నిజం కావాలంటే మొదట విద్యాంధ్రప్రదేశ్ కావాలని అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు మొత్తంలో ఉన్న 60 వేల ప్రాథమిక పాఠశాలల్లో 40 వేల ప్రాథమిక పాఠశాలలు ఒకరు లేక ఇద్దరు ఉపాధ్యాయులతో పనిచేస్తున్నాయని, ప్రభుత్వం పాఠశాలలు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడం లేదని అన్నారు. ఉపాధ్యాయులుగా మనలోపం లేకుండా పాఠశాలల్లో పనిచేయాలని, ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించడానికి యుటియఫ్ విద్యా పరిరక్షణ ఉద్యమం ప్రారంభించిందని దీనికి అందరి సహకారం అవసరమని అన్నారు. స్థానిక శాసనసభ్యులు గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ నూతన సమాజం కోసం కృషి చేస్తున్న వారు ఉపాధ్యాయులేనన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసమే కాక విద్యాపరంగా మంచి కార్యక్రమాలు చేస్తున్న యుటియఫ్‌ను అభినందిస్తూ మీ మనిషిగా, మీ సమస్యలు పరిష్కరించేవాడిగా ఉంటానని అన్నారు. కార్యక్రమం తొలుత జాతీయ పతాకాన్ని శివకోడు గ్రామ సర్పంచ్ కసుకుర్తి రామకృష్ణ, ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు, యుటియఫ్ పతాకాన్ని సీనియర్ నాయకులు కడలి సత్యనారాయణ ఆవిష్కరించారు. 8వ తేదీన జిల్లా అధ్యక్షులు జి.ప్రభాకరవర్మ అధ్యక్షతన ప్రతినిధుల సభ జరిగింది. ప్రతినిధుల సభను మాజీ ఎమ్మెల్సీ కె.జార్జివిక్టర్ ప్రారంభించారు. ప్రతినిధుల సభలో ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు కార్యదర్శి నివేదికను, సంక్షేమ పథకం ప్రధాన కార్యదర్శి యస్‌యస్‌వి చలపతి సంక్షేమ పథకం నివేదికను, కోశాధికారి కె.వి.ప్రసాద్‌బాబు ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. నివేదికపై వివిధ శాఖల నుండి మాట్లాడారు. నివేదికలు ఏకగ్రీవంగా ఆమోదించబడ్డాయి. 9వ తేదీ మధ్యాహ్నం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అతి తక్కువ వ్యవధిలో జిల్లా కౌన్సిల్ జయప్రదంగా నిర్వహించిన రాజోలు మండల శాఖ వారికి సహకరించిన సఖినేటిపల్లి, మరికిపురం, మామిడికుదురు మండల శాఖలకు జిల్లా శాఖ పక్షాన ఉద్యమాభివందనాలు తెలియ జేసింది. విరాళాలిచ్చిన దాతలకు కృతజ్ఞతలు తెలిజేసింది.

### నూతన కమిటి

గౌరవాధ్యక్షులు జి.ప్రభాకరవర్మ, అధ్యక్షులు డి.వి.రాఘవులు, సహాధ్యక్షులు ఎన్.విశ్వనాథ్, సహాధ్యక్షురాలు ఎన్.అరుణకుమారి, ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు, కోశాధికారి కె.వరప్రసాద్‌బాబు, **కార్యదర్శులు :** యస్.జ్యోతిబసు, జోగా అప్పారావు, బి.శ్రీనివాసరావు, జి.సత్యనారాయణ, యం.వెంకటేశ్వరరావు, యంఆర్‌సి మోహన్, యం.విజయగౌరి, టి.వి.జి.జి.ఆర్.ఆర్.చక్రవర్తి, ఎ.షరీఫ్, టి.జి. వాషింగ్టన్, పి.నాగేశ్వరరావు, ఇ.చైతన్య కిరణ్, ఆర్.వి.రమణమూర్తి, ఓ.నాగేశ్వరరావు, యస్.యస్.వి.చలపతి, పి.వెంకటేశ్వరరావు, వి.సోనీ.

## పశ్చిమగోదావరి

పదో పీఆర్సీ వేతనాల పెంపును జులై – 2013 నుండి అమలు చేయాలని యూటియఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, జేఏసీ ప్రధాన కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి పెంటపాడు ఎస్టీవీఎస్ హైస్కూల్‌లో ది.16.11.14 ఆదివారం జిల్లా శాఖ యుటియఫ్ కౌన్సిల్ సమావేశం ఎస్.శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం దిశగా యుటియఫ్ పనిచేస్తుం దన్నారు. అక్టోబర్ 29న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేసినా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. దీనిపై నవంబర్ 19న చలో హైదరాబాద్ పేరిట మరోమారు తీవ్రంగా ఉద్యమం చేసేందుకు ఉపాధ్యాయులంతా తరలిరావాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులతోపాటు ఖాళీగా ఉన్న 564 ఎంఈవో పోస్టులు, 64 డిప్యూటీఈవో పోస్టులు, 79 డైట్ లెక్చరర్ పోస్టులు డీఎస్సీలో భాగంగా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 15 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటియఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సాబ్జి, జిల్లా గౌరవ అధ్యక్షుడు ప్రకాశరావు, సహాయ కార్యదర్శి జగన్‌మోహన్ రావు, ఎస్.జయప్రభ, కోశాధికారి పీవీ నరసింహరావు, ఎంఎస్ ప్రసాద్, ఎం.శ్యాంబాబు, యం.రామకృష్ణ, ఏవీవీ గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణా

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కృష్ణాజిల్లాశాఖ నూతన కౌన్సిల్ సమావేశము తే23.11.2014ది బొమ్మారెడ్డి సీతారెడ్డి కళ్యాణ మండపం, పామర్రు నందు జరిగినది.

ఉదయం యుటిఎఫ్ పూర్వ రాష్ట్రకార్యదర్శి పి.వెంకటేశ్వరరావు జాతీయ పతాకావిష్కరణ, ఎస్.పార్వతీశం యుటిఎఫ్ కృష్ణా జిల్లా శాఖ పూర్వ అధ్యక్షులు ఎస్‌టిఎఫ్ఐ పతాకావిష్కరణ మరియు పామర్రుమండల సీనియర్ నాయకులు సి.హెచ్.శామ్యూల్‌చే యుటిఎఫ్ పతాకావిష్కరణ చేయబడినది. అనంతరం డప్పువాయిద్యాలతో, 350మందికి పైగా కార్యకర్తలతో వేదిక బొమ్మారెడ్డి సీతారెడ్డి కళ్యాణమండపం నుండి పామర్రు పురవీధులలో ర్యాలీ నిర్వహించబడినది. ర్యాలీ అనంతరం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డిచే ప్రారంభ సభ ప్రారంభించబడినది. సభకు కృష్ణాజిల్లా అధ్యక్షులు కె.సంజీవరెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కె.ఎస్.లక్ష్మణరావు, బొడ్డునాగేశ్వర రావు, పామర్రు ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి డి.వి.కృష్ణ, పామర్రు తహసీల్దారు ఎ.వి.ఎన్.ఎస్ మూర్తి, పామర్రు సర్పంచ్ కుమారి దేవరకొండ రోహిణి గార్లు హజరై తమ సందేశాలను అందించారు.

ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమంలో యుటిఎఫ్ ద్వారా ఎన్నో సమస్యలు పరిష్కరించబడ్డాయన్నారు, ఎమ్మెల్సీ బొడ్డునాగేశ్వరరావు మాట్లాడుతూ రేషనలైజేషన్, బదిలీలు, ఉపాధ్యాయల సర్దుబాటు వంటివి విద్యాసంవత్సరం ప్రారంభంలోనే చేపట్టాలని, డియస్‌సి2014 ను వెంటనే ప్రకటించాలని, పిఆర్‌సి జులై 2013 నుంచి అమలు చేయాలని పేర్కొంటూ, అందుకు పిడిఎఫ్ ఎమ్మెల్సీల సహకారం పూర్తిగా ఉంటుందని చెప్పారు.

పామర్రు ఎమ్మెల్యే శ్రీమతి ఉప్పులేటి కల్పన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధిపై చిత్తశుద్ధిలేదని, కార్పోరేట్ విద్యారంగానికే పెద్దపీట వేస్తున్నదని, ఆర్‌టిఇని అమలు చేయలేక పోవడం దీనికి నిదర్శనం అన్నారు. ఉపాధ్యాయల బదిలీలు సకాలంలో చేపట్టలేకపోయిందని, రాష్ట్రవ్యాప్తంగా 95% పర్యవేక్షణాధికారులుగా ఇన్‌ఛార్జి అధికారులో నడుస్తుందని, ఉపాధ్యాయులు సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తుతాననీ తెలిపారు. విద్యారంగంలో ఉపాధ్యాయులం దరూ గుణాత్మక విద్యను అందించే దిశగా పనిచేయాలనీ పిలుపు నిచ్చారు.

సిఐటియు జిల్లాప్రధానకార్యదర్శి డి.వి.కృష్ణ మాట్లాడుతూ విద్యారంగంలో యుటిఎఫ్ పనితీరు మరింత పటిష్టంగా ఉండాలనీ, ప్రభుత్వవిద్యారంగాన్ని బలోపేతంచేయడానికి యుటిఎఫ్ విద్యావికాస వేదిక ఎంతో ఉపయోగకరమైనదనీ, రాబోయే రోజుల్లో యుటిఎఫ్ మరింత చక్కగా పనిచేయాలని ఆకాంక్షించారు. జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌రాజు వందన సమర్పణ చేశారు.

అనంతరం ప్రతినిధుల సభ జిల్లా అధ్యక్షులు కె.సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగినది. సంతాప తీర్మానాలు జిల్లా కార్యదర్శి శ్రీమతి కె.భగీరధి, కార్యదర్శి నివేదిక జిల్లా ప్రధానకార్యదర్శి కెఎ ఉమామహేశ్వరరావు, ఆర్థిక నివేదిక కోశాధికారి ఎన్‌పి మనోహర్‌కుమార్, ఆడిట్ నివేదిక మరియు ఐక్యఉపాధ్యాయ నివేదికలను జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎ.కృష్ణసుందరరావులు ప్రవేశపెట్టారు.

భోజన విరామం అనంతరం నివేదికలపై చర్చ జరిగింది. జిల్లాలోని 52 శాఖలకుగాను 37శాఖలు చర్చలో పాల్గొన్నాయి. జనరల్ తీర్మానాలను గౌరవాధ్యక్షులు జి.పాల్‌బాబూరావుగారు, విద్యావిషయక తీర్మానాలను సహాధ్యక్షురాలు శ్రీమతి డి.నవభారతి, వృత్తి సంబంధ తీర్మానాలను సహాధ్యక్షులు శ్రీ.జి.రమేష్ ప్రవేశపెట్టినారు. నివేదికలు మరియు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించబడినవి.

రాష్ట్ర ప్రధానకార్యదర్శి బాబురెడ్డి ప్రస్తుత విద్యారంగ పరిస్థితులను, సమస్యలను యుటిఎఫ్ ఉద్యమ స్ఫూర్తిని వివరించి కార్యకర్తలను ఉత్తేజితులను చేసినారు. జిల్లా కార్యదర్శి వర్రె రాధాకృష్ణ వందన సమర్పణ చేశారు. అనంతరం నూతన జిల్లా కమిటీల ఎన్నికను రాష్ట్ర కోశాధికారి ఎన్.తాండవకృష్ణ నిర్వహించినారు.

### నూతన కమిటి

గౌరవాధ్యక్షులు జి.వి.తాతారావు, అధ్యక్షులు ఎస్ పి మనోహర్ కుమార్, సహాధ్యక్షులు ఎంఎస్‌సి రాజ్, సహాధ్యక్షులు కె.భగీరధీ, ప్రధానకార్యదర్శి కెఎ.ఉమామహేశ్వరరావు, కోశాధికారి ఎ.కృష్ణసుందర రావు, కార్యదర్శులు ఎం.డేవిడ్‌రాజు, వి.రాధాకృష్ణ, షేక్ దస్తగిరి, డి శ్రీనివాసరెడ్డి, కర్రా వరప్రసాద్, జె.లెనిన్‌బాబు, బి.కనకారావు, ఎండి షౌకత్ హుస్సేన్, ఎం లక్ష్మీనారాయణ, ఎన్ రాజా, ఐ.కొర్నేలు, పి.శివకోటేశ్వరరావు, జి.వెంకటేశ్వరరావు, ఎం.అగస్టీన్, జి.లక్ష్మణరావు, డి.శ్రీనివాసరావు, ఎ సుందరయ్య, జి.శాంతకుమారి, వి.అనురాధ, ఆడిట్ కమిటీ కన్వీనర్, కె.వి.సుబ్బారావు.

## గుంటూరు

యుటియఫ్ గుంటూరు జిల్లా కౌన్సిల్ సమావేశాలు నవంబర్ 30, డిసెంబర్ 1 తేదీలలో పిడుగురాళ్ళలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా జరిగాయి. మొదటిరోజు జాతీయ పతాకాన్ని ప్రధానోపాధ్యాయిని కె.రామతులశమ్మ, యుటియఫ్ పతాకాన్ని ఆర్.సాల్మన్‌రాజు, ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని జి.ప్రభుదాస్ ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు జి.ప్రభుదాస్ అధ్యక్షతన ప్రారంభ సమావేశం జరిగింది. సమావేశాన్ని రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్.కె.సాబ్జీ

ప్రారంభించారు. సాబ్జి ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగం వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నదన్నారు. ఉపాధ్యాయుల స్థితిగతులను ఆలోచించకుండా ప్రైయివేటు విద్యాసంస్థలను ప్రోత్సహిస్తున్నదన్నారు. భవిష్యత్ యుటియఫ్ పోరాటాలకు ఉపాధ్యాయులు సిద్దంగా ఉండాలన్నారు. ముఖ్య అతిథి ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు ప్రసంగిస్తూ నిబద్ధత కలిగిన సంఘంగా యుటియఫ్ సమాజంలో గుర్తింపు పొందిందన్నారు. కనుకనే యుటియఫ్ ప్రతిపాదిత ఆరుగురు ఎమ్మెల్సీలు శాసనమండలిలో ఉన్నారన్నారు. మరో ముఖ్య అతిథి ఎమ్మెల్సీ కె.యస్.లక్ష్మణరావు ప్రసంగిస్తూ సమాజంలో వెనుకబడిన వర్గాలు తమ పిల్లలను చదివించడానికి ముందుకు వస్తున్నారన్నారు. యుటియఫ్ వారికి సహకరించేలా పనిచేయడం హర్షనీయమన్నారు. ప్రభుత్వం కొత్తగా ప్రయివేటు యూనివర్సిటీలకు అనుమతి ఇవ్వడం బదులు ఉన్న ప్రభుత్వ యూనివర్సిటీలను అభివృద్ధి చేయాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే యరపతనేని శ్రీనివాసరావు ప్రసంగిస్తూ ఖాళీగా ఉన్న ఎం.ఇ.ఓ. పోస్టుల భర్తీకి, పాఠశాలలకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాచవరం జెడ్పిటి.సి లాలిబాయి, దాచేపల్లి జడ్పిటిసి ఎం.ప్రకాశ్‌రెడ్డి, యుటియఫ్ రాష్ట్ర కోశాధికారి ఎన్.తాండవకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతరావు, రాష్ట్రకార్యవర్గ సభ్యులు బి.విజయసారధి తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం పిడుగురాళ్ళ పట్టణంలో వందల మంది ఉపాధ్యాయులతో మహాప్రదర్శన నిర్వహించబడింది.

రెండవ రోజు స్థానిక భవనాసి కళ్యాణ మండపంలో ప్రతినిధులసభ జరిగింది. జిల్లా అధ్యక్షులు జి.ప్రభుదాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని కౌన్సిల్ సమావేశాలను ప్రారంభించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంత రావు కార్యదర్శి నివేదికను, కోశాధికారి పి.ప్రేమ్‌కుమార్ ఆర్థిక నివేదికను, ఆడిట్ కన్వీనర్ డేవిడ్‌రాజు ఆడిట్ నివేదికను ప్రవేశపెట్టారు. చర్చలు అనంతరం నివేదికలు ఏకగ్రీవంగా ఆమోదించబడ్డాయి. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు ఎన్నికల అధికారిగా నూతన కమిటి ఏకగ్రీవంగా ఎన్నికైనది.

### నూతన కమిటి

గౌరవాధ్యక్షులు ఎ.నాగేశ్వరరావు, అధ్యక్షులు కె.నాగమల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతరావు, సహాధ్యక్షులు జి.విజయసారధి, శ్రీమతి టి.వినోద, కోశాధికారి పి.ప్రేమ్‌కుమార్ కార్యదర్శులుగా ఎన్.కుమార్‌రాజా, ఎం.డి.గౌస్, కె.విజయభాస్కర్, ఎన్.వెంకటేశ్వర్లు, కె.సాయిప్రసాద్, కె.శ్రీనివాసరెడ్డి, ఎస్.కె.గాలీబ్‌సాహెబ్, ఎం.కళాధర్, జి.శివపూర్ణయ్య, బి.ఆదిలక్ష్మీ, పి.ఐ.పాల్‌రాజు, ఐ.డేవిడ్‌రాజు, బి.నరసింహరెడ్డి, టి.అరుణ్‌కుమార్, జె.వినయ్‌కుమార్, ఎం.డి.గయా సుద్దేలా, డి.లక్ష్మీపార్వతి, యమ్.మోహనరావు, డి.థోమాసయ్య.

### ప్రకాశం

యుటియఫ్ జిల్లా శాఖ 40వ జిల్లా కౌన్సిల్ సమావేశము మార్టూరు, బల్లికురవ, సంతమాగుతూరు, యద్దనపూడి మండల శాఖ ఆధ్వర్యంలో విజయలక్ష్మి కళ్యాణమండపం, మార్టూరు నందు 2014 నవంబర్ 29,30 తేదీలలో విజయవంతంగా జరిగినది. ఈ సమావేశానికి అధ్యక్ష వర్గంగా జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి, గౌరవాధ్యక్షులు పి.జాన్ విలియం, సహాధ్యక్షులు డి.వీరాంజనేయులు వ్యవహరించారు. డాక్యుమెంటేషన్ కమిటీ సభ్యులుగా ఎస్.పాపారావు, ఓ.వి.వీరారెడ్డి, పి.జయరావు వ్యవహరించారు.

తొలుత యుటియఫ్ పతాకాన్ని అధ్యక్షులు పి.రమణారెడ్డి, ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరెడ్డి, జాతీయ పతాకాన్ని శాసనమండలి సభ్యులు యండపల్లి శ్రీనివాసులురెడ్డి ఆవిష్కరించారు.

తొలిరోజు ఎమ్మెల్సీ వై.శ్రీనివాసులురెడ్డి ప్రారంభిస్తూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో బడ్జెట్ కేటాయింపులు సరిగా కేటాయించడం లేదు. విద్యారంగంలో కార్పోరేట్, ప్రైవేటు శక్తులకు పెద్దపీట వేస్తున్నారు. అన్ని మేనేజ్‌మెంట్లలో పని చేస్తున్న ఉపాధ్యాయుల వివిధ సమస్యలు ఆవిస్మృతంగా ఉన్నవి. కౌన్సిలింగ్ విధానాన్ని తూట్లు పొడుస్తూ అక్రమ బదిలీలు చేయడం శోచనీయం అన్నారు. రాబోయే రోజుల్లో విద్యారంగంలో కృషికి యుటియఫ్ పనిచేయాలని, ఈ కౌన్సిల్ సమావేశాలు విజయవంతం కావాలని తెలియజేశారు.

జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మోజు శ్రీనివాసరావు గత 2 సం॥ల కార్యకలాపాల నివేదిక ప్రవేశపెట్టారు. కోశాధికారి జి.హరిబాబుగారు ఆర్థిక నివేదిక, ఆడిట్ నివేదికను కె.కృష్ణమూర్తి, కుటుంబ సంక్షేమ పథక నివేదికను డి.వీరాంజనేయులు జిల్లా వార్తలు నివేదికను కె.ఆదినారాయణ గారు ప్రవేశపెట్టారు.

తదుపరి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర విధానాలు కార్పోరేట్లకు అనుకూలంగా ఉన్నాయన్నారు. స్వదేశీ విధానమంటూ విదేశీయులకు లాభాలు ఆర్జించే పనిలో ఉన్నాయి. మతోన్మాదం, సిలబస్ మార్పు కేంద్రం సిద్ధమైనది. క్లస్టర్ స్కూల్స్ రాజస్థాన్, మహారాష్ట్రలో ప్రవేశపెడితే వేలాది ప్రభుత్వ పాఠశాలలు మూతబడ్డాయన్నారు. మనరాష్ట్రంలో పశ్చిమగోదావరి జిల్లాలో ప్రవేశపెట్టనున్నారు. క్లస్టర్ స్కూల్స్ ఏర్పాటు చేసిన కార్పోరేట్ శక్తులకు అప్పగించే ప్రమాదం ఉందన్నారు.

మాజీ ఎమ్మెల్సీ డి.రామిరెడ్డి మాట్లాడుతూ కౌన్సిలింగ్‌ను నిలుపుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎం.ఇ.ఓ., డి.ఇ.ఓ. పోస్టు భర్తీ లేకపోవడం వల్ల పాలన కుంటుపడుతుంది. సమావేశంకు వచ్చి విన్నవాటిని ఆచరిస్తే దేన్నైనా సాధించవచ్చు అన్నారు. రాష్ట్ర కార్యదర్శి యం.వెంకటేశ్వరరెడ్డిగారు మాట్లాడుతూ సర్దుబాటు విషయాలు, పదోన్నతులు విషయాలు తెలియజేశారు. పోరాటాలకు సిద్దంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం నివేదికపై 48 శాఖల ప్రతినిధులు చర్చల్లో పాల్గొని సంఘ కృషిని అభినందిస్తూ, పలుసూచనలు చేశారు.

రెండవ రోజు ఉదయం 'విద్యాసదస్సు' నిర్వహించడమైనది. ఈ సదస్సులో జిల్లా విద్యాశాఖాధికారి బి.విజయబాస్కర్‌గారు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుగారు హాజరైనారు. సదస్సు అనంతరం ర్యాలీ నిర్వహించడమైనది. భోజనానంతరం ప్రధాన కార్యదర్శి చర్చలపై వచ్చిన వాటికి వివరణ యివ్వడం, నివేదికలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించినది. అనంతరం రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరెడ్డి ఎన్నికల అధికారిగా కె.హనుమంతరావు అధ్యక్షతన మాజీ ఎమ్మెల్సీ డి.రామిరెడ్డి సమక్షంలో ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది.

### నూతన కమిటి

గౌరవాధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరెడ్డి, అధ్యక్షులు డి.వీరాంజనేయులు, సహాధ్యక్షులు జె.కేశవరాజు, పి.రాజసులోచన, ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి, కోశాధికారి ఎస్.రవి, ఆఫీసు బేరర్లుగా ఓ.వి.వీరారెడ్డి, పి.మహంతునాయక్, డి.బంగారయ్య, ఆర్.ఎం.ఝాన్సీ పాల్, ఎం.రామ్మోహన్‌రావు, పి.రమణారెడ్డి, ఎన్.రామచంద్రారెడ్డి, ఎం.శ్రీనివాసరాజు, పి.ప్రభాకర్, ఎస్.వి.కొండారెడ్డి, జి.రాజశేఖర్, బి.వి.రత్నం, ఎ.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరెడ్డి, ఎస్.పాపారావు, జి.నాగేశ్వరరావు, కె.ఝాన్సీలక్ష్మి, కె.వి.ప్రసాద్, ఆడిట్ కమిటి కన్వీనర్ వి.ఎస్.కె. రాజేశ్వరరావు

## నెల్లూరు

2014 నవంబర్ 23,24 తేదీలలో జిల్లా కౌన్సిల్ సమావేశాలు కావలి పట్టణంలో జరిగాయి. కావలి (టి), కావలి(ఆర్),కొండాపురం, జలదంకి, బోగోలు, కలిగిరి శాఖలు ఆతిథ్యమిచ్చాయి. 23వ తేదీన ప్రారంభ సభ, విద్యా సదస్సు, ఉద్యమ సదస్సు మరియు ప్రదర్శన జరిగాయి.

పతాకావిష్కరణతో 23వ తేదీ విశ్వోదయ బాలుర పాఠశాల ఆవరణము, కావలి నందు కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. జాతీయ పతాకాన్ని పిడియఫ్ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని సీనియర్ నాయకులు టి.కొండాచారి ఉద్యమ పతాకాన్ని సీనియర్ నాయకులు ఆకుల రమణయ్య ఆవిష్కరించారు. జిల్లా గౌరవ అధ్యక్షులు పి.జానకిరాం అధ్యక్షతన ప్రారంభసభ జరిగింది. ఎమ్మెల్సీ వై.శ్రీనివాసులురెడ్డి ప్రారంభ ఉన్యాసం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం పాలన చేపట్టి 6 నెలలు గడిచినా ప్రజలకిచ్చిన హామీలు ఏ ఒక్కటీ పరిష్కరించకుండా కాలయాపన చేయడం ఆందోళన కలిగిస్తుందన్నారు. కంప్యూటర్ టీచర్ల నియామకం లాంటివి పరిష్కారం కావడం లేదన్నారు. యుటియఫ్ చేసే కార్యక్రమాల్లో ఒక కార్యకర్తగా పాల్గొంటూ ఉపాధ్యాయులకు అండగా ఉంటానని తెలియజేశారు. డిబిఎస్ ఇంజనీరింగ్ కాలేజి కరస్పాండెంట్ డి.వెంకటేశ్వర్లు నాయుడు, సీనియర్ నాయకులు టి.కొండాచారి గార్లు సందేశాలిచ్చారు.

విద్యాసదస్సు సీనియర్ నాయకులు ఎల్.గుణశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. నాగార్జున యూనివర్సీటీ ఆచార్యులు అంజిరెడ్డి నవ్యాంధ్ర ప్రదేశ్‌లో సమగ్రాభివృద్ధి అనే అంశంపై ఉపన్యసించారు. అభివృద్ధి నిర్వచనాలు, రాజకీయ పార్టీల లక్ష్యాలు, సామాజిక ఆవశ్యకతలపై వివరించారు. రాజకీయ పార్టీలు చెప్పే మాటలకు, ఆచరణలో చేపడుతున్న కార్యక్రమాలకు మధ్య పొంతన వుండడం లేదన్నారు. మేధావివర్గమైన ఉపాధ్యాయులు అధ్యయనం చేయాలన్నారు. జిల్లా సదస్సుకు 2 వేలకు పైగా ఉపాధ్యాయులను సమీకరించడం, స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల వైద్యులు డా॥ యం.వి.రమణయ్యగారు ప్రభుత్వ ఆరోగ్య పథకంపై వివరించారు.

మధ్యాహ్నం భోజనానంతరం ఉద్యమ సదస్సు జిల్లా అధ్యక్షులు శ్రీహరి అధ్యక్షతన జరిగింది. పిడియఫ్ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం గారునేటి విద్యారంగం- ఉపాధ్యాయ ఉద్యమంపై ఉపన్యసించారు. ప్రభుత్వ విద్యారంగం రోజురోజుకు కునారిల్లుతున్న ఈ పరిస్థితుల్లో నేటి ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించక పోవడం దురదృష్టకర మన్నారు. ఆర్‌టిఇ చట్టం అమలు లోపభూయిష్టంగా వుందన్నారు. క్లస్టర్ స్కూళ్ళ పేరుతో చేస్తున్న సర్వేలు, మ్యాపింగ్‌లలో శాస్త్రీయత లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చేపట్టే ప్రత్యామ్నాయ విధానాలను ముందుగా సంఘాలతోను, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలతోను, విద్యావేత్తలతోను చర్చించాలన్నారు. రోజువారీ ఉపాధ్యాయ సర్వీసు సమస్యలు, వేతన బత్యాల సమస్యలతోపాటు ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు పెద్దఎత్తున ఉద్యమించాల్సి ఉందన్నారు. ఇదే విషయాన్ని శాసనమండలిలోనూ చర్చించామన్నారు. మహిళా సమస్యలపై యుటియఫ్ రాష్ట్రకార్యవర్గ సభ్యులు బి.శ్రీదేవి మాట్లాడారు. తదనంతరం మహా ప్రదర్శన జరిగింది. కావలి పురవీధులు తప్పెట్లు, నినాదాలతో మారుమోగాయి.

నవంబర్ 24వ తేదీన డిబిఎస్ ఇంజనీరింగ్ కాలేజి, మద్దూరు పాడు, కావలి నందు నూతన జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షుడు సిహెచ్ శ్రీహరి అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి, రాష్ట్ర కార్యదర్శి యం.వెంకటేశ్వరరెడ్డి గార్లు పాల్గొన్నారు. ఉద్యమ సందేశాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డిగారు యిస్తూ, నేటి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పట్ల సాచివేత వైఖరితో ఉండడం వలన జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఐక్య ఉద్యమాలను మొదలు పెట్టామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.పరంధామయ్య కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. జిల్లా కోశాధికారి కె.నాగిరెడ్డి ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. జి.వి.భాస్కర్ కుటుంబ సంక్షేమ పథకం నివేదికను ప్రవేశపెట్టారు. 46 శాఖలు చర్చలలో పాల్గొన్నాయి. చర్చల అనంతరం ప్రధాన కార్యదర్శి ప్రవేశపెట్టిన నివేదికను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించడమైనది. అనంతరం నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి యం.వెంకటేశ్వరరెడ్డి వ్యవహరించారు.

### నూతన కమిటి

గౌరవాధ్యక్షులు పి.జానకీరాం, అధ్యక్షులు యం.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి కె.పరంధామయ్య, అసోసియేట్ అధ్యక్షులు జి.జె.రాజశేఖర్, వి.రమాదేవి, కోశాధికారి కె.నాగిరెడ్డి, కార్యదర్శులు జి.వి.భాస్కర్, యన్.వి.సుబ్బారావు, పి.జనార్థనం, కె.తులసీరాంబాబు, కె.చంద్రశేఖర రెడ్డి, ఎన్.నవకోటేశ్వరరావు, ఎ.మురళీధర్‌రావు, జి.వి.చలపతి శర్మ, కె.కుమారస్వామి, టి.స్వర్ణలత, ఎస్.కె.ఖాజా మొహిద్దీన్, వి.వి.శేషులు, ఎన్.కె.నాయుబ్, పి.చిరంజీవి, వి.వెంకటేశ్వర్లు, జి.వెంకటేశ్వర్లు, పి.రామమూర్తి, పి.వెంకట్రావు, ఎస్.కె.ఖాజావలి.

## చిత్తూరు

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ చిత్తూరు జిల్లా 39వ జిల్లా కౌన్సిల్ సమావేశము స్థానిక లయన్స్‌క్లబ్ కార్యాలయంలో జరిగింది. ఈ కౌన్సిల్ సమావేశంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, పట్టభద్రుల ఎమ్మెల్సీ వై.శ్రీనివాసులురెడ్డి, రెడ్డెప్ప రెడ్డిలు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగం పట్ల చిన్నచూపు చూస్తున్నదని, రేషనలైజేషన్ పేరుతో పాఠశాలలను కుదింపుకు శ్రీకారం చుడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. నవ్యాంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం కోసం శాసన మండలిలో చర్చను పి.డి.యఫ్. ఎమ్మెల్సీలు ప్రారంభించి నా ఆచరణలో కార్యరూపం దాల్చడంలేదని తెలిపారు. ఎమ్మెల్సీ వై.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ "అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్" ఈ జిల్లాలో వెంటనే భర్తీ చేసి పాఠశాలల్లో వెనుకబడిన పాఠ్యాంశాల మీద శ్రద్ధ తీసుకోవాలని కోరారు. డిఎస్సీ నియామకాలలో జాప్యం వలన విద్యారంగం మరింత కుదేలు అయిందని ఆవేదన వ్యక్తంచేశారు. మానిటరింగ్ పోస్టులైన డిఇఓ, డివైఇఓ, ఎంఇఓ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని లెక్చరర్స్ పోస్టుకు అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలని కోరారు. పి.ఆర్.సి. సబ్ కమిటి వెంటనే నియమించి రావలసిన బకాయిలను 01.07.2013 నుండి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సి.పి.ఎం. ప్రధాన కార్యదర్శి కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ''మానవ పెట్టుబడులతో ప్రభుత్వ పాఠశాలల్లో'' బలోపేతం చేయాలని, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు బకాయిలు చెల్లించాలని, ఏకరూప దుస్తుల్లో ఆలస్యాన్ని విడనాడి త్వరగా యూనిఫాం అందజేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు శ్రీరామూర్తి మాట్లాడుతూ జిల్లాలోని ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో అధికారులు అలసత్వాన్ని ఎండగట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సోమచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని హెల్త్‌కార్డుల అమలు ఇతర రాష్ట్రాల్లోని ఆసుపత్రులకు వాటిని అనుబంధం చేయాలని కోరారు.

